ఆంధ్రపత్రిక

REGD. No M4479

సచిత్ర వార పత్రిక



4 అణాలు
26-9-'51

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY

ఆజాద్ కళాకేంద్ర బాలికల నృత్యప్రదర్శన



మచిలీపట్నం ఆజాద్ బాలికా పాఠశాల సహాయార్థం, ఆజాద్ కళాకేంద్రం బాలికలు యిటీవల మద్రాసు సెంట్ మేరీ హాలులో నృత్యప్రదర్శన గావించారు. పై చిత్రం 'రాధాకృష్ణలో' ఒక భంగిమ. రాధ—సులోచనా కుమారి; కృష్ణుడు—ఆండాళ్ళు.

విషయానుక్రమణిక
26 సెప్టెంబరు 1951

ముఖచిత్రం:

రాజకీయాలు:

సీరియల్:

కథానికలు:

సినీమా:

బొమ్మరిల్లు:

గేయం:

[గతవారపు ముఖచిత్రం 'షిన్ షినాకీ బుబ్లాబూ' హిందీచిత్రంలో 'రెహానా'



ఆంధ్రపత్రిక

సంవత్సర చందా
రు. 12-0-0
విడిపత్రిక
4 అణాలు

ప్రతి బుధవారము
ప్రకటింపబడును
Founder : K. NAGESWARA RAO

సంపుటము 43
సంచిక 54
26-9-51

ఖర సంవత్సర భాద్రపద బహుళ ఏకాదశి బుధవారము

స్వామిసీతారాం దీక్షా విరమణ


శ్రీ వినోబా భావేగారి విజ్ఞప్తిని పురస్కరించుకుని స్వామి సీతారాంగారు గుంటూరులో 20 వ తేదీ గురువారం మధ్యాహ్నం 12-30 కి ప్రాయోపవేశ దీక్షను విరమించారు. స్వామీజీతో సహా ప్రాయోపవేశం ప్రారంభించినవారూ, తరువాత ప్రారంభించినవారు కూడా దీక్ష విరమించారు.

స్వామీజీని దీక్ష విరమించవలసిందిగా విజ్ఞప్తిచేస్తూ, "మీరు దీక్ష కొనసాగించడం వల్ల మీ ఆశయసాధనకు ప్రతిబంధకం ఏర్పడుతున్నట్లు కనపడుతున్నది" అని వినోబా భావే అన్నారు. ఆంధ్రరాష్ట్రాన్ని నిర్మించడానికి పండిట్ నెహ్రూ శాయశక్తులా కృషిచేస్తున్నట్లు తనకు నమ్మకం కుదిరిందని కూడా శ్రీ వినోబాభావే స్వామీజీకి తెలిపారు. భావేగారి మాటపట్ల పరిపూర్ణ విశ్వాసంకల స్వామీజీ ఈ విజ్ఞప్తిని పాటించి దీక్ష విరమించారు. ఈ పైన ఆంధ్రరాష్ట్రోద్యమ భవిష్యత్తును భావేగారి చేతులలో విడిచిపెట్టినట్లు స్వామీజీ ప్రకటించారు.

స్వామీజీ తమ వైఖరిని మార్చుకున్నారనీ, అక్టోబరు 2 లోగా రాష్ట్రనిర్మాణం జరక్కపోయినా, ఎన్నికల తరువాతనైనా జరుగుతుందని భారతప్రభుత్వం ప్రకటించినట్లయితే చాలునని ఇప్పుడంటున్నారనీ భావేగారు చింద్వారా ప్రార్థన సమావేశంలో చెప్పినమాట సత్యం కాదనీ, అక్టోబరు 2 లోగానే రాష్ట్రాన్ని భారత ప్రభుత్వం నిర్మించగలదనే ఆశతో తాము దీక్ష విరమించారనీ స్వామీజీ భావేగార్కి తెలిపారు. దీనిపైన భావేగారు వివాదగ్రస్త ప్రాంతాల ప్రమేయం పెట్టుకోకుండా ఉంటే అక్టోబరు 2 వ తేదీకి రాష్ట్రనిర్మాణం సాధ్యమేనని మరుచటి రోజు ప్రార్థన సమావేశంలో చెప్పారు. దీక్ష విరమించినందువల్ల ఆంధ్రరాష్ట్రోద్యమం పట్ల



స్వామి సీతారాం మొదలైనవారు ప్రాయోపవేశ దీక్షను విరమించేముందు ప్రార్థన చేశారు.



ఆంధ్రరాష్ట్ర సాధనకోసం ఆగస్టు 16 మొదలు సెప్టెంబరు 20 వరకు ప్రాయోపవేశ దీక్ష పూనిన స్వామీ సీతారాం మొదలైన వారు.


కేంద్రంలోనివారికి సద్భావం కలిగిందనీ, ఈ సద్భావంవల్లనే ఆంధ్రరాష్ట్రం సిద్ధించవచ్చుననీ భావేగారు స్వామీజీకి తంతి ద్వారా తమ అభిప్రాయం తెలియచేశారు.

విభజన సంఘ నివేదికను ఆమోదిస్తూ ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ తీర్మానం చేసినందువల్ల, ఇంక తమిళ, కర్నాటక రాష్ట్ర కాంగ్రెస్‌లూ, మద్రాసు ప్రభుత్వమూ లిఖిత పూర్వకంగా ఆనివేదిక పట్ల తమ ఆమోదాన్ని ప్రకటించినట్లయితే, కేంద్ర ప్రభుత్వం ఆంధ్రరాష్ట్ర నిర్మాణం పట్ల తమ విధానమేదో ప్రకటించగలదని పార్లమెంట్‌లోని ఆంధ్రప్రతినిధులు నమ్ముతున్నారని ఢిల్లీనుంచి వార్తవచ్చింది. స్వామీజీ ప్రాయోపవేశం విరమించినందుకు హర్షం ప్రకటిస్తూ ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు నీలం సంజీవరెడ్డిగారు "అక్టోబరు 2 వ తేదీనాటికి కాకపోయినా కొంచెం ముందు వెనుకలుగా ఆంధ్రరాష్ట్రం రాగలద"ని విశ్వాసం ప్రకటించారు. అక్టోబరు 2 లోగా ఇది సిద్ధమని భారతప్రభుత్వం ప్రకటన చెయ్యగలరని కూడా వారు నమ్మకం వెలిబుచ్చారు. అయితే ఈ పత్రిక ప్రకటనలు మినహా భారతప్రభుత్వం వద్దనుంచి మద్రాసు ప్రభుత్వానికి ఇంతవరకూ ఈసమస్య గురించి ఎటువంటి వర్తమానం రాలేదని ఒక ప్రభుత్వోద్యోగి చెప్పారట.

అక్టోబరు 2 లోగా ఆంధ్రరాష్ట్రనిర్మాణ కలాపం కొనసాగడం దుర్ఘటమైనా కాకపోయినా, ఎన్నికలనిమిత్తం అభ్యర్థుల్ని పరిశీలించడం తమిళ కర్నాటక నాయకులు సంచారం చేస్తున్నందువల్ల ఆరాష్ట్ర కాంగ్రెస్ సంఘాలు సమావేశమై తీర్మానాలు చెయ్యడం దుర్ఘటం.

మద్రాసునగర భవిష్యత్తును గురించి స్వామి సీతారాంగారు తమ వైఖరిని మార్చుకోలేదని స్పష్టపరిచారు. మద్రాసు ఉమ్మడి నగరమనీ, ఆంధ్రరాష్ట్రంలో కాని, తమిళరాష్ట్రంలో కాని నగరంచేరాలనడానికి ఆంధ్రులకుగానీ తమిళులకుగానీ హక్కులేదనీ స్వామీజీ అన్నారు. వివాదరహితమైన ప్రాంతాలనుచేర్చి ఇప్పుడు ఆంధ్రరాష్ట్రాన్ని నిర్మిస్తూ, ఎన్నికల తర్వాత మూడేళ్లలోగా మద్రాసునగర భవిష్యత్తును నిర్ణయించగలరని భారతప్రభుత్వం ప్రకటించాలని స్వామీజీ అన్నారు. మద్రాసునగర భవిష్యత్తు నిర్ణయమయేవరకూ, ఉభయరాష్ట్రాల ప్రభుత్వాలూ మద్రాసునగరంలోనే ఉండాలని వారు సూచించారు. శ్రీ ఆర్. బి. రామకృష్ణరాజు, శ్రీ కడప కోటిరెడ్డి మొదలైన రాయలసీమ నాయకులలో కొందరు మద్రాసులేని ఆంధ్రరాష్ట్రంవద్దని వాదిస్తున్నారు. కొందరు రాయలసీమ నాయకులు అసలు ఆంధ్రరాష్ట్రమే వద్దంటున్నారు.

1950 లో విభజన సంఘ నివేదికను నిరాకరించిన ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్‌కు అప్పుడు అధ్యక్షులుగా ఉన్న శ్రీ యన్. జి. రంగాగారు నాయకత్రయ నివేదికకు కట్టుబడే ఉన్నారని తిరిగి ప్రకటించారు. 14 వ తేదీని నెల్లూరులో ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ కమిటీ చేసిన తీర్మానం రాష్ట్రనిర్మాణానికి ప్రాతిపదిక కాగలదనీ, ఈనాడు రాష్ట్ర కాంగ్రెస్‌లో తామూ ప్రకాశంగారూ లేకపోయినప్పటికీ ఆ తీర్మానం ప్రాతినిధ్యానికి ఎటువంటి లోపమూ రాదనీ రంగాగారన్నారు. విభజనసంఘ నివేదికలో తమకూ ప్రకాశంగారికీ సమ్మతం కాని అంశాలను మధ్యవర్తిత్వానికి విడిచిపెట్టవచ్చునన్నారు. అయితే విభజనసంఘ నివేదిక ఆధారమైన ఆంధ్రరాష్ట్రనిర్మాణానికి రంగాగారు అభ్యంతరం చెప్పలేదు. ప్రకాశంగారింకా తమ అభిప్రాయాన్ని ప్రకటించలేదు.



శ్రీ వినోబా భావే

ఆంధ్రరాష్ట్రాన్ని ఇప్పుడు నిర్మించ దలుచుకుంటే, మద్రాసు నగరంగురించి స్వామీజీ పట్టుదల భారత ప్రభుత్వానికి అడ్డురాదని పార్లమెంట్‌లో శ్రీకళా వెంకట్రావుగారి ప్రశ్నలకు పండిట్ నెహ్రూ ఇచ్చిన సమాధానాలవల్ల స్పష్టమౌతోంది. ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ నెల్లూరు తీర్మానంతో ఆంధ్రనాయకులమధ్య ఏకాభిప్రాయం కుదిరిందని భారత ప్రభుత్వం తృప్తిపడ గలిగినట్లయితే, విభజన సంఘ నివేదికలో ప్రకాశంగారు మినహా మిగతా నాయకులందరూ సమ్మతించిన అంశాలన్నిటినీ భారతప్రభుత్వం అంగీకరించినట్లయితే ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికింక ఆటంకం ఉండదు.

విభజన సంఘనివేదిక పైన కేంద్ర ప్రభుత్వం తమ అభిప్రాయాన్ని మద్రాసు ప్రభుత్వానికి తెలియపరుస్తూ, నివేదిక సూచనలపట్ల ఆంధ్రనాయకుల విభేదాలే కాక, పరిష్కరించబడని సమస్యలు కూడా కొన్ని ఉన్నాయనీ, కొన్ని విషయాలలో విభజన సంఘసూచనలు అంగీకారయోగ్యంగా లేవనీ అన్నారు. ఈ పరిష్కరించబడని సమస్య లేవో భారత ప్రభుత్వం ఆనాడు మద్రాసుప్రభుత్వానికి వ్రాసిన లేఖలో స్పష్టంగా వివరించబడలేదు. కొన్నిటిని మాత్రం స్థూలంగా సూచించి, "ఇటువంటి సమస్యలు" ఇంకా ఉన్నాయని వ్రాశారే కాని అవేవో స్పష్టంగా వివరించలేదు. కాబట్టి ఆ పరిష్కరించబడని సమస్య లేవో తెలుసుకుని వాని పరిష్కారం నిమిత్తం మరొకమారు దక్షిణాదిన ఆంధ్ర, తమిళ, కర్నాటక, కేరళ నాయకులు చేరి కొత్త ప్రతిపాదనలు చెయ్యవలసిన అవసరం కలిగినా కలగ వచ్చును.

హిందూ కోడ్‌బిల్:


హిందూ కోడ్ బిల్లును భారతప్రభుత్వం ప్రస్తుతానికి విడిచిపెట్టిందని చెప్పవచ్చును. అయితే ఈ బిల్లులోని వివాహానికీ, వివాహ విచ్ఛేదానికీ సంబంధించిన అధ్యాయాలను మాత్రం విడగొట్టి వేరేపేరు పెట్టి ప్రత్యేక శాసనంగా అమలుజరపడానికి ప్రభుత్వం నిశ్చయించింది. దీనికి కారణం పార్లమెంట్ సమావేశ వ్యవధి బిల్లు అంతటినీ చర్చించడానికి చాలదని పండిట్ నెహ్రూ చెప్పారు. బిల్లులో మిగిలిన అధ్యాయాలను ఉత్తరోత్తరా, అనగా ఎన్నికల అనంతరం కొత్త పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడానికి కృషి జరుగుతుందని కూడా చెప్పారు.

హిందూకోడ్ బిల్లును ఈ విధంగా ప్రభుత్వం విడిచిపెట్టివేసినందుకు మహిళా సంఘాలవారు అసమ్మతి ప్రకటిస్తూ, నెహ్రూవద్దకు రాయబారం వెళ్లారు. పార్లమెంటులో ఈ కొత్త శాసనాన్ని కూడా పండిట్ గోవింద మాలవ్యా మొదలైనవారు తీవ్రంగా విమర్శించారు. బిల్లుకు అనుకూలురైనవారు ఆస్తి పంపకాలు, దత్తత మొదలైన అధ్యాయాలను తొలగించి వివాహానికీ వివాహవిచ్ఛేదానికీ సంబంధించిన అధ్యాయాలను మాత్రం ఇప్పుడు అమలు జరపడం న్యాయం కాదన్నారు.

వివాహానికీ, వివాహవిచ్ఛేదానికీ సంబంధించిన అధ్యాయాలను మాత్రం అమలు జరపడం కూడా సులువు కాదు. ఆస్తిపంపకాలు జీవనభృతి, తండ్రి ఆస్తిలో కాని భర్త ఆర్జనలో కాని స్త్రీలకుగల హక్కులు మొదలైన సమస్యలు పరిష్కరించబడనంత వరకూ సమాజంలో స్త్రీలు పురుషులపైనే ఆధారపడి ఉండకతప్పదు. స్వేచ్ఛను కోరే స్త్రీలకు ప్రతిబంధకాలు తొలగిపోవు. విడాకుల హక్కు ఇచ్చినంత మాత్రంచేత స్త్రీల స్వేచ్ఛకుగల ప్రతిబంధకాలలో ఒకటి మాత్రమే తొలగినట్లవుతుందికాని, వారి సముద్ధరణకు పూర్తిఅవకాశం లభించదు. నేటి సామాజిక సమస్య లన్నిటికీ మూలం ఆర్థిక సమస్యే నని అంగీకరించినట్లయితే, ఈ సమస్యల పరిష్కారం ప్రస్తుత శాసనం వంటి వానివల్ల ఒనగూడదని అంగీకరించాలి.

వివాహాది విషయా లన్నిటిలోనూ (వివాహ విచ్ఛేదంకూడా) వివిధ ప్రాంతా

(43-వ పేజీ చూడండి)



ప్రాయోపవేశ దీక్షను విరమించిన స్వామి సీతారాం ఆంధ్రమాతకు జయధ్వానాలు పలికారు.

కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో

అలెగ్జాండర్ డ్యూమా

62

ఆట్వీల్ గ్రామంలో మాంట్ క్రిస్టో నివాసభవనం పైపైకి నిరాడంబరంగానే కనపడినా విందుకోసం లోపల చక్కగా అలంకరించబడింది. అయితే వెనుక తోటనుమాత్రం ఎప్పటి మాదిరిగా ఉంచాలని పరిచారకులకు యజమాని ఆజ్ఞఇచ్చాడు. మేడ పైన వెనుకవరండా ప్రక్క పడకగది నొకదానిని ఎట్టి అలంకరణ లేకుండా ఉంచేశారు. పదిసంవత్సరాల క్రిందట ఆ గది ఎలా ఉండేదో ఈనాడూ అలాగే ఉంది. గదిగుమ్మంవద్ద తెర, కిటికీలను కప్పిన ఎర్రని తెరలు, లోని పడకమంచం అన్నీ ఎప్పటిమాదిరిగా ఉంచబడినాయి. పరిచారకు లెవరూ ఈ గదిలో ప్రవేశించరు. ప్రక్కగా నడిచివెడుతున్నప్పుడు భీతిపూర్వకంగా చూస్తూ ఉంటారు. బర్టుక్సియో ఆ గది చాయలకైనా వెళ్ళడానికి గజగజలాడిపోతాడు.

శనివారం సాయంకాలం సరిగ్గా అయిదుగంటలకు మాంట్ క్రిస్టో వచ్చాడు. వెంట ఆలీ వచ్చాడు. ఇద్దరూ భవనమంతటినీ ఒకసారి పరిశీలించారు. సరిగ్గా ఆరుగంటలకు మాక్సిమిలియన్ వచ్చాడు. మాంట్ క్రిస్టో అతన్ని ఆదరపూర్వకంగా ఆహ్వానించాడు. "నేనే అందరికంటె ముందు వచ్చాను" అన్నాడు మాక్సిమిలియన్. "ముందుగావచ్చి మీతో కొంతసేపు స్వేచ్ఛగా గడపాలని అతివేగంగా గుర్రాన్ని పరుగెత్తించాను. దారిలో చాతో-రీనా, లూషియన్ డిబ్రే, డాంగ్లర్ దంపతులు కనపడ్డారు. ఈపాటి కప్పుడే సమీపిస్తూ ఉంటారు."

అంతలోనే మిగతా అతిథులు కూడా ఒక్కొక్కరే రానారంభించారు. చాతో-రీనా, డిబ్రే, డాంగ్లర్ దంపతులు, విల్ ఫర్ట్ దంపతులు వచ్చారు. డాంగ్లర్ ముఖం బొత్తిగా వాడిపోయింది. డిబ్రే హెర్మినా డాంగ్లర్‌ను సమీపించి కరచాలనం చేస్తూ, చాటుగా ఉండకట్టిన ఒకచీటీని ఆమె చేతిలో ఉంచాడు. దీనిని మాంట్ క్రిస్టో చూసి కూడా చూడనట్లు నటించాడు. అందరూ సావడిలో చేరి సంభాషణ కుపక్రమించారు; కొందరు ఓషధుల సీసాలను పరిశీలిస్తున్నారు. కొందరు చిత్రపటాలను పరికిస్తున్నారు. ఆఖరున మేజర్ కావల్కాంటీ, ఆండ్రీ కావల్కాంటీ వచ్చారు.

"కావల్కాంటీ? అంటే?" అన్నాడు డిబ్రే.

"ఏమో! కాని పేరు మాత్రం బాగుంది." అన్నాడు మాక్సిమిలియన్.

"అవును. ఇటాలియన్ల పేర్లు బాగుంటాయి—దుస్తులు అసహ్యంగా ఉంటాయి కాని" అన్నాడు చాతో-రీనా.

"అబ్బే" అన్నాడు డిబ్రే "ఆయన దుస్తులు బాగానే ఉన్నాయ్. కొత్తవి కూడా."

"అదే లోపం అంటున్నాను. ఆయన్నీ ఆయన దుస్తుల్నీ చూస్తే ఇంత మంచిదుస్తులు వేసుకోడం జన్మలో ఇదే మొదటిసారి కాబోలనిపిస్తోంది."

"వీరెవరు?" అన్నాడు డాంగ్లర్ మాంట్ క్రిస్టో వంకతిరిగి.

"విన్నారుగా పేరు! కావల్కాంటీ".

"అలాచెప్తే ఏం తెలుస్తుంది?"

"అవును. ఇటాలియన్ రాజవంశాల సంగతి మీకేం తెలుస్తుంది? వీరు ఇటాలియన్ రాజవంశాలలో ఒక వంశానికి చెందినవారు. తండ్రికొడుకులు."

"భాగ్యవంతులా?"

"వీరిభాగ్యం అపారం."

"ఏంచేస్తూ ఉంటారు."

"ధనమంతా ఎలా వెచ్చించాలో అన్ని విధాలా కృషి చేస్తూ ఉంటారు. వీరికి మీబాంక్‌తో కూడా వ్యాపారం ఉందనుకుంటాను. రండి మీకు వారిని పరిచయపరుస్తాను. కొడుకు పారిస్‌లోనే ఉండిపోతాడట. ఇక్కడే ఒక యువతిని చూసి పెళ్లి కూడ చేసుకుంటాడట.

"బాగుంది" అన్నాడు డాంగ్లర్ సాలోచనగా. హెర్మినా డాంగ్లర్ భర్తవంక క్రోధంతో చూసింది. ఇదే మరొక చోటైతే తుపాను చెలరేగవలసిందే. కాని ఆమె కోపం అణుచుకుంది.

విల్ ఫర్ట్ పైకి ఎంత గంభీరంగా ఉన్నట్లు నటించినా లోలోన కలత చెందుతున్నట్లు స్పష్టమౌతూనే ఉంది. మాంట్ క్రిస్టో కరచాలనం చేసినప్పుడు విల్ ఫర్ట్ చెయ్యివొణికింది.

ఇంతలో బర్టుక్సియో సావడిలోకి వచ్చినట్టే వచ్చి ఎవ్వరూ గమనించకుండా చటుక్కున ప్రక్క నొక గదిలోకి వెళ్లిపోయాడు. ఇది గమనించి మాంట్ క్రిస్టో అతన్ని గదిలోకి అనుసరించి "ఏం కావాలి బర్టుక్సియో?" అన్నాడు.

"అతిథు లెంతమందో తమరు చెప్పలేదు." బర్టుక్సియో గజగజలాడిపోతున్నాడు.

"నువ్వే లెక్క చూడు."

"అందరూ వచ్చేసినట్లేనా?"

"వచ్చారు"

బర్టుక్సియో తలుపు కొద్దిగా ఒత్తిగించి చూశాడు. "ఆరి దేవుడా!" అన్నాడు.

"ఏమిటది?"

"అవిడే! అవిడే!"

"ఆవిడెవరు?"

"ఆమె! తెల్లని దుస్తులు వజ్రాలహారమూ ధరించిన ఆ యువతి?"

"ఎవరు! ఆమె హెర్మినా డాంగ్లర్"

"ఆమె పేరు నాకు తెలియదండి. కాని ఆమే, నాకు స్పష్టంగా తెలుసు ఆమే"

"అంటే?"

"తోటలో విల్ ఫర్ట్ కోసం తిరుగుతూ ఉండేది. ఆబిడ్డ తల్లి, అరె! విల్ ఫర్ట్ కూడా ఉన్నారే! అయితే ఆయన చచ్చి

అనువాదం: సీతారాం

పోలేదా? నేను చంపాననుకున్నానే!" బర్టుక్సియోకి గొంతుక పిసుక్కుపోతున్నట్లయింది.

"అవును. ఆయన చచ్చిపోలేదన్నమాట. నీ కత్తిపోటు సరిగ్గా పనిచెయ్యలేదు కాబోలు. అసలు నువ్వు నాకు చెప్పిన కథంతా అబద్ధం. అంతేనా? అదంతా నువ్వు ఊహించుకున్నట్లున్నావు. కలకన్నట్లున్నావు. అంతే అయ్యుంటుంది. ఇంక మనస్సు స్థిమిత పరుచుకో. అతిథు లెంతమందున్నారో లెక్కపెట్టు, విల్‌ఫర్ట్ దంపతులిద్దరు, డాంగ్లర్ దంపతులిద్దరు, చాతో—రీనా, డిబ్రే, మాక్సిమిలియన్ ఏడుగురు—మేజర్ కావల్కాంటీతో ఎనిమిది మంది."

"ఎనిమిది మందండి."

"తొందరపడకు. ఇంకొక అతిథిని మరిచిపోతున్నావు. సరిగ్గా చూడు. ఆ పక్కన నిలబడిన యువకుని చూడు. ఆంద్రీ కావల్కాంటీ. ఇటు ముఖం తిప్పుతున్నాడు చూడు."

బర్టుక్సియో సన్నగా మూలిగాడు. గట్టిగా అరిచేవాడే కాని మాంట్‌క్రిస్టో ముఖం చూసి ఉద్రేకాన్ని అణుచుకున్నాడు. "అయ్యో పాపకర్మం! వాడే బెనెడెట్టో."

"అంటే?"

"నేను మా వొదిన కిచ్చిన పెంపుడు కొడుకు బెనెడెట్టో."

అయిదు నిమిషాల్లో విందుగృహం తలుపులు తెరవబడ్డాయి. "విందు సిద్ధంగా ఉంది." అని తెలియచేశాడు బర్టుక్సియో. ఈ ఒక్క మాటా చెప్పడానికి గుమాస్తా విశ్వప్రయత్నం చెయ్యవలసి వచ్చింది.

మాంట్‌క్రిస్టో హీలాయ్ విల్‌ఫర్ట్‌ని విందుగృహంలోకి తీసుకువెడుతూ, "విల్‌ఫర్ట్! మీరు హెర్మినా డాంగ్లర్‌ని తీసుకు రండి" అన్నాడు.

63

విందు ప్రారంభమైన తరవాత అతిథు లందరూ పరధ్యానంలో పడ్డారు. ఏ చిత్రప్రభావానికి లోబడి ఈ భవనానికి వచ్చామోనని ప్రతిఒక్కరూ యోచించుకో నారంభించారు. అందరి మనస్సులూ కలతచెందాయి. కలతచెందినా విందుకు వెళ్లడం మానకూడదనే భావం కూడా అందరిలో ప్రబలంగా ఉండడంవల్లనే వచ్చారు. ఏదో నిగ్రహించలేని కుతూహల భావం అందరినీ ఇక్కడికి లాక్కుని వచ్చింది. ఈ యింటి యజమాని సంగతి ఎవరికీ బోధపడ్డంలేదు కాని ఏదో తెలియరాని గూఢశక్తి వారందరినీ అతనివద్దకు ఆకర్షిస్తోంది. హెర్మినా డాంగ్లర్ ప్రక్క విల్‌ఫర్ట్ కూర్చున్నాడు. అతని ప్రక్కను మాక్సిమిలియన్ కూర్చున్నాడు. మాంట్‌క్రిస్టోకి రెండువైపులా హీలాయ్ విల్‌ఫర్ట్ డాంగ్లర్ కూర్చున్నారు. మిగతా వారంతా మిగిలిన ఆసనాలు స్వీకరించారు.

విందు అద్భుతంగా ఉంది. విందులకు ప్రపంచమంతటా పేరుమోగిన పారిస్‌నగరసమాజమే ఈ విందుకు అద్భుతపడింది. అందరూ ఆశ్చర్యపడుతున్నట్లు మాంట్‌క్రిస్టో గమనించాడు. పరిహాసపూర్వకంగా ఇలా అన్నాడు: "అపార భాగ్యసంపదల్ని పొంది ఒక ఉచ్చస్థాయి నందుకున్న తరవాత కేవలం విలాసాలతోనే జీవితం గడపడం సహజమని మీ రందరూ ఒప్పుకుంటారు. ఉత్కృష్టలక్ష్యాలను సాధించిన తరవాత ఇంక పైన మానవుడు కోరదగినవన్నీ ఆదర్శప్రాయమైనవే ఉంటాయి. ఈ వాదం ప్రకారం చూసినట్లయితే 'అద్భుతం' అనగా ఎటువంటిది? మన గ్రహణశక్తికి అతీతమైనది. మనం కోరేదేమిటి? ఏదైతే మనకి లభించదో దానిని కోరుకుంటాం. అందువల్ల ఈ గ్రహణశక్తికి అతీతమైనదానిని గ్రహించడానికి, అందరాని ఆశల్ని ఫలింప చేసుకోడానికి నా కాలాన్ని వినియోగిస్తున్నాను. నా కోరికల్ని తీర్చుకోడానికి నాకు రెండు పరికరా లున్నాయి. ఒకటి మనో బలం, రెండోది ధనం. ఉదాహరణకి ఈ రెండు చేపల్నీ చూడండి. ఒకటి రష్యానించి వచ్చింది. రెండోది నేపుల్స్‌నించి వచ్చింది. అంత దూరాన పుట్టి పెరిగినా ఈ చేపలు ఈనాడు కలిసి మనకి విందులో వినియోగపడ్డం చిత్రంగా లేదా?"

"అసంభవం" అన్నారు అతిథులు.

"ఇదే నిజమైతే వీటిని ఫ్రాన్స్‌దేశాని కెలా తీసుకు వచ్చారు?" అని ఒకరు ప్రశ్నించారు.

"అదేమంత కష్టంకాదు. ఒక గాజు తొట్టిలో వోల్గానది నీటిని నింపి ఆనది మట్టంలో ఉండే మొక్కల్నీ గడ్డినీ నాచునీ వేసి ఆచేపని తెచ్చాం. అలాగే నేపుల్స్‌లో ఫుజారో సరస్సు చేపని మరొక గాజు తొట్టిలో తెచ్చాం. ఈ గాజు తొట్టెల కోసం ప్రత్యేకం ఒక పెద్ద బండినికూడా కట్టించాం. నామాటల మీద మీకు నమ్మకం కలగడంలేదా డాంగ్లర్?"

"నమ్మకం కలగని మాట నిజమే" అన్నాడు డాంగ్లర్.

"ఆలీ! ఆ గాజుతొట్టెల్ని పట్టించుకురా - ఇంకా వాటిలో ఒక్కొక్క చేప బ్రతికేవున్నాయి. మీరే స్వయంగా చూడవచ్చు." వెంటనే నలుగురు సేవకులు ఇద్దరేసి ఒక్కొక్కటి చొప్పున రెండు గాజుతొట్టెల్ని మోసుకువచ్చారు. వాటిలో చేపలు బ్రతికేఉన్నాయి.

"కాని రకానికి రెండేసి చేపలెందుకు తెప్పించారు?"

"ఒక్కొక్కటే తెప్పిస్తే అవి చచ్చిపోవచ్చు. రెండైతే ఒకటి దారిలో చచ్చిపోయినా చిక్కుండదు."

"నిజంగా మీరతి విచిత్రమైన వ్యక్తులని చెప్పాలి" అన్నాడు డాంగ్లర్. "నిజంగా ధనం ఎంతటి అద్భుతాలనైనా సాధించగలదు."

"నిజం" అన్నాడు చాతో—రీనా. మాంట్‌క్రిస్టో వంక తిరిగి "ఈ భవనాన్ని మీరు కొని వారంరోజులైనా కాలేదటగా?"

"అవును."

"కాని చూడండి. వారం రోజుల్లో ఈయిల్లంతా ఎలా మారిపోయిందో! ఇంతకుముందు ముంగిట అంతా పాడుగా ఉండేది. ఇల్లు పాడుపడినట్లు కనపడేది. కాని వారంరోజుల్లో కొత్తగా కట్టించిన భవనంలా మారిపోయింది. ఈ యిల్లు ఎంత పాతదో నాకు తెలుసును. అంతటా నిత్యం చీకటి అలుముకున్నట్లుండేది. రెండు మూడేళ్లకిందట సెంట్‌మిరాన్, ఈయింటిని అమ్మగలరని ప్రకటించినప్పుడు వచ్చి చూశాను."

"ఇదేనన్నమాట సెంట్‌మిరాన్‌కి చెందిన ఇల్లు!" అంది హీలాయ్ విల్‌ఫర్ట్.

"ఆమాట నాకు తరవాత తెలిసింది."

"ఈయింటిలో జనం మసిలి పదేళ్లయింది." అన్నాడు చాతో—రీనా. "ఎప్పుడు చూసినా తెరలుదించి తలుపులు మూసివేసి ముంగిట పిచ్చిమొక్కలు అలుముకుని సమీపించడానికి శక్యం కాకుండా ఉండేది. న్యాయాధికారి మామగారికి చెందినదే కాకపోతే, ఈయింటి కేదో శాపం తగిలినట్లు, ఇక్కడేదో ఘోర నేరం జరిగినట్లు అనుమానించవలసిందే."

విల్‌ఫర్ట్‌కి విందులో ఏ వస్తువూ హితవు కావడంలేదు. చాతో—రీనా మాటలు విని అతను ఒకగ్లాసు సారాయం గడగడ తాగేశాడు.

మాంట్‌క్రిస్టో కొంతసేపు నిశ్శబ్దంగా గడవనిచ్చాడు. తరవాత డాంగ్లర్‌తో ఇలా అన్నాడు: "ఈయింట్లో మొట్టమొదటిసారి అడుగుపెట్టినప్పుడు నాకూ అదేవిధంగా తోచడం చిత్రంగా లేదా డాంగ్లర్? ఇల్లు ఇంత బీభత్సంగా ఉండడం చూసి ఎందుకు కొన్నానా అనిపించింది. నా గుమాస్తా ముందుగా కొనేశాడు. కాని నేనేముందు చూసిఉన్నట్లయితే కొనకనే పోదును. బహుశా ఆగుమాస్తా మధ్యవర్తిదగ్గర లంచంతిని ఉంటాడు."

"కావచ్చును" అన్నాడు విల్‌ఫర్ట్ తడబడుతూ: కాని ఈ లంచగొండితనంతో నాకేలాటి సంబంధం లేదండి. ఈయిల్లు వాలంటిన్ పెళ్ళికి కట్నంగా మామామగారిచ్చారు. దీన్ని అమ్మకుండా ఉంచినట్లయితే ఒకటి రెండేళ్ళలో కూలిపోయేదే. అందుకే వాలంటిన్ పెళ్ళికోసమని ఇప్పుడీ యింటిని అమ్మేశారు."

"ఈమారు మాక్సిమిలియన్ ముఖం పాలిపోయింది."

"వీటన్నిటి కేమి కాని ఈ యింటిలో ఒకగది వుంది" అన్నాడు మాంట్‌క్రిస్టో. "ఎందుకో కారణం తెలియదు. ఆ గదిని చూడగానే ఏదో నిగూఢమైన వృత్తాంతం ఉండిఉంటుందని నాకు తోచింది."

"అలా ఎందుకు తోచింది?" అన్నాడు డాంగ్లర్.

"అంతర్వాణి అంటే మనం నమ్మవచ్చునా?" అన్నాడు మాంట్‌క్రిస్టో. "ఎందుకో నాకలా తోచింది. ఏవో పూర్వానుభవాలు కలబోసి ఇటువంటి చిత్రమైన భావాల్ని సృష్టిస్తుంది అంతర్వాణి. ఏనాడో మరెక్కడో జరిగిన సంఘటనలు ప్రస్తుతంతో ప్రమేయం లేకపోయినా మనోఫలకంలోకి అకస్మాత్తుగా ప్రవేశిస్తాయి. ఇప్పుడే మీకా గది చూపుతాను. తరవాత తోటలోకి వెళ్లి కాఫీ తీసుకుందాం."

అతిథులందరివంకా చూశాడు మాంట్‌క్రిస్టో. ముందుగా హిలాయిస్ విల్‌ఫర్ట్ లేచింది. తరవాత మిగతావారొక్కరొక్కరే లేచారు. విల్‌ఫర్ట్, హెర్మినా డాంగ్లర్‌లు ఇద్దరూ మాత్రం ఆసనాలకు అంటిపెట్టుకుపోయినట్లు కూర్చుండి పోయారు. అతిథులందరూ విందుగృహం దాటి వెళ్లిపోయారు. ఆఖరి ఇద్దరికోసమూ మాంట్‌క్రిస్టో గుమ్మంవద్ద నిలబడ్డాడు. హెర్మినా, విల్‌ఫర్ట్‌లు ఒకరి ముఖాలవంక ఒకరు ప్రశ్నార్థకంగా చూసుకున్నారు.

"విన్నావా?" అంది హెర్మినా.

"మనం కూడా వెడదాం" అన్నాడు విల్‌ఫర్ట్.

ఇద్దరూ లేచి బయలుదేరారు. వారి వెనుక మాంట్‌క్రిస్టో వెళ్లాడు. అతని ముఖంలో అప్పుడు పొడచూపిన చిరునవ్వును వారిద్దరూ గమనించి ఉన్నట్లయితే మనస్సు చెదిరిపోవలసిందే.

చివరికందరూ ఆపురాతనపు గది చేరుకున్నారు. ఆగదిలో అంత విశిష్టతేమీ లేదు. కాని అప్పటికే చీకటి పడిపోయింది. లోపల దీపమైనా లేక అక్కడ వాతావరణం దుర్భరంగా ఉంది.

"అబ్బ! భీభత్సంగా ఉంది" అంది హిలాయిస్ విల్‌ఫర్ట్.

హెర్మినా డాంగ్లర్ ఏదో చెప్పబోయింది కాని ఆమె మాటలు నోటిలోనే మణిగిపోయాయి.

"అవును భీభత్సంగా లేదూ?" అన్నాడు మాంట్‌క్రిస్టో. చూడండి ఆ చెదిరిపోయిన పడక, నెత్తుటి రంగుతెరలు పైన ఎలా వేలాడుతున్నాయో! ఆగోడపైన పటాలు రెండూ చూడండి. చాలవరకు రంగు చెరిగిపోయినాయి. అయినా అవి 'మేము కళ్లారా చూశాం! అని చెప్తున్నట్లు లేవూ?"

విల్‌ఫర్ట్ ముఖం భీతితో వివర్ణమయింది. హెర్మినా డాంగ్లర్ నిలవలేక ప్రక్కనేఉన్న ఒక పెద్ద సోఫాపైన కూర్చొబడిపోయింది.

హిలాయిస్ విల్‌ఫర్ట్ ఆమెవంక తిరిగి "అబ్బా! దానిపైన ఎలా కూర్చోగలిగావ్ హెర్మినా?" అంది. "దానిపైనే ఏఘోర దుష్కార్యం జరిగిందో అన్నట్లుంది. ఎంత గుండె ధైర్యంతో కూర్చున్నావ్ దానిమీద?"

హెర్మినా పాముకరిచినట్లు ఒక్క ఉదుటున లేచి నిలబడింది.

"ఇంతేకాదు" అన్నాడు మాంట్‌క్రిస్టో "ఇంకా ఉంది."

"ఏమిటి? ఇంకానా?" అన్నాడు డిబ్రే. హెర్మినా బెదిరిపోవడం డిబ్రే స్పష్టంగా కనిపెట్టాడు.

"అవును." అన్నాడు మాంట్‌క్రిస్టో. "ఇదిగో ఇటు చూడండి. ఇక్కడేముంది?"

మాంట్‌క్రిస్టో చూపినవైపు అతిథులంతా చూశారు. మంచానికి ఒకపక్క సగంపొడుగున వేలాడతీసిన ఎర్రతెర ఉంది. దాని చాటున గోడమాత్రం ఉంటుందనుకున్నారు అతిథులు. మాంట్‌క్రిస్టో తెర తొలగించగానే చిన్నమార్గం ఒకటి, అక్కడనుంచి కిందికి సోపానాలు కొనవచ్చాయి. "ఈ గుప్త సోపాన మార్గం గురించి ఏం చెప్తారు?" అన్నాడు మాంట్‌క్రిస్టో.

"ఛీ" అని చీదరించుకున్నాడు చాతో-రీనా. "ఆ మార్గం చూస్తేనే శరీరం కంపిస్తుంది."

"ఊహించండి" అన్నాడు మాంట్‌క్రిస్టో. "ఏ కఠినాత్ముడో ఇక్కడ ఏదో ఘోరకృత్యంచేసి ఈ గుప్తమార్గంద్వారా సవ్వడి చెయ్యకుండా తప్పించుకుని ఉంటాడు. ఏ దుర్మార్గుడో పరుని కంటపడరాని ఏ వస్తువునో దాచుకుని ఈ దారిని తీసుకుపోయుంటాడు. కాని ఎంత అడుగులో అడుగు వేసుకుంటూ ఈ మెట్లు ఒక్కొక్కటే దిగినా, ఏ గుప్తవస్తువును దాచదలుచుకున్నాడో దానిని భగవంతుని దృష్టిని పడకుండా కాపాడలేడు కదా!"

హెర్మినాడాంగ్లర్ ఇంక నిలవలేకపోయింది. ఆమెకి స్పృహతప్పి విల్‌ఫర్ట్ మీద వాలిపోయింది. విల్‌ఫర్ట్ తానే నిలవలేక ఒక గోడనానుకుని నిలబడి ఆమె నొక చేత పట్టుకున్నాడు.

"అదేమిటి? ఏమయింది మీకు? మీ ముఖమంత పాలిపోయిందేం?" అన్నాడు డిబ్రే హెర్మినాను చూసి.

అంతలోనే తేరుకుని హెర్మినా "అబ్బే! ఏమీ లేదు. ఇక్కడ ఊపిరాడ్డంలేదు" అంది.

"భయపడుతున్నారా?" అన్నాడు మాంట్‌క్రిస్టో.

"లేదండి లేదు" అంది హెర్మినా. "కాని నిజంగా జరిగినట్లే మీరు దృశ్యాల్నీ సంఘటనల్నీ ఊహించగలరు."

"అవునండి" అన్నాడు మాంట్‌క్రిస్టో చిరునవ్వుతో." అదంతా నా ఊహ. కాబట్టే ఈగదిలో విశుద్ధాత్మురాలైన ఏ మాతృదేవతో నివసించిందని ఊహించరాదా? ఏ దేవతా స్త్రీయో ఈ పాన్పుపైన పవ్వళించి ఉంటుందని కూడా ఊహించుకోవచ్చును. మాతృదేవతకు నిద్రాభంగం కలిగించరాదని వైద్యుడీదారినే సవ్వడి చేయ్యకుండా నిద్రిస్తున్న పసిబిడ్డను తీసుకువెళ్ళారని ఊహించుకోవచ్చు."

కాని ఈ మృదువాక్యాలు హెర్మినాకు ఉపశాంతి కలిగించకపోగా స్మృతితప్పి పడిపోయింది.

(45-వ పేజీ చూడండి)

బిచ్చగాండ్లు

శ్రీ బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావు

నిశ్చింతగా చీకట్లను దూసుకు పోతూంది రైలుబండి. వేసవికాలపు రాత్రుళ్లు, విపరీతంగా ఉక్క పోస్తూంది. రాయిపూరునుండి వాల్తేరు మూడవ క్లాసులో ప్రయాణం చేస్తున్నాను. నిజం చెబుతున్నాను, మూడవ క్లాసులోనే ప్రయాణం చేస్తున్నాను. కర్మం చాలక టిక్కట్టు దొరకకో, లేకపోతే జాగా లేకో, ఎవరేనా రెండో క్లాసులోగాని ప్రయాణం చేశాడా, యింటికొచ్చి మాటల సందర్భంలో ఏదో విధంగా నలుగురికీ చెప్పేస్తాడు తను సెకండ్ క్లాసులో ప్రయాణం చేసినట్టు. కాని మూడవ తరగతిలో ప్రయాణం చేస్తే మట్టుకు ఆ వూసే ఎత్తడు. ఎవరేనా అడిగితే, అవసరమైతే ఇంటరు వరకే అబద్ధమాడుతాడు. సరేలెండి, ఆ విషయమిప్పుడెందుకు రామాయణంలో పిడకల వేటలాగ!

నే ప్రయాణం చేసిన మూడవ తరగతి పెట్టిలో ఎక్కువ జనం లేరు; నలుగురం వున్నాము. నా పక్క బెంచీ మీద పడుకున్న తెలుగాయనకు రైల్వేలో పని. గుమాస్తా అనుకుంటాను. లేకపోతే మూడవ తరగతి కర్మమేం! కాని కొసవరకూ డాబుసరిగానే మాట్లాడేడు. ఇంగ్లీషులోనే ప్రారంభించి తన నాగరికతను కాపాడుకున్నాడు.

"ఎక్కడికెళుతున్నారు?" అని ప్రశ్నించి మర్యాదగా ఒక సిగరెట్టు అందించాడు.

"వాల్తేరు-మీరు?"

"నేనూ అక్కడికే, ఎక్కడినుండి వస్తున్నారు?"

"ఢిల్లీ నుండి"

"ఓహో, అలాగా! ఏమిటి ఢిల్లీలో ఏం చేస్తున్నారు?"

"ఏదో ఉద్యోగం, కూటి కోసం."

"అంతే అనుకోండి. అయినా ఢిల్లీలో వున్నారు, అదృష్ట వంతులు" అన్నాడాయన. ఆ అదృష్ట మేమిటో బోధపడలేదు. ఉన్న వాళ్లందరూ కూడా అదృష్ట వంతులేనా అనే సమస్య కూడా వుంది అయినా మొత్తం మీద నా గౌరవం, ఢిల్లీ గౌరవం నిలబెట్టేడు.

"ఏమిటి ఢిల్లీ వింతలు!"

"ఏమున్నాయి. పత్రికల్లో వచ్చేవే!"

"ఆహార సమస్య ఎలావుందక్కడ?"

"బాగానే వుంది."

"అంటే, పరిస్థితి బాగానే వుందనా మీ వుద్దేశం?"

"ఆ! అవును. మనపక్క ఎలావుంది?"

"చాలా ఘోరంగా వుందంటున్నారు. అంటూ వుంటే స్టేషను వచ్చి బండి ఆగింది. మంచినీళ్లకని బండి దిగి వెళ్లేడాయన.

ఆహార సమస్య! దీని గురించి పేపర్లు తెగ వ్రాస్తున్నాయి. నాయకులు, మంత్రులు యీ విషయమై ఉపన్యాసా లిస్తున్నారు. విధీ విరామం లేకుండా సమస్యా పరిష్కార సూచనలు! బీహారులో ఆకలిచావులు! మద్రాసులో కరువు! అమెరికా నుండి అన్నదానం! చైనానుండి బియ్యం! ఆహార మంత్రి గారి వనమహోత్సవాలు! మిస్సే మీల్ ఉద్యమం! అన్నానికి బదులు తెల్ల దుంపలు, మామిడి టెంకల భోజనం! ఇదీ వరస! అసలు కరువంటే ఏమిటి? తిండిలేక మనుషులు చచ్చిపోతారా? ఎలా నమ్మడం? కటిక దారిద్ర్యంలో నివసిస్తూన్న ప్రజలనేకమందున్నారు. కాని వారు ఎలాగో అలాగ, ఏ బలుసాకో తిని బతుకుతారుగాని చస్తారా? ఉత్తర ధృవంలో ధాన్యాదులు పండవు! అయితే అక్కడి వాళ్లు తిండికి లేక చచ్చిపోతున్నారా? మనిషికి బతకాలనే ఆశవుంటే ఎలాగైనా బతికేస్తాడు. పరిస్థితులకు అలవాటు పడి సర్దుకుపోతాడు. ఇంతకు మునుపు కరువులు కాటకాలు ఎన్ని రాలేదు? ఎన్ని పోలేదు?

అంచేత ఆహార సమస్య అంటే ఏమిటి? దాని సమగ్ర స్వరూపమేమిటి? దాని కింత అట్టహాస మేమిటి? ఈ ధర్మ సందేహం నా బుర్రలో ప్రవేశించింది. ఈ రెండు మూడేళ్లలో నాకీ ప్రశ్న తట్టేలేదు. ఏదో పేపర్లో చదవడం తప్ప దానిని గూర్చి అట్టే ఆలోచించలేదు. ఇంత శోధించ లేదు! హోటల్లో డబ్బుపారేసి హాయిగా కడుపునిండా అన్నం తిన్నాను. అప్పుడప్పుడు ఒక పూట భోజనం మానేసే వాడిని; కాని ఆహారసమస్యా పరిష్కారార్థమై మాత్రం కాదు; అజీర్తి వల్లనే. కాబట్టి ఆ గొడవే లేదు. ఇప్పుడు ఏ దేవుడో అనవసరంగా లేవదీసి నా బుర్రంతా పాడు చేశాడు.

నా రైల్వే సోదరుడు ఎప్పుడో నాకు తెలీకుండా ముసుగు తన్ని పడుకున్నాడు. ఆహార సమస్యా చర్చకై ఆతన్ని లేపడం మంచిదా, కాదా, అని ఆలోచిస్తూంటే ఒక స్టేషనులో బండి ఆగింది. ఒక్కసారి జనం ఎలకలమందలా లోపల జొరబడ్డారు. బండికి రెంకులు లేవుగాని రెంకులెగిరిపోయేలా మాటలు! పిలుపులు! కేకలు! అబ్బబ్బ! వెధవగోల! దిక్కుమాలినజాతర, చేపల సంతలా తయారయింది పెట్టి! మా రైల్వే సోదరుడు ముసుగుతీసి "ఏ స్టేషను?" అని అడిగాడు. పక్కనున్న ఆడది "కసింగా" అని జవాబు చెప్పింది.

"అంటే?"

"అంటే ఏటి? దాని పేరు కసింగా" అన్నాది ఆడది.

"ఏడిసినట్టుంది" అన్నాడు సోదరుడు. పెట్టిలో జనాన్ని చూసి విసుక్కున్నాడు. "ఈ వెధవ లందరినీ ఎందుకెక్కనిచ్చేవ్!" అన్నాడు నాతో, ఎవరూ ఎక్కకుండా చూడ్డానికి నన్ను కాపలా పెట్టినట్టు.

"వాళ్లు నన్నడిగి ఎక్కారేమిటి? అంతా ఒకసారి లోపల జొరబడ్డారు"

"వెధవలు, ఇంక మనల్ని నిద్రపోనివ్వరు. మన సామాన్లు ఓ కంటితో కని పెట్టి వుండండి. ఇందులో చాలమంది దొంగ వెధవలుంటారు," అన్నాడు అనుభవజ్ఞుడైన నా తోడి ప్రయాణీకుడు.

"ఎవరు వీళ్లంతా?" అని ప్రశ్నించాను.

"బియ్యం దొంగతనంగా పట్టుకుపోయి మన ప్రాంతంలో అమ్ముకునే వాళ్లు"

అంటూ మళ్లీ ముసుగు తన్నేడు సోదరుడు. వాడి సామాన్లు చూడ్డానికి నన్నిలాగా వినియోగించాడాయన!

బండి నడుస్తూంది; కాని అల్లరి పూర్తిగా సర్దుకోలేదు. పెట్టె చిన్నది; జనం ఎక్కువ. అందులో అన్ని రకాల వాళ్లూ, అన్ని వయసులవాళ్లూ వున్నారు. ఆడ, మొగ, చిన్నా, పెద్దా, ముసలీ, ముతకా అందరితో పెట్టె కిటకిట లాడుతూంది. అందులో ఆడవాళ్లూ, పిల్లలూ ఎక్కువ. ఓ అయిదారుగురు కుర్రాళ్లు కూడా వున్నారు. తలుపులు తీసి, కాళ్లు బయట పడేసి, నేల కూర్చుని సినీమా పాటలు పాడుతున్నారు. పెంకి వెధవలు! అయితే అక్కడ నాకొకటి ఆశ్చర్యం వేసింది. మధ్యవయస్కులైన ఆడవాళ్లకు కడుపులు ఎత్తుగా వున్నాయి; ముసలమ్మలకు నడుములు ఎత్తుగావున్నాయి. వాళ్లు వంగి గూనివాళ్లలా నడుస్తున్నారు. మొదట చూడగానే అర్థం కాలేదు. ఆడవాళ్లందరూ గర్భవతులుగా వుంటారా? ముసలమ్మలందరూ గూని వాళ్లా అని అనుమానం వచ్చింది. కాని త్రుటిలో నివృత్తి కలిగింది. అవి కడుపులు కావు; గూనులు కావు, బియ్యపు మూటలు! వారా మూటలు తమ శరీరాలకు కట్టుకోవడం వల్ల సుళువుగా అటూ ఇటూ కదలలేక పోతున్నారు. దొంగపని చేస్తున్నామనే చైతన్యం భయం ఎదురు వాళ్ల మొహాల్లో, నడకల్లో, కదలికల్లో కనిపిస్తూంది. నీడలా వెంటాడుతూన్న భయం, భయంవల్ల తొట్రుబాటు, ఆయాసం, పట్టుబడకుండా వుండాలనే తీవ్రం ప్రయత్నం, తప్పుకుపోగలమనే ఆశ, తప్పుకుపోవడంలో తమకు గల అనుభవ చైతన్యం వారిలో ప్రస్ఫుటంగా గోచరిస్తున్నాయి. నలుగురూ నాలుగు మూలలా సర్దుకున్నారు. ఒక ఆడది నాకెదురుగా నేలను కూర్చుంది. కడుపుకు బియ్యంమూట కట్టుకోవడం వలన చంటి పిల్లకు పాలివ్వడానికి కొంచెం అవస్థపడుతూంది.

"ఎక్కడి కెళుతున్నారు మీరంతా'' అని అడిగాను ఆడదాన్ని.

''నలుగురూ నాలుగు చోట్ల దిగిపోతాం బాబయ్యా! రాయిగడావరకు కాపాడండి బాబూ! మీ పున్నెముంటది.'' అన్నాది ఆడది.

"ఇక్కడ బియ్యం చవకా?''

''అవును బాబు, రూపాయికి నాలుగు శేర్లు!''

''నువ్వెన్ని శేర్లు పట్టుకొస్తున్నావు?''

"ఎన్ని తేగల్ను బాబయ్యా? రెండు రూపాయిల బియ్యం కొన్నాను, బాబూ!"

"వీటిని ఎన్ని రూపాయిల కమ్ముతావు?"

"లేదు బాబు, అమ్మడానికి కాదు. తిండానికి తెచ్చుకుంటాము."

"నిజంచెప్ప భరవా లేదు. నేనేం పోలీసువాడిని కాదు.''

"మేము తినడాని కుంచుకుని మిగిల్నవి అర్ధ రూపాయిసొప్పున అమ్మేస్తాం'' అన్నాది. ఇంకా ఎక్కువ ధరకే అమ్ముతుంది. నిజం చెప్పకుండా వుందని సుళువుగా గ్రహించేను.

ఆడది తల దించుకుని పిల్లకి పాలిస్తూంది. వయసు నడివయస్సు. యవ్వనం సడలలేదు. కాయకష్టం చేసిన శరీరం; అందమైన కళ్లు! కాని సంస్కారం లేని జుట్టు, మాసిన, అక్కడక్కడ చిరిగిన బట్ట, అనాగరికస్వరూపంవల్ల తొలిచూపుకు అందంగా కనబడకపోవచ్చు. ఆడదానివేపు తదేక దీక్షగా చూసేను. ఆమె నిష్కల్మషమైన కళ్లల్లో, వికారహితమైన చూపుల్లో అజ్ఞానం, అమాయకత్వం, భయం, దైన్యం గోచరిస్తున్నాయి. ఈమే గాని యింత వున్నవాళ్ల యింట్లో పుట్టి వుంటే, ఇంతో అంతో చదువుకున్న. పరిశుభ్రంగా, చక్కగా గోరింకలా తయారయి



ఇంటరుక్లాసులోనో, రెండోక్లాసులోనో ప్రయాణంచేసివుండును. దీనిలాగ బియ్యం దొంగతనం చేసి, నేలమీద, బెంచికింద దూరి యిన్నిపాట్లుపడుతుందా? ఈ ఆడదానికీ ఆ ఆడదానికీ వ్యత్యాసం అవకాశాల్లో వుంది. దానికి అవకాశాలున్నాయి; దీనికి లేవు. ఇది చాల అన్యాయం! ఛీ! మళ్ళీ రాజకీయాల్లో పడుతున్నానేమిటి? వెధవ, రాజకీయాలంటే నాకెంత తలనొప్పో, ఆలోచిస్తూ తిరిగి తిరిగి అందులోనే పడుతూవుంటాను. ఆడది తలదించుకుని కూర్చుని, నిద్రపడుతూన్న బిడ్డని జోకొడుతూంది. పాపం, ఆడదానిమీద నాకు సానుభూతి కలిగింది.

"నీకెంతమంది పిల్లలు?'' అని అడిగాను. కాని యీ, విషయం నాకనవసరమని పించింది వెంటనే. ఆడదాని మంచితనాన్ని అవకాశంగా చేసుకుని ఎక్కువ చనువు తీసుకున్నానేమో నని విచారించేను. లేకపోతే యింకో పెంకిమనిషైతే "నీకెందుకావూను? నువ్వేం కన్నావా, పెంచేవా వాళ్ళని" అని ఎదురు తిరిగేది. అప్పుడు నా పరువు మర్యాద లేంకాను? ఈ ఆడది మంచిది కాబట్టి "ముగ్గురు బాబూ'' అన్నాది.

''నీ భర్త కేంపని?"

"ఏంపని బాబు. ఏం కలకటేరుపనా, తాసీల్దారు పనా? అడగాలేటి? పొలంలో ఏదో కూలీ నాలీ సేత్తాడు."

''అయితే నీకీ బియ్యం వర్తక మెందుకు? నువ్వుకూడా కూలి చేసుకోరాదా?"

''ఎందుకు సెయ్యను బాబు. సెయ్యకొల్లక కూకుంటే గడుస్తాదా? వోరానికి రెండు మూడు రోజు లిలా వచ్చి బియ్యమెట్టుకుపోతాను. నాతిండి కుంచుకుని తక్కిన వమ్మేస్తాను."

''ఏం, మీవూళ్లో బియ్యం ఏమీ దొరకవా?"

''మీకు తెలీదేటి బాబూ, సదివినోరు. కరువు బగ్గున మండిపోతూంది కదా! బియ్యపుగింజలు దొరుకుతాయి బాబు, దొరక్కపోవు. కాని బ్లేకులో కొనగలమా మాలాంటివోల్లం,"

''నువ్వు బ్లేకుమార్కెట్టులో బియ్యం కొనలేవు, కాని అమ్మగలవు. ఏం?" అని ఎత్తిపొడిచేను. మహా గట్టిగా కొట్టేను దెబ్బ. దీనికేం జవాబివ్వగలదు? నా తెలివితేటలకి సంతోషించేను.

''మాకాడ బియ్యం లేనప్పుడు యింకోరి దగ్గర బ్లేకులో కొనుక్కోడం నేదా? అలాగే మా కున్నప్పుడు మే మమ్ముకుంటాం, ఆల్లు మాదగ్గ రొట్టుకెల్తారు.'' గట్టి జవాబే యిచ్చింది. ఫెడీమని లెంపకాయ కొట్టినట్టు జవాబిచ్చింది. ఎవరి కవకాశ ముంటే వాళ్లు యింకోరిని బాధిస్తే కాని నడవదు జీవితం. సాంఘికధర్మమంతా ఒక్క ముక్కలో చెప్పింది ఆడది, నాకు సిగ్గొచ్చేలా.

ఇంతల్లో పెట్టిలో కలవరం బయలుదేరింది. మళ్లా అక్కడివాళ్ళు నాలుగు మూలలా హడావిడిగా సర్దుకుంటున్నారు. కొందరు మరుగుదొడ్లలోకీ, కొందరు బెంచీలకిందకీ దూరేరు. కొందరు పక్కపెట్టిలోకి పరుగెట్టేరు. ఆడది చటుక్కున బెంచీకింద దూరి పక్కలో బిడ్డను పెట్టుకుని పడుకుంది. కాళ్ళు రెండూ కుక్కలా ముడుచుకుంది. కడుపుకి బియ్యపు మూట వుండడంవలన ఏమీ సదుపాయంగా లేదని నేను గ్రహించేను. ఈ అల్లరికి మా రైల్వే సోదరుడు లేచి కూర్చున్నాడు.

''ఏమిటీ గొడవ'' అన్నాను. నాకేం అర్థంకాలేదు.

''ఎవడో రేషనింగువాడు చెకింగుకి వచ్చాడు కాబోలు బియ్యంమూటలు పట్టుకోడానికి'' అన్నాడు సోదరుడు. రేషనింగువాళ్ళు చాలమందిని దించేసేరు రెండునిముషాలూ పెట్టి మళ్ళీ చేపలబజారయింది వాళ్ళు వెళ్లేక ఆడది బయటికొచ్చి కూర్చుంది బెంచీకింద ఉక్కపోస్తోంది; ఎలా పడుకోగలదు?

''ఆహార సమస్యగురించి మీతో చర్చిద్దామనుకున్నాను మీరు పడున్నారు'' అన్నాను.

''ఎందుకొచ్చిన పని చెప్పండి. కావాలంటే యీ పేపరు చదవండి. ఆహారమంత్రిగారి వుపన్యాసం పడింది. ఆయన పరిస్థితిని పూర్తిగా విశదీకరించేరు. నిజమే కొంత కొరత వుందని ఆయనే వొప్పుకున్నారు. ఎందులో లేదు కొరత? మనకన్నీ కొరతే'' అని పేపరు నా మొహాన్న పారేశాడు.

''పేపర్లు చదివి, చదివి మొహం మొత్తింది. నన్ను చంపకండి. మరి యీ సమస్యకు పరిష్కార మేమిటి?''

''ఇటువంటి సమస్యాపరిష్కారానికి ప్రజల్లో నైతిక, ఆధ్యాత్మిక బలం అవసరం. లేకపోతే జరగదు. చూడండి యీ వెధవలు యీ బియ్యం బ్లాకుమార్కెట్టు చేస్తున్నంత కాలం కరువు పోదు.''

''కరువు పోతేగాని బ్లాకుమార్కెట్టు పోదు. ఎలాగ? పెళ్లికుదిరితేగాని పిచ్చి కుదరదు, పిచ్చికుదిరితేగాని పెళ్లికుదరదు."

''పోనిద్దురూ ఆ గొడవలన్నీ రాజకీయవేత్తలకుగాని మన కెందుకు. పది గంటలైంది. నేనింకా భోంచెయ్యలేదు. ఎందుకీ శుష్కవాదం తియ్యండి ఆటిఫిన్ కేరియర్. ఇద్దరం తిందాం,'' అన్నాడాయన. నేను వద్దన్నా బలవంతం చేశాడు. ఇద్దరం పూరీలు, మిఠాయి తిని కూజాలో మంచి నీళ్ళు తాగి, ప్లాస్కులో పాలు సేవించి, జిర్రున తేన్చాము. సోదరుడు మళ్ళీ ముసుగు తన్నేడు వీడి నిద్ర మండిపోనూ. కుంభకర్ణుడిలా వున్నాడు!

అంతల్లో పెట్లోకి టిక్కెట్టు కలక్టరొచ్చాడు. వీళ్ళని చూసి గట్టిగా నాలుగు కేక లేశాడు. సినిమా పాటలు పాడుతూన్న

కుర్రవాళ్ళు వాడితో మాట్లాడుతున్నారు. కాని ఆడది మాత్రం నిర్భయంగా కూర్చుంది.

"నువ్వు టిక్కెట్టు కొన్నావా?" అని ప్రశ్నించాను.

"లేదు బాబు" అని మహా నిర్లక్ష్యంగా జవాబిచ్చింది.

"ఏం? ఎందుకు కొనలేదు?"

"వారానికి నాలుగు సార్లొస్తాను కదా, టికెట్టు కొనగలమా బాబూ, సచ్చిపోమా" అన్నాది అతి తేలిగ్గా.

"మరి వాళ్ళు పట్టుకోరా?"

"మామూళ్ళుంటాయి బాబు లేకపోతే సచ్చిపోం బాబూ. ఈయనెవడో కొత్తోడిలా గున్నాడు. ఇంకా ఏటి, తెలీదు. అంసేతే ఆల్లతో తగువుబడుతున్నాడు"

"వాళ్ళెవరు?"

"మావోళ్ళే బాబు. మేమంతా డబ్బెత్తి ఆల్లకిస్తే ఆళ్ళే యిదంతా సరుదుబాటు సేస్తారు."

"మీరు లంచాలుకూడా యిస్తారన్నమాట."

"లేకపోతే ఎలాగా తాది బాబూ. ఇందులో ఒక్కొక్కడు ఒక్కొక్కలా గుచ్చుకుంటాడు. సలీం బాబున్నాడే ఆయనికి జట్టుకి రెండు రూపాయిలిస్తే సాలు. సాయిబయితే సేం బాబు, దరమరాజు," అన్నాది ఆడది. నాకాశ్చర్యం వేసింది. లంచగొండి వుద్యోగులు ధర్మరాజులట. ఎంత అజ్ఞానం?

"అయితే యిందాకొచ్చిన రేపను వాళ్ళంటే ఎందుకంత భయపడ్డారు? వాళ్ళకూడా లంచమిస్తే వూరుకుంటారుగా?"

"ఆళ్ళుచ్చుకోరు బాబు. ఆళ్ళుచ్చుకుంటేనా? ఓ ఇంక అడిగినారా!"

"ఏం? వాళ్ళెందుకు పుచ్చుకోరు?"

"ఏటో బాబు, ఆళ్ళుచ్చుకోరు."

"వాళ్ళు మీదగ్గర బియ్యం పట్టుకుని తీసుకుంటారా?"

"మొగాళ్ళదగ్గరా, పిల్లలదగ్గరా లాక్కుంటారు బాబు. కాని ఆడోళ్ళదగ్గిర కష్టం. ఏంచేతంటారు? మేము బియ్యం నడుముకీ, కడుపుకీ కట్టేసుకుంటాం కదా? ఆళ్ళు మా బట్టలిప్పా లేరు, మా సేత యిప్పించా లేరు," అన్నాది తమ తెలివి తేటలకి గర్వపడుతూ.

నాకు చాల ఆశ్చర్యమేసింది. ఢిల్లీలో విలాసాల వాతావరణంలో, సుఖజీవుల మధ్య నివసిస్తూన్న నాకు, జీవితమంటే కోనేరు కాదనీ, అది నిరవధికమైన మహా సముద్రమనీ ఏం తెలుసు? మేడల్లో నివసించే భోగజీవులను తప్ప, మేడల నీడల్లో బతికే బతుకులను నేనేం చూసేను? ఈ నాడు యిక్కడ జీవితంలో ఒక కొత్త కోణాన్ని దర్శించాను. వీళ్ళకి చదువు లేదు, ఆస్తి లేదు, ధనం లేదు, ఏమీ లేదు. వాళ్ళెందుకు బతుకుతున్నారో వాళ్ళకి తెలీదు. బతకడంకోసం ఎంత శ్రమ, ఎన్నికష్టాలు, ఎన్ని అవమానాలు! వాళ్ళీ అవమానాలకీ, హీనతకీ ఎంత అలవాటు పడ్డారు. పాపం! అందుకే అన్నాడు కవి, 'అంతేలే పేదల బతుకులు తిరిపెమునకు పిడికెడు మెతుకులు,' అని. నా అజ్ఞానానికి నాలో నేను సిగ్గుపడ్డాను.

మళ్ళీ పెట్టిలో జనం గోలచేస్తున్నారు. వాళ్ళంతా టికెట్టు కలక్టరుచుట్టూ మూగేరు. టిక్కెట్టుకలక్టరు వాళ్ళతో దెబ్బలాడుతున్నాడు. గట్టిగా కేకలేస్తున్నాడు. నాకెదురుగుండా కూర్చున్న ఆడదికూడా లేచివెళ్ళింది.

"రచ్చించండి బాబూ, ఏదో బీదాబిక్కి మీద పగతీరుసుకోకండి బాబయ్యా" అంటున్నాది. కాని టికెట్ కలక్టరు వినిపించుకోలేదు. కోపంతో మండిపోతున్నాడు. కారణం ఏదో వేరే అయి వుంటుంది. టికెట్టు లేకపోతే అంత పెద్ద తగువు కాదు. వాళ్ళలో ఎవరేనా అతన్ని ఎదేనా చెడ్డమాట అని వుంటారు, లేదా ఎక్కువ ఆశపెట్టి తక్కువ యిచ్చి వుంటారు. లేకపోతే యీతడు కొత్తవాడు కావడం వల్లనో, మంచివాడు కావడం వల్లనో లంచమంటే అసహ్యం చుకొని వుంటాడు. లేకపోతే అతనికంత కోపమెందుకొస్తుంది?

"కోపమెందుకు బాబయ్యా, పోనీ మరో రెండెక్కువ తీసుకో బాబూ", అన్నాది ఆడది.

"ఛీ లంజముండా, లంచమిస్తావా నాకు" అని కోపంతో ఒళ్ళు తెలీకుండా లెంపకాయ కొట్టి, బియ్యమున్న చోట బట్ట పట్టుకులాగేడు. బట్ట కొంచెం జారింది. బియ్యమన్నీ నేలపడి చెదిరిపోయాయి. ఆడవాళ్ళు భయంతో గొల్లుమన్నారు. ఇలా జరుగుతుందని ఆడది అనుకోలేదు. కోపంలో ఆవేశంలో యిలా చేశాడు [illegible] లేకపోతే ఎవ్వరూ యిలా చెయ్యరు. ఆడది వెంటనే భయంతో బిక్కచచ్చిపోయింది. సగం విడిన బట్ట సర్దుకుంది. నలుగురిలో ఎంత అవమానం! నేల చెదిరివున్న బియ్యం వేపు చూసింది. దుఃఖంతో ఆమె కళ్ళ నీళ్ళు తిరిగేయి. వెంటనే రోషంతో, కోపంతో మతిపోయిన, పగబట్టిన పాములా బుసకొట్టింది, "ఆడదాని బట్టొట్టుకు లాగుతావురా! నీ కప్ప సెల్లెళ్లు లేరురా, సేతులెలా వొచ్చినాయిరా, నా కొడకా" అంటూ ఫెడీమని చెంపకేసి కొట్టింది. అప్పటికాతడు ద్వారం దగ్గర నిలుచుని వున్నాడు. తలుపుతీసేవుంది. దెబ్బకు కొంచెం జోగి, మొహం తిరిగి వెనక్కి పడిపోయాడు. ఆడది కెవ్వుమని కేక పెట్టింది. బండిలోవాళ్ళు గొల్లుమన్నారు. చీకట్లో వంతెన కింద అడుగున నది నిశ్శబ్దంగా ప్రవహిస్తూంది. నా కాళ్ళ దగ్గర చెదిరిన బియ్యపు గింజలు నవ్వుతున్నట్లున్నాయి. ఆహారసమస్య అంటే ఏమిటో అర్థమయింది.

విషజీవితాలు

కాల జగన్నాధుని రథచక్రాలు దొర్లుతున్నాయి. గూడెంలో కొళ్ళ గుంపుల అరపు లెక్కువయ్యాయి. అర్ధాకలితో లోతుకు పీక్కుపోయిన డొక్కలు, వాడిపోయిన ముఖాలు, సంస్కారంలేని చింపిరి జుట్టు, తుప్పిక్కిం చిన దేహాలతో శ్రామికులు తమ, దైనందిన జీవితకార్యకలాపాల నిర్వహణకు తయారౌతున్నారు.

రత్తి మట్టికడవ బుజాన పెట్టుకొని గుంట దగ్గరకు వెళ్ళింది. నీళ్ళు క్రితం రోజుకన్నా మరీ లోతుకుపోయి పసరుతో కూడుకున్నై. ఈ నీళ్ళతో కాలం గడపటం ఎలాగనుకుంది? కానీ తప్పేదేముంది? పంపులూ, కుళాయీలు లేకపోతే మానె, ఒక బావి అన్నా త్రవ్వి పెట్టగూడదు? ఎవరు త్రవ్వి పెడతారు? తాము త్రవ్వుకుంటా మంటె నే పంచాయతీవారు, ఒప్పుకోవటం లేదు. కారణం ప్రెసిడెంటు పార్టీవాళ్ళకు ఎన్నికల్లో గూడెంవాళ్ళు ఓట్లుయిచ్చి సహాయం చెయ్యలేదు. దేశం మనదే. పాలించేవాళ్ళు మనవాళ్ళే. పండించేదిమనమే. తినటానికీ,

"ఇయ్యాల మాయింటికాడ పెద్దయిందు. మంతిరిగోరు వత్తుండారు. బజాట్లో బాయికాడ గాంధీగోరి బొమ్మ నేయిత్తుండ్రా మన దొర. తెల్దంట్రా? ఎదవనాయాల." అన్నాడు కమతగాడు నరిసిగాడు.

ఇంతలో వెనకనుంచీ దొర వచ్చి పోలిగాడి చెయ్యిపట్టుకొని "పోలాయ్! ఇవ్వాళ మన యింట్లో విందు. గాంధీగారి విగ్రహ ప్రతిష్ఠాపనకు మంత్రిగా రొస్తున్నారు. నువ్వక్కడే ఉండు. భోంచేసి పోదువుగాని." అన్నాడు. దొరగారి హరిజన వాత్సల్యానికి, ఆయన ప్రక్కన ఉన్న మిత్రులిద్దరూ ఉబ్బితబ్బిబ్బయ్యారు.

చూడక చెంగో, చెయ్యో! తగిలితే "అంత కళ్ళు నెత్తికెక్కినైయట్రా, అదిరిపాటు లమ్డీకొడకా?" అని తన్నటానికి సిద్ధమయ్యే దొర ఇవ్వాళ తనంతట తాను వచ్చి దగ్గర బంధువుని ఆదరించినట్లుగా నటించడం పోలిగాడికి ఆశ్చర్యం కలిగించింది. దొరకు మతిపోయిందా అన్నట్లు వెర్రిగాచూశాడు. ఖద్దరులాల్చీ, ముతక ఉత్తరీయం, ధోవతీ, తలపైన తెల్లటోపీ, టోపీపైన మూడురంగుల బ్యాడ్జీ...దొర వెంట బెట్టుకు, మిత్రులతో వెళ్లాడు.

*   *   *

ఆ రోజు ప్రొద్దుగ్రుంకేవరకూ పోలిగాడు గుడిసెకు చేరలేదు. రత్తికి, విసుగూ కోపం వచ్చి "ఎవరో పెద్ద, పెద్దోళ్లు వత్తే యీ సచ్చినోడి కెందుకంట? దొరని కూలడుక్కూ, సక్కొరాక. అల్లుండోళ్ళు గనుక సంబరాలు సేసుకుంటారు. కూలికెగ్గొట్టి సంబరాలు సూడపోతే, రేపు గతేం అవుతది," అని తనలోతాను గొణుక్కొంటూ ఉంది.

ఇంతలో లల్లాయిపదాలు పాడుకొంటూ యీల వేసుకొంటూ పోలిగాడు వచ్చి "ఏమేవ్! అప్పుడే తొంగున్నారంటే, అబ్బబ్బ! బలే! బలే!

"ఏంట్రా? నీ జిమ్మడియ్య! తాగొచ్చావా?"

"ఛా...ఛా...ఇయ్యాలనుంచీ, తాగటవే! చపదం తీసుకుంటె గాంధీగోరి బొమ్మ దగ్గర. తాగొచ్చావంటావ్! నీ సిగదరగ."

"కొప్పెగర దన్నేవోళ్లు లేక ఇంతయాల దాక యాడుండావంట? బుడ్డోళ్ళిద్దరూ, ఏడి గంజికోసరం ఏడిసి, ఏడిసి నిద్దరోయారు. గింజలెయ్యి. దొర యియ్యలా!"

"దొర అనబోక... పెబువు, పెబువచ్చు యియ్యాల. ఊరంతా ఎంత పండగ సేసాడె! నా నెయ్యొట్టుకున్నాడు. మీటింగుకాడికి తీసుకుపోయాడు."

"ఆ... నిజంగానంట్రా?"

"మరేవనుకొన్నావ్! పోలిగాడి దెబ్బంటే!......అళ్లు మనం అంతా ఒకటేనంట. మీటింగుకాడ సెప్పలా!"

"అరి...సచ్చినోడ...దొర నీ సెయ్యిచ్చుకుంటే, నీకు సిగ్గటాలేకపోయింద్రా!

"సిగ్గెందుకే! పాడుమొగందాన. మంతిరిగోరి మెళ్లో దండకూడ ఏయిత్తే, దొర!"

"ఆ...ఆ... నీచాతే నంట్రా! బయ

"పిసిపోలి"

కట్టుకోవడానికీ, త్రాగటానికీ మాత్రం లేవు. రోజు గడవని తమ దుస్థితిని తలపోసుకొంటూ రత్తి గుడిసె జేరి, ఓటిబానపైన చిరుగుల, పైటచెంగును వేసి నీరు ఒడపోస్తూ ఉంది. పోలిగాడు "సాలాపొద్దెక్కిందే" అంటూ కళ్లు నలుపుకొంటూ బయటికి వచ్చాడు. "గంజికి నూకల్లేవు. పెద్దదొరగోర్ని అడిగి కూలిగింజలు తేవాల్నయ్యోయ్!" అంది రత్తిభర్తముఖంలోకి చుస్తూను.

"అట్టాగేలే!" అని పోలిగాడు బయలుదేరి దొరయింటికి వెళ్లాడు. దొర ఇంట్లో లేడు. దొరగారి యిల్లంతా సందడిగా ఉంది. ఇంటి ముందు పందిరివేసి, రంగుజండాలు కడుతున్నారు. ఈ హంగామా అంతా చూచి "ఏమిట్రా? నరిసిగా! యీయాల దొరగారి యింట్లో యిసేసం!" అన్నాడు పోలిగాడు.

గారి యీ వేషం చూచేటప్పటికి పోలిగాడి కళ్ళు బయర్లు కమ్మినై. క్రితం ఎప్డూ అల్లాంటి వేషంలో ఉండగా పోలిగాడు తన దొరని చూచి ఎరుగడు.

కొంతసేపటికి పోలిగాడు తమాయించుకొని "బాబుగారు! యియ్యాల అచ్చంగ గాంధీగోరికి మల్లే, దేశనాయకుల ల్లే ఉండారు" అన్నాడు.

"ఓరి! వెధవ... ఒకప్పుడు మాత్రం మన చెయ్యి ఎందులోరా తక్కువ?" అన్నాడు దొర.

"చిత్తం! బాబూ! చిత్తం." అన్నాడు. ఖంగారు పడుతూ పోలిగాడు ఏదో తన తప్పిదాన్ని సవరించుకొంటున్నట్లుగా.

"ఇక్కడ మీకేమీ పని లేదు. రండిరా! పోదాం. బావిదగ్గర పందిరివేసి, బల్లలు సర్దాలి." అని దొర నరిసిగాణ్ణి, పోలిగాణ్ణి

సెయ్ లేదంట్రా? కొళ్లోణకలా! అల్లు సెయ్య మన్నయ్యాల్లా సేసొచ్చావ! రేపు నీ పని పడతార్లే. ఆళ్లల్లోకి నువ్వెందుకు పొయ్యావురా! పోయినోడివి దూరాన తగలడి సూసి సక్కారాక, నీకే తగని పనులన్నీ ఎందుకురా? ఆల్లు దొర్లు, మనం కూలోళ్లం... మనకీ మీటింగులు, యాసాలు దేనికిరా...?"

"ఓసేవ్! యాసమంటే గ్యాపకం వొచ్చింది. మన దొర, సావుకారు బంగోరయ్యగోరు అంతా ముతకగుడ్డలు కట్టారు. టోపీ లెట్టారు.

"మరేందనుకున్నావ్? రా! అల్లు టోపీ లెట్టుకుసే, నీకు, నాకు టోపీ ఏత్తారు."

"అబ్బ! బలే పప్పన్నం. తాగినంత సెయ్యి పోశారు. పంచదార లడ్డూలు, పులోర, ఇంకేందేందో సాలరకాలు పెట్టారే. నా జనములో తిని ఎరగను."

"సిగ్గులేనోడ. ఇంటికాడ పిల్లలుంది తెలియదంట్రా. నీపొట్టపగలని..తినొచ్చా. కొంచెని పంచచెంగున అడుక్కొని మూట గట్టుకు రాకూడదూ."

"నోరుముయ్యేవ్! తప్పుగాదు. రేపుట్నుంచి మనవూ సాల సేసుకు తినచ్చులే. ఇహమీన నాగా లేకుండా కూలి దొరుకుతాదిలే."

"ఏం? కత?"

"ఆచుపత్రి కడతారంట.' బడులు పెడతారంట. మందిత్తారంట. సతుకులు సెబుతారంట.'

"డబ్బూ, డుబ్బూ నేకుండానేనా?"

"మరేందనుకున్నావ్? చ్వతంత్రం— చ్వతంత్రం రాలా. మునికి."

"చ్వతంత్రం వొచ్చినాక సెవిని పడేయన్నీ మంచి మాటలేరా!"

"ఆ గోసె పరవ్వే! సాల పొద్దోయింది. తొంగుందాం. నిద్ర కళ్లమీనకొత్తంది.'

మర్నాటినుంచి పోలిగాడిపై, గూడెంలోవాళ్లకి ఈర్ష్య, గ్రామంలో అగ్రవర్ణాలవారికి ద్వేషం పుట్టుకొచ్చినై. పెద్దదొర అచ్చయ్యగారు వాడిచేత మినిష్టరుగారి మెళ్లో దండవేయించి వాడికేదో ఘనతను, పేరు ప్రఖ్యాతుల్ని, సంపాయించిపెట్టాడని గూడెంలోవాళ్లకొరకొర. మిగతావాళ్ల మాదిరిగా ఎడంగా ఉండి చూసి చక్కాపోక, తమ పెద్దరికాన్ని, మోతుబరీతనాన్ని లక్ష్యంచెయ్యకుండా, బల్లెక్కి మంత్రిగారిమెళ్లో దండ వెయడం, సహపంక్తిని కూర్చొని భోంచేయడం గ్రామంలోని అగ్రజాతులవారికి తలవంపుగా కనబడి, వాడు కంట బడితే సరి, మండిపడటం సాగించారు.

ఒకాయన "ఈ లమ్డీకొడుక్కి కళ్లు నెత్తికెక్కినై." అంటే మరో ఆసామి "ఈ వెధవకి పొగరుబట్టి వొళ్లు బలిసింది. కన్నూ, మిన్నూ కానటం లేదు." అంటం సాగించారు. గూడెంలో వాళ్ల హేళనలూ, వెక్కిరింతలూ జాస్తి అయినై. పోలిగాడికుటుంబాన్ని పనిపాటల్లోకి పిలవడం మానేశారు. సంసారం గడవటం కష్టమైపోయింది.

పోలిగాడు, రత్తీ తమ సంసారపుగోడు చెప్పుకోవడానికని ఒకరోజు బయలుదేరి పెద్దదొర అచ్చయ్యగారి యింటికి వెళ్లారు.

"అడు దొర్లమాట పెకారం ఆరోజు నడుసుకున్నాడు. అది అందర్కి కట్టంగా ఉందిగావాల. వోరూ కూలికి పిలవటమే లేదు. మీ పాదాలదగ్గర బతికేవాళ్లం. దొరా ఏంసేయమంటారు? నిన్నల్లా పసాళ్లతోసహా యింటిల్లపాది పత్తే పడుకుండాం." అంది రత్తి ఏడుస్తూ అచ్చయ్య దొరముఖంలోకి దీనంగా చూస్తూ.

"ఈ దెబ్బ, దొర్లు కాయకపోతే, మేవూ, మా పిల్లలూ, మల, మలా మాడిపోతాం. దయ చూపించాలి!' అన్నాడు పోలిగాడు దీనంగా.

"పోలిగా/ మీకేం ఫర్వాలేదు. నేను ఇనుము, సిమెంటు పర్మిట్లు సంపాయించాను. ఆసుపత్రి కట్టే కంట్రాక్టుగూడ నేనే తీసుకున్నాను. మీరు ఇహ గూడెంలో ఉండద్దు. మైదానంలో పాకా వేసుకోండి. గూడెంలో నిన్ను వెక్కిరించిన వెధవలంతా పని యిప్పించమని లేపటి నుంచీ నీ చుట్టూ తిరిగేటట్టు చేస్తా! చూడు ...''అన్నాడు పెద్దదొర అచ్చయ్య పౌరుషంగా.

ఆసుపత్రి నిర్మాణంకోసరం విరివిగా విరాళాలు ప్రోగుజేశారు. పలుకుబడిగల వాడు, పార్టీ పెద్ద అచ్చయ్య, ప్రభుత్వ సహాయంతో ఆసుపత్రిభవన నిర్మాణపు కంట్రాక్టు సంపాయించాడు. జీపుకారులో నుంచీ కాలు క్రింద బెట్టకుండా పని వాళ్లతో, పునాదులు, గోడలు లేపేస్తున్నాడు. ఇచ్చిన కోటాలు చాలవని, పలుకుబడి వినియోగించి కొత్త కోటాలు ఇనుమూ, సిమెంటు సంపాయించి బ్లాక్ మార్కెట్టులో అమ్ముకోవడం మొదలు పెట్టాడు. కంట్రాక్టర్ అచ్చయ్యకు పలుకుబడితో పాటు, డబ్బూ పెరుగుతోంది. మండు టెండలో చెమటోడ్చుకొంటూ, పోలిగాడు రాళ్లు మోస్తున్నాడు. మాడు మంటపుడుతున్నా, విరామ మనేది

లేకుండా, రత్తి సిమెంటు, సున్నపు బొచ్చెలు మోస్తూ ఉంది. వాళ్ల జీవితంలో మాత్రం ఎదుగూ, బొదుగూ అనేదిలేదు. వాళ్ల రెక్కలే వాళ్ల కాధారం.

తెల్లవారుతోంది, ప్రొద్దు గ్రుంకుతోంది, రోజులు గడుస్తున్నాయి.

దీర్ఘచతురస్రాకారపు పెద్దగదికి టాపీ పనివాళ్లు సిమెంటుపని చేస్తున్నారు. రత్తి బొచ్చెలు అందిస్తోంది. కంట్రాక్టర్ అచ్చయ్యగారు పని ఎంతవరకూ, పూర్తి అయ్యిందో చూద్దామని జీపుకారు దిగి, గబ, గబా గది మధ్యకొచ్చి నిలుచుని, పని చేయిస్తున్న గుమాస్తాకేసి చూస్తూ "ఇది కాన్పులగది. చుట్టూ గజమెత్తు వరకూ పింగాణీ బిళ్లలు అతకాలి. పెద్ద కిటికీలకు, ప్రత్యేక గాజుతలుపులు అమర్చాలి. జాగ్రత్తగా పనిచేయించు." అని చెప్పడం రత్తి విన్నది.

సందె చీకట్లు ప్రకృతిని ఆవరించాయి. రేషన్‌డిపోనుంచీ, తెచ్చిన బియ్యాన్ని బాగుచేసి, రత్తి ఎసర్లోపోసింది. పోలిగాడు దగ్గర్లోనే కూర్చొని చిదుగులు, పొయ్యిలో పెడుతున్నాడు.

"పోలిగా! పెద్దదొర యియ్యాల సెబుతూంటే యిన్నాను. ఆ తూరుపేపు పెద్ద గది ఆడోళ్లు పురుడోసుకోటానికంట. పింగాణీ బిళ్లలు అతుకుతారంట. తలుపుల కద్దాలు పెడతారంట. మల్లీ పురుడొత్తే ఆసుపత్రిలో పోసుకుంటా. మన గుడిసెలోసరైన మంచంకుక్కి గూడ లేదు. తపెవ, తడవ సాల యాతనగా ఉంది."

"రత్తీ! పురుడుమోజు నీకింకా తీర్నె దంల్నే. మనబోటోళ్లు పిల్లల్ని కని ఏం లాభం. మనలాగ రెక్కలిరగ్గొట్టుకు అవత్త పడితేనే, అన్నం దొరకటం అంతంత మాత్రం కట్టంమంది. శమట తీసేది మనం, మన బిడ్డలు. సుకం, అనుభవం దొరలది..."

"నిజమేరా! పెతిదీ దర పెరిగిపోయింది. పెద్దదొరకి యీ కంట్రక్టులో సాలా మిగులు తానంటగా... కొత్త కూలెక్కు విప్పితే కడుపునిండా కూడు తింటాంగాం...''

"మన కెందుకిత్తారే, పిచ్చి మొగవా!.. ఆల్లు ఏలు సంపాయించుకోవద్దూ! యిందులు సెయ్యటానికీ, బొమ్మలెయ్యటానికీ కర్సుపెడతారు గాని, కూలెక్కు విత్తారా...మనం తింటే ఆళ్లకేం? తినక పోతే ఆళ్లకేం...''

ఇంతలో అన్నం ఉడుకు పట్టడం చూచి రత్తి గంజి వొంచే చిప్పకోసరం అవతలకు వెళ్లింది. పోలిగాడు గుడిసెకు దగ్గర్లోనే ఆడుకొంటున్న పిల్లల దగ్గరకేసి వెళ్లాడు.

ఆ రోజురాత్రి చాలా ప్రొద్దుపోయిందాక, పోలిగాడు, రత్తీ గడవని దుర్దినాలల్లో నిలవని ప్రాణాలను, నిలుపుకోవడానికి పడే సంఘర్షణతో, తమ వ్యధా జీవిత కథనంలోని, చీకటి వెలుగుల్ని తరచి చూచుకొని నిస్పృహతో అలిసి నిద్రాదేవి వొడిలో వొరిగిపొయ్యాడు.

* * *

వైద్యాలయ భవన నిర్మాణం పూర్తి అయ్యింది. ఆరోగ్యశాఖామాత్యులచే ప్రారంభోత్సవం జరిగింది. కంట్రాక్టరు అచ్చయ్య విందు చేశాడు. జీపు అమ్మేసి కొత్తకారు కొన్నాడు. అచ్చయ్యసంసారం ఉచ్చస్థితికి పోతున్నకొద్దీ, పోలిగాడి సంసారం బాగా హీనస్థితికి దిగజారిపోతోంది. పోలిగాడు రోజు గడవటం కష్టంగా వున్న తన బ్రతుకునుబట్టీ, కూలివాడైపుట్టి, రెక్కలు విరగ్గొట్టుకుంటూ రాత్రింబవళ్లు దొరలకు తలొగ్గి చాకిరీచేస్తూ కూడ పొందుతున్న హింసను బట్టే తనకు యిహ పిల్లలు వొద్దనుకున్నాడు. కానీ ప్రకృతి తన పని తాను నిర్వర్తించుకు పోతోంది. రత్తికి మళ్లీ గర్భం వచ్చింది. గర్భంవచ్చిన దగ్గర్నుంచీ తన ఊహలు నెరవేరే కాలమాసన్నమవుతుందని కలలుగనసారంభించింది. "తనకు నొప్పులు రావడం భర్త ఆసుపత్రిలో చేర్చడం ఆయాలు, నర్సులూ ఆప్యాయంగా తీసుకుపోయి, కాన్పులగదిలో బల్లమీద పడుకోపెట్టడం చుట్టూ అందమైన పింగాణీ బిళ్లలూ, అద్దాల తలుపుల కిటికీలు పైన గాలి విసిరే పంకా, అడుగులకు మడుగులొత్తుతూ ఉండే ఆసుపత్రినర్సులూ, అబ్బా! పుట్టబోయేవాడు ఎంతో అదృష్టవంతుడు... వాడి వైభోగం ముందే తెలుస్తోంది..." ఇవీ రత్తి మెదడులో మెదులుతుండే దృశ్యాలు ఆలోచనలు.

రత్తికి పురుడువచ్చే రోజులు దగ్గరపడసాగినై. పోలిగాడు ఇంటి చాకిరీతో, కూలిపనితో, మనిషిబాగా నలిగిపొయ్యాడు. ముందు ప్రహరీగోడ పూర్తికాలేదని అచ్చయ్య మండిపడుతున్నాడు. గుమస్తా కూలివాళ్ల చేత, మధ్యాహ్నపు విశ్రాంతి కూడ ఇవ్వకుండా మండు టెండలో చెమటోడిపిస్తున్నాడు.

పగలల్లా ప్రహరీగోడల కందకాల్లో చెమటోడుస్తూ, దిమ్మిసె వేసి రాత్రిళ్లు గుడిసె చేరిందగ్గర్నుంచీ, దగ్గూ, ఆయాసంతో పోలిగాడు బాధపడేవాడు. రత్తి యిది చూచి, భర్తని ఆసుపత్రికి వెళ్లి మందు తెచ్చుకు రాగమని పోరుకులాడేది. మందు కోసరం ప్రొద్దున ఏడు గంటలకు పోతే పదకొండింటిదాక మందు పోసే వాళ్లు లేరు. పనిలోకి వేళకు వెళ్లకపోతే పెద్దదొరగారి గుమాస్తా ఊరుకోడు. నాలుగు రోజులు మందుపోసిందగ్గర్నుంచీ కాంపౌండర్ "మామూలు" కోసరం చెయ్యిచాచ మొదలు పెట్టాడు. పేరుకి ధర్మాసుపత్రి. మామూళ్లూ, ముడుపులూ మాత్రం తప్పవ్. ఈ బాధలన్నీ పడలేక పోలిగాడు, ఒక రోజు వీలునుబట్టి మందు తెచ్చుకొని,... తెచ్చుకోక బాధతోనే రోజులు వెళ్లదీస్తున్నాడు.

సంధ్య వేళప్పుడు, ప్రారంభమైన నొప్పులు రాత్రి పదిగంటలయ్యేసరి కల్లా తీవ్రమై, రత్తిని బాధించసాగాయి. రత్తి బాధ భరించలేక అప్పుడే ఆసుపత్రికి చేర్చమని పోలిగాణ్ణి కోరింది. పోలిగాడు భార్య ప్రసవవేదన చూచి "మరీ చాకిరీతో మనిషి ఈ దఫా నీరసించి పోయింది. రక్తం లేదు. క్రిందటిమాటు సులువుగా కాన్పు అయ్యింది. ఈసారి ఎలా వొడ్డెక్కుద్దో!..." అనుకుంటూనే, పెద్దకొడుకు సాయంతో, భార్యని ఆసుపత్రివరండాలోకి చేర్చాడు. చిన్నవాడు, చంకన పెట్టుకొచ్చిన చినుగుల

బొంత పరిచాడు. రత్తిని పడుకోబెట్టి, నర్సు ఉండేగదిదగ్గరకు వెళ్ళి పోలిగాడు, ఆమెను లేపి, సంగతి చెప్పాడు. అమ్మగారిదగ్గర్నుంచీ చీటీ లేందే, తానేమీ, చెయ్యలేనంది. పోలిగాడు, రోజుకుంటూ, డాక్టరమ్మ నివాసంకు, వెళ్ళి తలుపుతట్టాడు. పెరట్లో కుక్క భౌ... భౌ మంది. బయట నిద్రిస్తున్న నౌకరు కుక్క అరుపుకే లేచాడో, పోలిగాడిమొర వినే లేచాడో చెప్పలేం గాని, మొత్తంమీద లేచి, విసుక్కుంటూ వెళ్ళి గేటుతలుపు దీసి "ఎవరు?" అన్నాడు.

"బాబూ! ఆసుపత్రి కట్టేకాడ పనిజేత్తున్న కూలోణ్ణి. మా ఆడోళ్ళకి పురుడొచ్చే రోజులు. సాలా బాదపడతంది. అమ్మగారి దరిసెనం సేయింమ సెప్పకుంటాను."

"అర్ధరాత్రి వేళప్పుడా?... లాభం లేదు. ప్రొద్దున్నే రా! చూద్దాం."

"బాబూ! నీపాదాలకి మొక్కుతా! కూటికి లేనోణ్ణి. అది బతికితే నే, సన్నీళ్ళకి, ఏనీళ్ళు తోడు... లేకపోతే, నా సంసారం నట్టేటిపాలవుతాది." ఇంతలో నౌకరు బీడీ కని నిప్పుపెట్టె గీశాడు. ఆ వెలుగులో పోలిగాడి ముఖం నౌకరుకు స్పష్టంగా కనుపించింది. వాడి, ఎండిపోయిన, పోలిగాడి శరీరం, కన్నీళ్ళు చూచేటప్పటికి నౌకరు హృదయం కరిగింది. కూలివాడు వారానికి కలిపి బట్వాడా తీసుకుంటుంటే, తను ముప్ఫై రోజులకూ, కలిపి జీతమనే పేరుతో తీసుకుంటున్నాడు డబ్బు. ఇద్దరికీ లెక్కాడితే నే, డొక్కాడేది. ఈ పోలికతో నౌకరుకు, పోలిగాడిపై సానుభూతి, దయ ఏర్పడి "లాభం లేదను కుంటాను. అయినా ఉండు... వెళ్ళి లేపి అమ్మగారితో చెబుతాను. ఏమంటారో..." అని నౌకరు గబ, గబా మెట్లెక్కి వరండాదాటి, ద్వారం దగ్గర కెళ్ళి, "కాలింగ్ బెల్ స్విచ్" నొక్కాడు.

గంట మోతకు డాక్టరమ్మకు నిద్రాభంగం కలిగి, తీవ్రంగా కోపంవచ్చింది. రుస, రుస లాడుతూ, వచ్చి తలుపుదీసి, నౌకరు కేసి చూస్తూ "ఏమిట్రాగోల......"అంది.

"అమ్మగారూ! ఆసుపత్రి కట్టేకాడ పని జేసే కూలివాడి, పెళ్లామట. నొప్పులతో బాధపడుతూ ఉందట. కాన్పు కేసు. వాడొచ్చాడు."

"కూలివాడా.... గీలివాడ... ఫో... పొమ్మను. వెధవల కేం పని లేదు. వేళా లేదు, పాళా లేదు. అర్ధరాత్రి వేళ కొంప మీద కొస్తారు. వాళ్ళ తాతగాడి సొమ్మంతా యిచ్చి, పోషిస్తున్నట్లు. అసలు నీకు బుద్ధి లేదు. గేటెందుకు తీశావ్? రాస్కెల్..."

అని గభాల్న తలుపేసుకొని, డాక్టరమ్మ లైటార్పేసి లోపలికి వెళ్ళిపోయింది.

నౌకరొచ్చి పోలిగాడిమీద విసుక్కుని గేటేసుకున్నాడు.

రత్తి బాధతో మూలుగుతూ ఉంది. పోలిగాడు చేసేదేమీ లేక, నిస్పృహతో కూర్చున్నాడు. ఒక రాత్రివేళ, కారుహారన్ వినబడింది పోలిగాడి చెవులకు. అదిరిపడి కళ్ళు తెరిచి, చూశాడు. కారు దగ్గరికి నర్సులూ, ఆయాలూ పరుగెత్తుకువెళ్లారు. కాన్పుకొరకు, వచ్చిన కంట్రాక్టరు అచ్చయ్యదొరభార్యను, కారులోనుంచి, నర్సులు ఊతంగా పట్టుకొని తీసుకురావడం పోలిగాడికంట బడింది. మరో పది నిమిషాల్లో కారులో డాక్టరమ్మ రావడం, పెద్దదొర అచ్చయ్యగారి భార్యకు కాన్పు జేయడం జరిగింది.

జీవితంలోని హెచ్చు, తరుగుల వ్యత్యాసాల్ని గమనించే టప్పటికి పోలిగాడి హృదయం, కోపంతో, ప్రతీకారంతో నిండిపోయింది. పండ్లు కొరికాడు. పెదవి విరిచాడు... అంతకన్నా వాడు చెయ్యగలిగిందేముంది?...

అభిమానం, రోషం మరో నిముషం లోనే చంపుకొని, వెళ్ళి డాక్టరమ్మని తన భార్యనుకూడ చూడవలసిందిగా ప్రాధేయపడ్డాడు.

ఆమె "ఇప్పుడెక్కడ... వేళాపాళా లేదా? ప్రొద్దున్నే చూస్తాను." అంటూ నర్సుని పిలిచి ఏదో గొణిగి, తాను కార్లో ఎక్కి ఇంటికి వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిన కాసేపటికి నర్సు ఏవో రంగునీళ్లు తెచ్చి రత్తిని నోరు తెరవమని, పోసిపోయింది. తెల్లవారు ఝామున రత్తికి పొట్ట ఉబ్బింది. బాధ ఎక్కువైంది. క్రమంగా గురక పెట్టడం మొదలుపెట్టింది.

పోలిగాడి హృదయంలోని ఆశాజ్యోతి సన్నగిలింది. అంధకారం ఆవరిస్తోంది. బాధలోనే రత్తి, భర్తను దగ్గరికి పిలిచి, పిల్లల్ని అప్పజెప్పి, ఏడుస్తున్న భర్తకళ్లను, పైటచెంగుతో తుడిచి "ఎందుకు బాధపడతావ్... బిడ్డల్ని కూసుకో... మన కడుపులు మాడుసుకుని, సెమట, రకతం తీసేసి, యీ ఆసుపత్తిరికి శాకిరిసేసి కట్టాం. దరమాసుపత్తిరి అన్నా, దనంగలోళ్ళకే గాని, మనకొక్కదురా! అబ్బ! మానమీన జాలి గలవాల్సిన పని, పెపంచకాని కెందుకుంటదిరా? కట్టం మనది. పేరు వుంకొకరిది. అనుభవం మారాజులిది... చ్వతంత్రంకూడ ఆళ్లకే... మాటలు యిని యిహమీన మోసపోవాక...... అంతా చవానం వొత్తి అబద్ధకం...ఈ రాసికం మనస్సులో పెట్టుకో!! అంది.

భార్యమాటలు వింటుంటే, "లేనివాళ్ళు, వాళ్ళ జీవితాలకి, వాళ్ళే సమాధిగోతులు త్రవ్వకొని, లోపల కూర్చొని, వాళ్ళ చేతులతోనే మట్టిని లాక్కుని, పూడ్చుకోవాలి." అన్నట్లు పోలిగాడి హృదయానికి తట్టింది.

తెలతెలవారుతూ ఉండగా స్వతంత్రోత్సవ ప్రభాత భేరి మ్రోగింది. దొంగ మార్కెట్టువ్యాపారంతో ధనరాసులు ప్రోగుజేసిన కుబేరులంతా తమ దాతృత్వం ప్రపంచానికి, చాటటానికి, ఊరేగింపులు ఉత్సవాలు విందులు, చేస్తున్నారు.

పోలిగాడికి యీ సంరంభం అర్థంగాక, ఏమిటని ఆసుపత్రి నౌఖర్ని అడిగాడు నాలుగడుగులు అవతలకేసి.

"ఇవ్వాళ, స్వాతంత్ర్యదినం. ఆగష్టు 15." అన్నాడు నౌఖరు.

ఇంతలోనే "ఒరే! అయ్యోయ్!... అమ్మ... అమ్మ..." అని బావురుమన్నాడు పెద్దాడు.

పోలిగాడు భార్య దగ్గరకువచ్చేటప్పటికి, రత్తి ఆఖరి ఊపిరి తీసి వొదిలింది. పోలిగాడు, బిడ్డలతోసహా భార్యశవంపైబడి హృదయం బ్రద్దలు కొట్టుకుంటున్నాడు.

బ్యాండు, సన్నాయి మేళాలతో, స్వతంత్రదినోత్సవపు ఊరేగింపు వైభవంగా, ఆసుపత్రిముందుగా సాగిపోతోంది జయ, జయ, ధ్వనులతో.......

★

పెళ్ళాల రభస

శ్రీ పోతుకూచి సాంబశివరావు

పాత్రలు:

1. రామావధాని: మర్యాదస్థుడైన కుటుంబీకుడు.
2. సీతాయమ్మ: రామావధాని భార్య వెటకారపు మనిషి.
3. అనంతబుద్ధి: } చాలాదూరపు బంధువులు.
4. నిరంజనదాసు: }
5. నానిబాబు: రామావధానికి తృతీయపుత్రుడు.

1 వ రంగం

(రామావధానిగారి యింట్లో నిరంజనదాసు భాగవతకాలక్షేపం చేస్తూ)

ని: "చుట్టాలు దొంగలు, సుతులు ఋణస్థులు, కాంతలు సంసారకారణములు."

ఇదిగో రామావధాన్లుగారూ! పోతన రచన చాల మృదుమధురంగా వుంటుందండీ.

రా: పోతనకవిత్వం నిరంజనదాసుగారి పఠనలో ద్రాక్షాపాకంలా ఉంటుందంటే సరిపోతుందిగా!

సీ: "కాంతలు సంసార కారణములు" అని వైరాగ్య జ్ఞానం చూపిన మనిషి, పోనీ, తను పెళ్లి చేసుకోడం మానేడాండి పోతన?

(టకటకమంటూ జట్కాచక్రం చప్పుడు)

ని: గృహస్థాశ్రమం జీవితధర్మం కనుక నిర్వర్తించాడే కాని, పోతన నిజంగా పెళ్లి కావాలని కోరేడనా మీ వుద్దేశ్యం! అబ్బే!

(జట్కా ఆగినచప్పుడు. పెట్టెలశబ్దం)

రా: ఇదిగో! సీతా! మన యింటి ముందు జట్కా ఆగినట్లుంది చూడు!

సీ! (వెటకారంగా) మరే! యింకెవరై ఉంటారు! ఎవరో చుట్టాలేమో!

(అనంతబుద్ధి ప్రవేశం)

అనం: రామావధాన్లుగారూ! నమస్కారం. అంతా క్షేమంగా ఉన్నారా!

రా: ఎవరది!

అ: నేను! నేనండి! జ్ఞాపకంరాదండీ!

రా: ఏమోనాయనా! ఎక్కడైనా చూసేనేమో కాని! అట్టే జ్ఞాపకంలేదు.

అ: నాపేరు అనంతబుద్ధి! హిహిహి... మీ మూడో అల్లుడు లేడూ! వెంకటశాస్త్రి!...వాడి అమ్మ అక్కగారి మనుమరాలిని మా తమ్ముడి కిచ్చారు......అప్పుడప్పుడు మీ వెంకటశాస్త్రి నేనూ బాగా కలిసి తిరుగుతూండేవాళ్లం......పాపం! మీకు పెద్దతనం చేత జ్ఞాపకం తగ్గిఉండవచ్చు!......వెంకటశాస్త్రి పెళ్లికి నేను కూడా...అన్నట్టు రాలేదు, వద్దామనుకున్నాను. ఎప్పటికప్పుడు మీ యింటికి వద్దామనుకోవడమే. తీరుబడి ఉండది కనుకనా! జీవితమంతా యీ వుద్యోగంతో సరిపడేటట్టు ఉందండి!

సీ: (హేళనగా) అయితే! నాయనా! మా అల్లుడి దొడ్డమ్మగారి మనుమరాలు చిట్టిని మీ తమ్ముడి కిచ్చారన్నమాట!

అ: మరేనండీ! రెండునెలల క్రితం వెంకటశాస్త్రి మా యింటికి వచ్చాడు. నాకు యిక్కడి భండారుపురం బదిలీ అవుతుందని చెప్పినపుడు "ఓసారి మా మామగారి యింటికి వెళ్ళి చూసి రారా!" అన్నాడు. భండారుపురం వచ్చి ఏడైందనుకోండి! కాని తీరుబడో! ఎప్పటికప్పుడే వద్దామనుకోడం! ఏదో పని అడ్డు రావడం! యిన్నాళ్ళకి రాగలిగాను.

రా: నేను నిన్ను జూడటం యిదే మొదటిసారి. అయితే మా యిల్లు ఎల్లా కనుక్కోగలిగావోయి అనంతబుద్ధీ!

అ: ఏముందండీ. నోట్లో నాలికఉంటే ఏదైనా చెయ్యొచ్చు! ఫలానాచోట అని మా శాస్త్రి చెప్పాడు. ఇక్కడికి వచ్చాక నల్గురిని కనుక్కున్నాను. హి హి హి....



నేను మిమ్మల్ని చూడలేదు కానండీ. మీ ఫోటో, చూశాను. అందుచేత మిమ్మల్ని యిట్టే ఆనవాలు పట్టేశాను. హిహిహి.

సీ: (హేళనగా) మమ్మల్ని చూడకపోయినా, ఏదో ఆ బంధు అభిమానం పురస్కరించుకు వచ్చావు! చాలా సంతోషం నాయనా!

ని: బంధువుల అభిమానం అంటే అల్లాగుండాలి.

సీ: (వెటకారంగా) ఆ! ఆ! అల్లాగే ఉండాలి.

రా: (అనంతబుద్ధితో) ఈయన నిరంజనదాసుగారని చాల భక్తులు...హరిదాసులు...మనకి బంధువులు. యీ రెండు నెలలనుంచీ హరికథలతో మనవూరు పవిత్రం చేస్తున్నారు.

అ: నమస్కారమండీ.

ని: నిరంజనార్పణమస్తు!

రా: అయితే అనంతబుద్ధి! భండారుపురంలో ఏం చేస్తున్నట్లు నువ్వు?

అ: ఏముందండీ యీమధ్య ఆహార సేకరణ డిపార్టుమెంటు పెట్టారుకదూ! అందులో పని. నెల్లాళ్ళూ బయట అడ్డమైన పల్లెటూళ్ళూ తిరగడంతో సరిపోతూందండీ. నానాతిప్పలు పడాలి.

సీ: ఏ తిప్పలూ పడకపోతే అప్పనంగా డబ్బు యిస్తారటయ్యా ఎవరైనా?

రా: లేవోయి! లేవోయి! అనంతబుద్ధి! కాస్త భోంచేసి విశ్రమించుదుగాని! ఒరే నానిబాబు! కాళ్ళు కడుక్కుందుకు నీళ్ళు తీసుకురా యీయనకి!

(నానిబాబు ప్రవేశం)

నానిబాబు: (నీళ్లు యిస్తూ) ఎవరికే అమ్మా నీళ్లు!

సీ: ఆయనకేరా! అనంతబుద్ధిగారికి...

అ: యితను మీ అబ్బాయేనండీ? ఏం చదువుతున్నావోయి పంతులు!

నాని: మూడవ ఫారము చదువుతున్నాను!

రా: వీడు మా మూడో వాడు.

అ: అయితే! నువ్వు నాకేమవుతావోయి పంతులు! పినాన్నన్న అవుతావన్నమాట! ఏమండోయి పినాన్నన్నగారూ!

సీ: వరుసలు, వావిలు, తరువాత చూసుకోవచ్చు! భోజనానికి లేస్తే బాగుంటుందేమో!

రా: మరే! భోజనానికి లేవోయి అనంతబుద్ధి.

అ: చిత్తం!...దాసుగారు; ఏదో చదువుతున్నట్లున్నారు.... నా రాక విసున్నా అభ్యంతరం...

సీ: అబ్బెబ్బే! ఏమీ అభ్యంతరం కలుగ లేదు. ఆయన నిత్యం తీరుబడి మనిషి.

రా: మరే! ఎప్పుడు కావలిస్తే అప్పుడే చదివించుకోవచ్చు భాగవతం. ముందు భోజనానికి లెండి.


2 వ రంగం

(రామావధాని, సీతాయమ్మ యింట్లో మాట్లాడుకుంటూ)

సీ: ఏమండీ! యిదేమన్నా సత్రమనుకున్నారా! సంసారం అనుకున్నారా! రెండు నెలలనుంచి పడి తింటున్నాడు ఆ దాసు! ఉద్యోగం పని యీ వూళ్ళో యింకా రెండు నెలలైనా పడుతుందంటాడు యీ అనంతబుద్ధి! యిల్లా నెలల తరబడి అడ్డమైనవాళ్ళూ పడితింటూంటే సంసారాలు మట్టికొట్టుకపోవుటండీ!

రా: యింటికి బంధువులొస్తే ఆమాత్రం మర్యాద చెయ్యకపోతే బాగుంటుందా!

సీ: బంధువుల మర్యాదకుకూడా హద్దు పద్దూ లేదు! దగ్గర బంధువులైతే అనుకోవచ్చు. పోనీ! కానివాళ్లైతే అనుకోవచ్చు! ఆశమ్మ బోశమ్మ నాయనమ్మ మనవడి



కొడుకునంటూ యీ అనంతబుద్ధి ఎవరు! ఆ దాసు చూడండీ! రెండు నెలలనుంచి హరికథల్లో సంపాదించింది బొడ్డున మూట కట్టేస్తున్నాడు. భోజన కాలక్షేపం మనింట్లోను. బోషాణంలో ధనం దాపరికం. మనలాంటి తెల్వితక్కువ వాళ్లెవరూ ఉండరు.

రా : ఊరుకో! వాళ్లు వస్తే బాగుండదు. వింటే ఏమనుకుంటారు?

సీ : వింటే నాకేమండీ! మంచీ చెడ్డా లేకుండా, నిరో్త్సాహమాటంగా తిండికోసం తిష్ఠ వేస్తే, మనకు మాత్రం మొహమాటం లోనవడంలో మొహమాటా లెందుకు?

రా : యిక్కడ వుంటే నీ పోరు తగ్గేట్టు కనిపించడంలేదు. నేను బయటకు పోనా ఏమిటి?

సీ : ఏమన్నా అంటే బయటికి పోతాననడం బాగా తెలుసు. వెడితే వెళ్లండీ! వాళ్లు రాగానే బయటికి సాగనంపుతా!

రా : ఆసీ! నీయిల్లు బంగారంగానూ! అంతపనిమాత్రం చెయ్యకు. వంశమర్యాద నిలబడాలా!... నేను బయటికి పోతున్నా తలుపేసుకో!

(తలుపు మూసిన చప్పుడు)

సీ : దారిమ్మటపోయేవాడు ప్రతీవాడు బంధువే! బంధువులట! బంధువులు! రానీ! మూటాముల్లె కట్టేటట్టు చేస్తాను.

(తలుపు తట్టిన చప్పుడు)

ని : సీతాయమ్మగారూ!

సీ : వచ్చాడూ యీ దొంగదాసు! రానీ!...(ఏడుస్తూ) హుహుహు. రండీ! (తలుపుతీసి) దాసుగారూ! అయ్యో! అయ్యో!...ఎంత అవస్థతెచ్చి నా నెత్తిన పడేశేవురా నాయనా!

ని : అదేమండి పాపం! అల్లా విచారిస్తున్నారు.

సీ : (ఏడుస్తూ) ఏముంది నాయనా! యింత కష్టం వస్తుందనుకోలేదు. పిడుగు వచ్చి మీద పడిపోయింది.

ని : నిజమే లెండి! పెద్దపెద్దవాళ్లమీదే యీ పిడుగులు పడుతూంటాయిలెండి! యింతకీ ఆ పిడుగు ఏమిటో చెప్పారు కారు!

సీ : యింకేముందండి! ... మా మామగారు లేరూ!

ని : ఉన్నారు. కొంపదీసి! ఆయన కాని...

సీ : ఆయన కాదండీ! ఆయన పినతండ్రి కొడుకు పోయాడు.

ని : అరరె! అయితే పారిపోయాడా! చచ్చిపోయాడా!

సీ : (ఏడుస్తూ) పారిపోతే యింతగా విశ్వాస మెందుకండి! చచ్చిపోయాడు కనుకనే దుఃఖం పొంగి పొరలివస్తూంది.

ని : పాపం! ఎప్పుడు పోయాడు!

సీ : యీ వేళ ప్రొద్దున్నటండీ! యిప్పుడే టెలిగ్రాం వస్తే ఆయన ఉరకలు వేసుకుంటూ పరుగెత్తారు. నేనంటే వాడికి ఎంతో అభిమానం.

ని : అయ్యయ్యో! ఎంత కష్టం! ఎంత కష్టం! కష్టాలు మానవులకే వస్తాయి! అందులో, ఓపిగ్గా అనుభవించేవాళ్లకి మరీ వస్తాయి.

(అనంతబుద్ధి ప్రవేశం)

అ : అదేమండీ! సీతాయమ్మ మామ్మగారూ! అల్లా విచారిస్తున్నారు.

ని : రావోయి! అనంతబుద్ధి! యీవిడకు తగని కష్టంవచ్చి మీదపడింది. యీవిడ మామగారి పినతండ్రికొడుకు పాపం! పరమపదించాడు.

అ : అయ్యయ్యో! మీరు యింకా అలా చూస్తారేం! కాస్త ఆ గీతాసారం ఆవిడకు బోధించి ధైర్యం చెప్పండి! యిటువంటి కష్టాలలోనే మీ పురాణాలు ప్రయోజనం చూపించాలి!

ని : అది నిజమే కానోయి! యిటువంటి కష్టాలు వచ్చినప్పుడు నా గీత బాగా పలకదు. యీవిడని చూస్తోంటే నాకే ఎంతో దుఃఖం వస్తోంది.

సీ : (విచారంగా) నాకు మరొకందుకు మరీ దుఃఖం వస్తోంది. మీకు యింత కష్టం కలిగించవలసివస్తుందని కలలో కూడా అనుకోలేదు.

ని : (ఆశ్చర్యంగా) మాకు కష్టమా! (విచారంగా) మాకు కూడా ఏం కష్టం వచ్చిందండీ!

సీ : యింకేముంది! మాకా 12 రోజులు మైల. నేను యింట్లో వండడానికి వీల్లేదు. పైగా నేను మా మామగారి పినతండ్రిగారి ఊరు వెళ్లాలి. పాపం! మీకు భోజనానికి చాలా యిబ్బంది కలుగుతుంది. మళ్లీ తిరిగి ఎప్పుడొస్తానో నాకే తెలియదు.

ని : యిది అంత పెద్దకష్టం కాదనుకోండి! మీరు కాస్త సెలవిస్తే, నేను యింట్లో వంటఅంతా చేస్తాను. నలభీమ పాకాల్లో ఆరితేరిన ఘటికుణ్ణండి నేను.

అ : కావాలంటే నేను కూడా ఒక చెయ్యి అందిస్తా దాసుగార్కి.

సీ : నాకేమీ అభ్యంతరం లేదుగాని! మావాళ్లు ఒప్పుకోరు. మైలయింట్లో వంటలేమిటి అదీ దెప్పిపోస్తారు బాబు! బంధువులంతా! మీకేం తెల్సు మా కష్టాలు!

అ : మరేనండి! కష్టాలమీద కష్టాలు! ఎన్నో కష్టాలు! అన్నీ ఒక్కసారిగానే వస్తాయి!

సీ : మీరు వెళ్లిపోవలసి వస్తున్నందుకు నాకు ఎంతో విచారంగా ఉందంటే నమ్మండి! యిన్నాళ్లూ, తలలో నాలికలా ఎంతో కలిసిమెలిసి స్నేహంగా ఉంటున్నారు.

అ : దాసుగారూ! మీరు పోనీ యీ పన్నెండురోజులు గ్రామంలో మరొక భక్తులింట బసచేయండి! నేను సీతమ్మ మామ్మగార్ని వాళ్ల బంధువులింట్లో దిగబెట్టి వస్తా.

సీ : ఎందుకు నాయనా! నీకంత శ్రమ! ఒకళ్లని కష్టపెట్టడం నా కిష్టంలేదు. పైగా, నేను అక్కడికి వెళ్లానంటే, అదే పనిగా ఉండమని తెగ బలవంతం చేస్తారు తిరిగి ఎప్పుడు వస్తానో నాకే తెలియదు.

ని : ఉంటే సీతాయమ్మగారింట్లో ఉండాలి! తింటే అక్కడే తినాలి. యింకొకరి యింటికి రమ్మంటేమాత్రం వెడతా

డనుకున్నావుటోయి యీ నిరంజనదాసు!

అ: సీతమ్మ మామ్మగార్ని యీ కష్ట కాలంలో ఒక్కర్ని విడిచిపెట్టవలసి వస్తున్నందుకు నాకు చాలా బాధగావుంది!

ని: నాకు మరీ బాధగావుంది! ఏం చేస్తాం! ధైర్యం పురుషలక్షణం అని చెప్పాడు గీతలో.

అ: మరయితే! ఏంచేద్దాం! నాకు యింకా పనికాలేదు యీవూళ్లో యింకా! ఊఁ.

ని: ఆ రామావధాన్లుగారైనా లేరు! సలహా అడగటానికి! పోనీ యీప్రక్కనే ఉన్న భాగోతులపల్లి వెళ్లి కొన్నాళ్లు హరికథా కాలక్షేపంచేసి, సీతమ్మగారు వచ్చాక మళ్ళీ రావచ్చు యిక్కడికు.

అ: పదండి. నేనుకూడా అక్కడ ఆహారసేకరణ విషయం ఎల్లా వున్నదీ తనిఖీ చేసి వస్తాను.

ని: సీతాయమ్మగారూ! మరి సెలవా వస్తాను.

అ: సీతమ్మ మామ్మగారు! సెలవు! వెంకటశాస్త్రివస్తే నేను వచ్చేనని చెప్పండి.

సీ: మంచిది నాయనా! పాపం! మీకు వచ్చిన యీ కష్టంవల్ల మీకు ఎన్ని చిక్కులు కలుగుతున్నాయి!... అప్పుడప్పుడు తప్పకుండా వస్తూ ఉండండి!

అ: ని: అల్లాగే లెండి!

(నిష్క్రమణ).

సీ: అమ్మయ్య! పోయారా! శని విరగడైంది. యిదేమన్నా ధర్మసత్ర మనుకున్నారా పడి మింగడానికి!

(తలుపుకొట్టిన చప్పుడు).

రా: సీతా! సీతా!

సీ: ఆ. ఆ. వస్తున్నాను. (తలుపుతీసిన చప్పుడు).

రా: వాళ్లు యింకా రాలేదా భోజనానికి!

సీ: రావడం అయింది! సాగనంపడం అయింది.

రా: అన్నంతపని చేశావు! నీ తెల్వితేటలు మండిపోనూ! యిదేంపనే! ఎల్లా పంపించేవు!

సీ: మామగారి పినతండ్రి కొడుకు పోయాడు! మాకు మైల. పైగా మేము వూరు వెళ్లాలి. మీ దారి మీరు చూసుకోండని చెప్పాను. ఆపళంగా వెళ్లిపోయారు.

రా: యిదేం అఘాయిత్యమే! చావు కబురు కల్పించి బంధువులని సాగనంపుతావటే! ఎంత తప్పు! ఎంత తప్పు!

సీ: తప్పేమిటండీ! మామగారికి పినతండ్రీ లేడు! పినతండ్రికి కొడుకూ లేడు. లేనివాళ్లు చచ్చేరంటే మరేమీ తప్పులేదు. లెండి! లెండి! భోజనానికి లెండి! నాకు నీతులు చెప్పొచ్చారు.

3 వ రంగం

(వీధిలో)

నిరంజనదాసు: అనంతబుద్ధీ! యింత పని జరుగుతుందనుకోలేదోయి! రెండు నెలలనుంచి నిరాఘాటంగా జరిగిపోతూంది యీ గ్రామంలో భుక్తి! యీ నాటికి సీతమ్మగారు నాకు స్వస్తి చెప్పింది.

అనంతబుద్ధి: ఆవిడ చాలా దేవాంతకురాలులా కనిపిస్తోందండీ! నేను మొదట్లో ఏమిటో అనుకున్నానుగాని.

ని: సమయానికి రామావధాన్లుగారు లేకపోయారు. ఉంటే యింకా కొంత కాలం గడిచేది. 'మాదొడ్డ' మనిషి రామావధాన్లు మాత్రం

అ: ఆయనకు తగిన భార్య దొరకలేదండి! అదే నా విచారం. అయిపోయిందానికేంగాని, భాగోతులపల్లి వెళదామంటారా!

ని: సీతమ్మగారిముందు అల్లాగనకపోతే బాగుండదని అన్నానుగాని, వెడితే మనకి దిక్కవరోయి అక్కడ.

అ: అలాగాండీ! మీ తెరిగిన బంధువులెవరైనా ఉన్నారేమో అనుకుంటున్నాను.

ని: సరేకాని! అనంతబుద్ధి! మన భండారుపురం వెళ్లి అక్కడ కొన్నాళ్లు హరికథా కాలక్షేపం చేస్తే కృష్ణపరమాత్మ సంతోషిస్తాడు. వెడదాముటోయి!

అ: మీరు వెడితే వెళ్లండిగాని, నాకు యిప్పుడు రావడానికి తీరికలేదు.

ని: పోనీ మీ యిల్లెక్కడ! మీరు వచ్చేలోగా మీ యింట్లోవుండి మీ రాకకు ఎదురు చూస్తుంటాను.

అ: నాకు యిల్లంటూ వుంటేకదండీ! భండారుపురంలాంటి మహాపట్నంలో యిల్లెక్కడ దొరుకుతుందండీ! నాకు బంధువులంటే మహా చెడ్డ అభిమానం. కొన్నాళ్లు ఉంచుకుని ఆదరిద్దామన్నా, ఒక అద్దెకొంపైనా లేదు. అందుచేత బంధువు లెవరూ మా యింటికి రారు.

ని: పోనీ నా సంగతికేంగాని! మీ భార్యా బిడ్డలు ఎక్కడ వుంటున్నారోయి!

అ: మా మామగారింట్లో దిగబెట్టాను భండారుపురంలో! నే నెప్పుడైనా అక్కడకు వెడితే మా మామగారింట్లోనే బస.

ని: అల్లాగా! పోనీ! మీ మామగారికి ఒక ఉత్తరం ముక్క రాసియ్యవోయి! వారి సహాయంతో నేను జయప్రదంగా కొన్నాళ్లు హరికథాకాలక్షేపం చేసుకుంటా నక్కడ.

అ: మా మామగారు ఆయన మామగారిపై ఆధారపడి ఉన్నారు. మా మామగారికి ప్రత్యేక ఉద్యోగంలేదు. నాలాగే ఆహార సేకరణ తప్ప. మా మామగారి మామగారే యీ వంశాన్నంతా భరిస్తున్నారు.

ని: అయితే నీకు ఉద్యోగం లేదూ! ఏదో ఆహార సేకరణ డిపార్టుమెంటులో పని అన్నావు గదయ్యా!

అ: రామావధాన్లుగారితో అల్లా అనక

పోతే బాగుండదని అన్నాను. ఉద్యోగం ఉంటే యిన్ని వూళ్లు తిరగడ మెందుకండి! ఉద్యోగ సంపాదనకోసమే యీ ప్రయత్నమంతా! యీ ప్రయత్నంలో నేను ప్రతీ రోజూ ఆహారసేకరణ సమస్య పరిష్కరిస్తూ ఉండాలి.

ని: మహా ఘుట్టివాడవోయి! నేను యింకా నీతో భండారుపురం వచ్చి, నీతో కొన్నాళ్లు అక్కడ వుందా మనుకుంటున్నాను.

అ: నాకు నిజంగా మిమ్మల్ని చూసినప్పటినుంచి ఎంతో బంధుఅభిమానమంటే నమ్మండీ, కాని పరిస్థితులు యిల్లా మండిపోతున్నాయి. మా తాతగారి పేరగరూ! సూరయ్యగారు. ఆయన నిరతాన్న ప్రదాతలుగా! నిత్యం వారి యింట్లో అధమం ఒక పాతిక విస్తళ్లు అతిధులకు వేయవలసిందే!

ని: అల్లాగటోయి! మీ తాతగారు చాలా గొప్పవారన్నమాట!

అ: మరేనండీ! అయితే దాసుగారూ! యింతకీ తమ స్వస్థలం ఏ ఊరు?

ని: నాకు ఒక ఊరంటూ లేదోయి! చిన్నప్పటినుంచి నాకు యీ హరికథాకాలక్షేపం ఏదో ఆ పరమాత్మణ్ణి ధ్యానించుకోవడంతో జీవితం గడిచిపోతూంది. కాని నేను పుట్టినవూరు, లేనిపాడు.

అ: మీ భార్యా పిల్లలు లేనిపాడులో ఉన్నాగన్నమాట!

ని: నాకు భార్యా లేదు! పిల్లలూ లేరు! నేను ఒంటిగాణ్ణి!

అ: అయ్యయ్యో! పాపం! మరి పెళ్లి చేసుకోలేదాండి!

ని: పెళ్లికోసమేనోయి యీ ప్రయత్నమంతా! ఏదో హరికథలు చెప్పి నాలుగు రాళ్లు వెనక వేసుకుంటున్నా.

అ: అలాగటండీ! నేను యింకా ఒకసారి మీవూరువచ్చి మీ భార్యా పిల్లల్ని చూచి, కొన్నాళ్లు అక్కడవుండి, ఆహారసేకరణ విషయము తనిఖీ చేద్దామనుకుంటున్నాను.

అని: అంతేలెండి! గీతలో చెప్పాడు అంతా యోగం అని. యోగం ఉంటే! గాని ఏ పని చేయలేం.

అ: బాగోతులపల్లి వెళ్లడం మా నేసినట్లేనాండి.

ని: వెడితే అక్కడ మనల్ని ఎరిగినవారెవరు? ఎవరైనా కాస్త ఎరిగినవాళ్లుంటే కొంత కాలక్షేపం.

అ: మరేనండీ! మరి నాకు సెలవిప్పిస్తారా! నా దారి నే చూసుకుంటా! నమస్కారం.

ని: వెళ్లిరా నాయనా! నిరంజనార్పణమస్తు!!

(ఆలిండి గా రేడియో, హైద్రాబాదు, సౌజన్యంతో)

★

మేష్టరు: "సుశీలా! 1605 లో ఏం జరిగింది?"

సుశీల: "అక్బరు చచ్చిపోయాడండి."

మేష్టరు: "1705 లో ఏం జరిగింది?"

సుశీల: "అక్బరు చచ్చిపోయి వందేళ్లయిందండి."

* * * *

డాక్టరు: "మీభర్తగారికి మరేమీ ఫర్వాలేదు. బాగా విశ్రాంతి, నిద్ర ఉండాలి. ఇవిగో నిద్రపట్టేందుకు మాత్రలు."

రోగిభార్య: "ఈమాత్ర లెప్పుడిమ్మంటారు ఆయనకి?"

డాక్టరు: "అవి ఆయనక్కాదు, మీకు."

ముఖపరిచయము

శ్రీ కవికొండల వెంకటరావు

"సింధియాలు" అనేవాండ్లు కొందఱు "ఇండియా" విభజనమూలంగా 'కరాచీ' ఆ ప్రాంతంనుండి తఱిమి వేయబడి వచ్చి వేసి కాందిశీకులై "భారత్" రాష్ట్రాలలో ముఖ్య పట్టణాలన్నింటనూ సర్దబడ్డ సంగతి లోక విదితం. ఇది పద్నాలుగు భువనాల చరిత్రలోను నభూతో నభవిష్యతి! వారికి పట్టిన అవస్థే ఆంధ్రులకు గాని, అరవలకుగాని, మధ్యప్రదేశస్థులకు గాని, వింధ్యప్రదేశస్థులకు గాని, హిమాచల, ఘూర్జర, కురుక్షేత్ర ప్రజకు గాని తటస్థించి వున్నట్టయినా వారు వారు ఎంత అటమటించివుండేవారో — ఆస్తులు పోయి, ఆండ్రుపోయి, ప్రాలుమాలి, జీవచ్ఛవ వైఖరులయి, ఆసేతు హిమాచల పర్యంతం కోతుల్లా కొంక నక్కల్లా, కాపడియుండేవారేమో? లేదు - రూపఱియుండేవారు.

అయినా కాలవాహిని వేయు వొంద్రు గుంద్రాతిని చుట్టి దానిమీద ఆకుపచ్చన బొడమింపక పోదు అనే ఆశకొద్దీ ఈ "సింధియా" తెగవారు పర్యటన గావిస్తూ, ఎక్కడి కక్కడే వలసప్రజలైనారు. ఆ స్థైర్యము, ఆ గుండె నిబ్బరం, అందఱూ నేర్వవలసిందేనని నా తాత్పర్యము. ఆడా మగా అందఱూ వారు సుస్వరద్రూపులు. అయితే మన భాష వేఱు వారి భాష వేఱు. ఆచారాదులు కూడా విభిన్నం. మఱీన్నీ వారు గేళం విడిచి దేశంకాని దేశం వచ్చినా వదలిపెట్టనిది ఆచారమొక్కటే. ఆ ఆచారాన్ని అనుసరించి స్త్రీలు ఘోషా వీధుల్లో అవలంబించేరు. మఱిన్నీ సత్రముల్లో బస లలవడినప్పుడు ఆ ఘోషా ముసుగు నేకండువాగా ఎదుఱొమ్ములమీద, చెంగులు వీపున పడేలా విసరి వేసికొని విచ్చలవిడి వేడుకనుండేరు.

ఏ మనిషి అయినా అస్తమానం ఘోషాగానే వుంటే ఉక్కిరిబిక్కిరి అయిపోదూ? అప్పటప్పటి ఝషకిశోరాలు నీటిపైకి వచ్చి, గాలి పీల్చుకున్నట్లు దరిశనమిస్తూ, కోసేరుముక్కులు, చేరడేసి కళ్లు, తళుక్కుమను చెక్కుటద్దాలు మున్నైనవాటియొక్క సోయగము వారికీ వుందని చాటేరు. అయితే వారి భాష ముఖ్యంగా తెనుగునాట తెలియదు. వారు మాట్లాడుకుంటూంటే కోతుల కిచ కిచ అని అనుకోవలసిందే!

అంచేత ఏదైనా కూలిపని నాలిపని చెప్పి వారిచేత చేయిద్దామంటే వల్లగానిపని. కోతులకు నేర్పి చేయించగలుగుతున్నామా మనగోడలు కట్టడం, ఋళ్ళాయిలు కట్టడమూను? ఆలాగే వారూ మనదేశం వచ్చి ఎక్కడి కక్కడే చతికిలబడి, చెట్లకేసి, పిట్లకేసి, విశేషం అక్కజంగా చూడ్డం అలవరుచుకోగలిగారేగాని, మనతోపాటు మనిషి మనిషి కలిసిపోయి అరమర లేకుండా వుండిపోయినట్టు వుండిపో లేకుండా ఉన్నారు వారందఱికీ ఒక అండ ఒక కుండ కల్పించలేకుండా వున్నాం మనం!

పైని వివరించిన అపూర్వ పూర్వచరిత్ర అంతా కలిగివున్న ఒకానొక మత్తకాశిని "సింధీ" కన్యక రెండు పాయల జడ ముందుకు వేసుకుకండువా చెంగులు వెనక్కు పక్షిచ్చుక చొక్కాను గుబ్బల యుబ్బెత్తులచే నబ్బురం గొల్పుతూ ఈ లోకమంతా ఒక మహాసత్రంగా తలపోసి తిరుగాడుతూ వుంది. ఎప్పుడైనా చూచారా మీరామెను? పర్వతాలట్టుకు వనములట్టుకు కూడా పర్యటనం గావింపగల్గింది. ఆ పర్యటనమప్పుడు ఆమెకు కలిగిన ఒకానొక విపర్యయమే ఈ కథాంతర్భాగము.

నరులే కాకుండా వానరములు కూడా పాకిస్థాన్ నుండి తరిమి వేయబడినవని ఆమెకు తెలియదు. అసలు నరులన్నవారుకూడా ఎవ్వరు ఎవరినుండి విడిపోయినారో కూడా ఎఱుగదు అన్నా సత్యదూరం కాదు. తల్లి పిల్లనుండి, తాత మనమడినుండి, భార్య భర్తనుండి, ఈలా చెదరగొట్టబడ్డట్టయి పోయినారు, సింధీజాతి వారొకానొకప్పుడు. ఇప్పుడు వారినే కాందిశీకులని పిలుస్తూ వున్నారు ఇతర ప్రదేశాలవారు. మఱి కోతుల్నిగురించి విచారించేందుకు తావెక్కడ?

అయితే కోతులన్నవి పట్నవాసాల్నే అంటిపెట్టుకుండక, పల్లెటి పట్టులు అడవులు ఉద్యానవనాలు కూడా తిరుగుతూ వుంటాయి. కోతులనుండి మనుష్యులు సృష్టిపరిణామమందు పైకి తేలారు అనేది నిజమైనా కోతులు వనవాసమే అభిలషిస్తాయి స్వతస్సిద్ధంగా! కాని మనిషికిమల్లే సంఘప్రియులు సంసారప్రియులుకూడాను. ఈ సజాతీయ విజాతీయ పరామర్శలో నొక్కొక్కప్పుడు మనిషి మనిషిని ప్రేమించేకన్న కోతినే ఎక్కువగా ప్రేమించడం కద్దు. కోతిని పట్టుకుని మనుష్య లాటలాడిస్తూ వాటిని తమ మూపులమీద తలలమీదకూడా ఎక్కించుకుంటూవుండడం మన మందఱం ఎఱుగుదుము. మఱిన్నీ ఏనాడు మానవులు అనగా ఆడమానవులు, మగమానవులు కూడా ఎవరికివారే కోతులనుండి పై మెట్టు చూఱగొన్నారు అనేసిద్ధాంతం ప్రబలిపోయిందో ఆనాటినుంచి ఆడది మగవాని అర్ధ శరీరంగా గాని, అస్థి సముద్భవంగా గాని అంగీకరించడం మానేసి, తనయొక్క 'స్వతంత్రప్రజ్ఞను, ప్రాధాన్యాన్ని చాటసాగింది. ఆమె కూడా మగవాళ్లను అనుసరించడం మానేసి కోతుల్నే తన పూర్వీకులుగా కోరుకోసాగింది. ఇది ప్రపంచ మంతటా సర్వసామాన్య ప్రతీతి అయినా భారతవర్షమందు, ముఖ్యంగా హిందూమతమందు, పవిత్రభావాన్ని కూడా ప్రసాదించింది.

అందువల్ల పాకిస్తాన్ వారు హిందూమతస్థులైన సింధీమనుష్యులనే కాకుండా, వారి దేవాంశసంభూతులైన కోతుల్నీ కొండముచ్చుల్నీ కూడా "భారత్" ప్రదేశాలకు తఱిమి వేశారు! కాని కోతులన్నవి, కొండముచ్చులన్నవి, పైని వివరించిన రీతిని వనాంతరాలు, పర్వతోన్నతాలు, పట్టుకుని పోయినాయి. మనుష్యులన్నవారు పట్నాల్లో అడుక్కుంటూ, అంగళ్లు ఆశ్రయాలు ఏర్పాటులు గావించుకుంటూ, అనుకూల వాతావరణం ఏనాటికైనా తమకు తిరుగ అలవడక పోతుందా అని ఆశాపూరిత నయనాలతో వున్నారు.

'సింధీ' కాందిశీకులన్నవారు ఎంతగా పట్నవాసాలట్టుకు వాటినే తమ యునికి పట్టులుగా తలపోసి గుంపు గుంపులుగా వున్నారో ఇరుకుసందులంట, మురికి గొందులంట,—సింధీ కాందిశీక గోలాంగూలాలు "జంగిల్" అనగా "అడవి" మను

ష్యల్లా చెట్లట్టుకు కొండలట్టుకు అంతగా చెల్లాచెదరయిపోయినాయి. వాటిని ఆన వాలు పట్టి పట్టుకోవడమంటే ఎవరి తరమూ కాదు, ఎంతో పెంచి పెద్దచేసిన వాండ్లకు తప్ప. — ఆ పెంచిన వాండ్లిప్పుడున్నారో లేరో? ఉంటే ఎక్కడున్నారో? కాని కాందిశీక గోలాంగూలాలు కాందిశీక నరమానవుల కంటె ఎక్కువ సూటిగా, ఎక్కువ శీఘ్రంగా తమలాంటి వారే దేశం వారైనా వానితో సమైకంగా వుండిపోగలవు. అలా ఉన్నాయి కూడాను. అందులో ఒక కోతిపేరు "రాంసేవక్!"

"రాంసేవక్" అన్న ఈకోతి మననాటు కోతులతో అవలీలగా కలిసిపోయి 'జంగిల్' ఉద్యానవనాలనుంచి, తోటమాలీలు వేసి పెంచిన ఉద్యాన వనాలదాకా సంచారం చేస్తూ సాధారణపుదానిలాగుండి అసాధారణపు పను లొక్కొక్కప్పుడు చేస్తూ, పిలుకుతూ కిచకిచలాడుతూ వుండేది.

ఒకనాటి సమయమప్పుడు పైని వివరించిన సింధీ కన్య విహరింపవెళ్లిన ప్రకృతి సీమనే, "రామ్‌సేవక్" వున్న కోతి జట్టునున్ను వుండడం తటస్థించింది. ఆ ప్రకృతి సీమ నొకింత వర్ణించడం అసలు గాథకు ఆలస్యంగాదు అని అనుకుంటాను.

ఒకచోట అయిదు కొండలు పొడుగ్గా చైనాగోడలా వుండి వాటికి చేరి ఒక చెరువు ఏర్పడింది. ఈ చెరువు పొర్లును పొడిగించుకుంటూ ఒక చిన్న కాలువ పడమరగా అస్తమాద్రికా అన్నట్టు పోతుంది. ఆ కాలువ నీట ఓ చోట ప్రతిఫలిస్తూ, మూడు కొండలు పొడుగుపాటివి లోవ లేర్పడి కాపడతాయి. మళ్లీ అలా చుట్టివస్తే చెరువు కొసచాయను ఒక దూరపు కొండల సునుపుపోయగం, ఒక దగ్గఱ కొండ కొన గరుగురాళ్ళు అన్నీ అదోచిత్రంగా రూపిస్తాయి. చెర్వు గట్టునంటి ఒక చిన్న తోట, ఇంకా కొండల మధ్య కోనల వరి సాగు. చెరువు పెంపు — సరాసరి మనుష్యులు తిరిగే జానపదప్రాంతమా అని అనిపిస్తుంది.

పగలెంత సందడిగా వుండెనో ఆనాడు అసురసంధ్య పడ్డంలో లోకమంతా అంత మాటు మణిగింది. పొలంమీద ఒక మనిషి గాని ఒక పిట్టగాని లేదు.

నేనన్నానే — ఆ కోతుల గుంపు నిర్భయంగా చెట్లుదిగి సంజచీకట్లో ఒక మడిలో అక్కడక్కడ తమ తోకలమీద వెనుకాళ్లమీద కూర్చొని విశ్రాంతి తీసుకుంటూవున్నాయి. దూరపు చూపుకు అవి కదలని మెదలని చిటి పొదల్లా చుట్టు గుడిసెల్లా కాబడుతున్నాయి. నేనన్నానే — ఆ సింధీకన్య తన ముందేమున్నదీ కానక చూట్టూవున్న అపురూప ప్రకృతిని చూస్తూ గభాల్న మడిలోని ఒక కోతిమీద అడుగేసింది. ఆ కోతి "రాంసేవక్" అయి కిచకిచామని పైకి ఎగిరింది. — తక్కిన కోతులు వెంటవెంటనే - చీకటిగాదూ - దృష్టి ఆనకో తెరవుగానకో నెమ్మది నెమ్మదిగా పాకుతూ, కొన్ని పరుగెడుతూ, తోటలోని చెట్లు ఎక్కిపోయినాయి.


"రాంసేవక్" గావించిన ఎగురుకు కిచకిచకు ఉలిక్కి పడ్డట్టయి "సింధీ" కన్నె తన మేలిముసుగు కండువాలా వేసుకు చెంగులు వెన్ను తెంపుకుపడేలా చేసుకుంది. చుట్టూ అంతా ప్రకృతి! అంతా నిశ్శబ్దం! అంతా కనుచీకటి! "రాంసేవక్" ఒక్క ఉడామున సింధీకన్య బుజమెక్కి ఆమె రెండు పాయిల జడకంటె తనతోక పొడుగన్నట్టు వేలాడేసి కన్యకామణి వీపు తట్టింది. "అరే దుష్మన్" అంటూ కన్యారత్నం కపిరత్నాన్ని క్రిందకు విదలించేసింది. విదలించడంలో కోతి స్వేచ్ఛాలింగనం కన్యను గావించి ఆమెయొక్క ఎగుబోమ్ములు చెట్టు కాయలను తిన్నినట్టు తన్నుతూ తాను వెనక్కుపడింది. పడింది పడి వుండవచ్చా? ఉహుఁ! వుండక తిరుగ ఆమెకేసి, పిచ్చిపట్టినదానిలా పెరిగిపోయి మీదకు విరగబడసాగింది. సింధీ కన్య "బాపూ! హేయ్" అని దాన్ని త్రోసిపుచ్చింది. కోతి కన్యకామణి బుగ్గలు రక్కి ఒక్కొమ్మడి కండువా చెంగులు పట్టుకు పండ్లతో నొక్కి పట్టసాగింది. అది తెలిసి మఱి ప్రయోజనం లేదనుకొని కన్యక తన ఆచార చిహ్నమైన చిట్టి ఉత్తరీయాన్ని అమాంతంగా సల్లించింది. కోతి ఆ సల్లింపుతో కండువా సమేతంగా వెనక్కుపడింది. పడి ఆ కండువాను తాను మేలిముసుగ్గా వేసుకుంది.

వెంటనే సింధీకన్య సిగ్గువిడిచి తను వొగ్గినట్టు వొగ్గి "ఓసి ముండా! నారాంసేవక్! ట్రవే!" అని అన్నట్టు సింధీభాషను అని గట్టిగా ఆకోతిని కౌగిలించుకొని, "ఇన్నాళ్లు ఎక్కడికి పోయేవు? ఎక్కడున్నావు?" అని అడిగింది తన భాషను. ఆ భాష మనుష్యులదైనా మన ఆంధ్రుల కర్థంకాదు కాని ఆ కోతి కర్థమై — ఆ కొండవెంప కోలనివెంపు, కొమ్మ లెక్కిపోయిన తోడి నాటుకోతులవెంపు గెంతింది. "అక్కడున్నావులే? ఇక్కడున్నావులే?" అని ఆ కోతిని బుజ్జగిస్తూ సింధీకన్య "రాంసేక్"ను ప్రేముడి నెత్తుకుంది. కోతి ఇంకా మేలిముసుగు తన చుట్టూ వేసుకుంటూ కన్యకామణికి కూడా దాన్నే బురకాగా కైసేత గొలిపింది.

బురకాలో కోతి సర్దుకుని కన్యకామణి బుజమ్మీద బుజకీర్తిలా కూర్చుంది. కన్యకామణి ఆబురకా కండువాను అలా వొత్తిగించుకుంటూ కోతిని కొంచెం వంగి వినుమన్నట్టు దిగలాగి - "మన ఆవులు ఏమైనాయి? నీవు ఊరికే కూడా కూడా చెలగాటలాడేదానివి చిలక చిలక అది నీకెక్కడైనా తిరుగ కనిపించిందా? మేకల్ని కొన్నింటిని పెంచేవాడు మా తండ్రి! వాటిని తిరుగ నీవు చూచినావా? నేను బయలుదేఱి వచ్చేటప్పటికి గోధుమచేను మొలకెత్తుతూ వుంది. ఈ పాటికి పంట పండి వెన్నుమీద నిగనిగలాడేని అనుకుంటాను 'మన సింధీ దేశాన్ని' గురించి అన్ని సంగతులు చెప్పవు నాకు? - అయ్యో! ఏడుస్తున్నావా? నాతో చెప్పడానికి - ఏడుస్తున్నావా?" అని అడిగి, తన మాటలు వింటూ జవాబు చెప్పలేక కళ్లమ్మట నీరు కారుస్తున్న కోతిని ఊరడిస్తూ, తానుకూడా తన దుఃఖభారహృదయాన్ని నిట్టూర్పుల నెత్తుకు దించుకుంటూ - కన్నీరు బొటబొట గార్చ దొడగింది. ఆ వెఱ్ఱిపిల్లతోపాటు — ఆకాశము రంయ్‌ని మేఘావృతమై కొండల్ని కదలించినంత వాయువు వీచి వర్షపాతము గలిగించింది.

తతిమ్మా కోతులేమైపోయినాయో గాని "రామసేవక్" మాత్రం సింధీకన్యక గొంతుకను, గట్టిగా గోలు పెట్టి కట్టుకొన్నట్టు తాను అంటి పెట్టుకుంటూ తోక చుట్టేసుకొన్నదై మేలిముసుగును చిరిగిన తెరచాపలా ఎగర వేసింది.

వారిరువురు ఏ తీరమైనా చేరుకున్నారో అసలు లేనేలేరో నాటికీ నేటికీ తెలియదు. ★



డుబు డక్కువాడు

శ్రీ సామవేదం జానకిరామశర్మ

అంబపలుకు జగదంబా పలుకు
కంబుకంఠి! ఓకాళీ పలుకు
కంచిలోని కామాక్షీ పలుకు
కాశిలోని అన్నపూర్ణాపలుకు
డుబుడక్, డుబుడక్, డుబుడక్
అయ్య మనసులో ఆలోచనలు
అమ్మతలపులో అనుమానాలు
అదిగదిగదిగో ఒక్కసారిగా
అంబకరుణ, సాంబయ్య ప్రేమతో
అన్నీ చెపుతా ఆలించండీ!
డుబుడక్, డుబుడక్, డుబుడక్

రేపుమాపులో ప్రయాణముందీ
రేవులుదాటే ఓడప్రయాణం
గొప్పచదువులూ గొప్పనౌకరీ
తప్పదు బాబూ! దయదల్చాలి
చెమటకుమాసిన చినిగిన చొక్కా!
కప్పుకున్న పైకందువ బాబూ
తప్పదు నాకూ దయదల్చాలి
అంబపలుకు జగదంబాపలుకు
కంబుకంఠి! ఓకాళీ పలుకు
కంచిలోని కామాక్షీ పలుకు
కాశిలోని అన్నపూర్ణాపలుకు
డుబుడక్, డుబుడడక్, డుబుడక్



జరిగినకథ:

మా నాన్న ఒకహోటల్ యజమాని. ఒక రోజున మాహోటల్‌కు ఒక వృద్ధనావికుడు వచ్చాడు. అతడు పట్టి తాగుబోతు. అతడు సముద్రపు దొంగలముఠావాడనీ, ముఠానుండి పారిపోయి మా యింట్లో తలదాచుకున్నాడనీ నేను గ్రహించాను. ఒకరోజున 'నల్లచుక్క' అని పిలవబడే ఒకదొంగ మా యింటికివచ్చి మొదటి దొంగతో పోట్లాడి పారిపోయాడు.

అనువాదం: శ్రీ నండూరి రామమోహనరావు.

(బొమ్మలు వాల్ట్ డిస్నీ ప్రొడక్షన్సు, ఆర్. కె. ఓ. రేడియోవారి సౌజన్యంతో)

3. నల్లచుక్క

రోజు మధ్యాహ్నం నేను కెప్టెన్ గదిలోకి చల్లని పానీయాలు, ఏవో మందులు తీసుకుని వెళ్లాను. అతడు మేమెల్లా పడుకోబెట్టామో అల్లాగే పడుకుని ఉన్నాడు. బాగా బలహీనంగా, ఏదో ఆందోళనగా ఉన్నట్లు తోచింది.

నన్ను చూడగానే "జిమ్! ఇక్కడున్న వాళ్లలో నువ్వొక్కడివే మంచివాడివిలా కనిపిస్తున్నావు. నేనుకూడా నిన్నెంతో ప్రేమగా చూడటంలేదూ? ప్రతినెలా నీకు నాలుగు పెన్నీలు ఇవ్వటంలేదూ? అందుకని మరి నువ్వు నాకు చిన్న సహాయం చేసిపెట్టాలి. ఒక్కగ్లాసు రమ్ము తెచ్చిపెట్టు. నీకు పుణ్యం వుంటుంది. ఏం, తీసుకురావూ?" అని బతిమాలాడు.

"కాని డాక్టరుగారు—" అని నేను ప్రారంభించాను. మాటమధ్యలో అడ్డంవచ్చాడు కెప్టెన్. డాక్టరును హృదయపూర్వకంగా తిట్టసాగాడు.

"డాక్టర్లందరూ వెధవాయలనుకో. ఆ డాక్టర్ గాడున్నాడే, వాడికేం తెలుసు కళాసుల్ని గూర్చి? నేనెన్ని దేశాలు తిరిగాను, ఎన్ని సముద్రాలు చూశాను! కొన్నిదేశాల్లో ఎండ సూర్యుడు ఫర్లాంగు దూరంలో ఉన్నంతవేడిగా ఉంటుంది. కొన్నిదేశాల్లో చలివుంటుంది చూస్కోనాయనా, నెత్తురు గడ్డగట్టుకుపోతుంది. కొన్ని సముద్రాల్లో కెరటాలు మైలుఎత్తున లేచి విరిగి పడుతుంటాయి. ఆ డాక్టరుగాడు ఇల్లాంటి వెప్పుడన్నా కని విని ఎరుగునా? నేను ఇన్నేళ్లు దేనిమీద బతికాననుకుంటున్నావ్? రమ్! రమ్! రమ్ లేకపోతే నేనెప్పుడో చచ్చేవాణ్ణి. నాకు తిండీ, నిద్ర, పెళ్లాం, బిడ్డలు, అన్నీ రమ్మే. ఆ డాక్టరు కేం తెలుసు నా కష్టం? బాబూ, జిమ్! ఒక్కగ్లాసంటే ఒక్కగ్లాసు. మళ్లీ అడిగితే చెప్పుచ్చుక్కొట్టు. చూడు, నావేళ్లు ఎల్లా వణుకుతున్నాయో? ఒక్కచుక్కపడితే ప్రాణం హాయిగా వుంటుంది. డాక్టరుమాట నమ్మకు. వాడల్లాగే చెబుతాడు, వాడికేం? రమ్ లేకపోతే పిచ్చెక్కినట్లుంటుంది. అనలెందుకూ? ఇందాక నీ వెనకాల కెప్టెన్ ఫ్లింట్ దెయ్యం కనిపించింది. ఆదెయ్యం నన్ను పూనిందా, ఇహ చూస్కో, ఇల్లు ఇల్లంతా గల్లంతుచేసిపారేస్తాను. అడ్డమొచ్చిన వాణ్ణల్లా పీకనొక్కి చంపేస్తాను. అసలు మీ డాక్టరే చెప్పాడుగా, ఒక గ్లాసు తాగచ్చని. జిమ్, జిమ్! ఒక్కగ్లాసు తెచ్చావంటే షిల్లింగు ఇస్తాను."

ఇంత ప్రాధేయపడేసరికి నామనస్సు కరిగింది. అవ్వాళ మానాన్నకు ఎక్కువచేసింది. కెప్టెన్‌కు రమ్ ఇవ్వకపోతే ఏం గొడవ చేస్తాడోనని భయపడ్డాను. పైగా ఒకగ్లాసు ఇస్తే ఫర్వాలేదని డాక్టరు చెప్పాడుగా. అందుచేత రమ్ ఇవ్వడాని కంగీకరించాను.

"నీ డబ్బు గిబ్బు నాకక్కర్లేదు. మానాన్నకు నువ్వు న్యాయంగా ఇవ్వవలసింది ఇచ్చేస్తే చాలు," అనిచెప్పి లోపలికి వెళ్లాను.

రమ్ తీసుకురాగానే ఎగిరి పుచ్చుకొని ఒక్కగుక్కలో కానిచ్చాడు.

"ఆ, ఆ, ఇప్పటికి కాస్త ప్రాణం తేరుకుంటోంది. ఈ కుక్కిమంచంలో ఎన్నాళ్లుండాలని చెప్పాడు డాక్టరు? ఏం చేస్తం?"

"కనీసం వారంరోజులు."

"అమ్మో, వారంరోజులే! ఊహూ, ఒప్పుకోను. ఈలోగా వాళ్లు నాకు "నల్లచుక్క" ఇవ్వనే ఇస్తారు. ఆ దొంగముండాకొడుకులు నామీద పగబట్టారు. ఎప్పుడు చంపేద్దామా అని చూస్తున్నారు. వెధవలు, వాళ్లది వాళ్లు ఖర్చుచేసుకుని నాదికూడా దొంగిలించాలని చూస్తున్నారు. కళాసులు చెయ్యవలసిన పనేనా అది? అహ నాకు తెలియక అడుగుతాను. తప్పు కాదూ, ఇంకోడిసొమ్ము దొంగిలించడం? నేనంటావా? నాడబ్బు నేను ఒక్క పెన్నీకూడా వృథాగా ఖర్చు చెయ్యలేదు. నామాదిరిగా పొదుపుగా ఎందుకుండ కూడదు వాళ్లు? వాళ్లు సంపాదించిన వేలన్నీ ఏమైనాయి? ఏమైనాయీ అంట? ఊహు. నేను ఛస్తే ఇవ్వను. ఎక్కడికన్నా పారిపోవాలి. వాళ్లకళ్లలో కారంకొట్టి పోకపోతే నాపేరు—"

కెప్టెన్ మాటల్లో ఒక్కటీ నాకర్థం కాలేదు ఆదొంగ లెవరో, వాళ్లకీ ఇతనికీ విరోధమేమిటో తెలియలేదు. కెప్టెన్ లేచి కూర్చోడానికి ప్రయత్నించాడు. "ఆడాక్టరుగాడు నా నెత్తురంతా తాగేశాడు. నాచెవులు సంగీతం పాడుతున్నాయి. అమ్మో అబ్బా!" అంటూ లేవబోయి మళ్ళీ వెనక్కి వాలిపోయాడు. అలా కాసేపు పడివుండి చివరి కన్నాడు:

"జిమ్! ఆ కళాసీని చూశావు గదూ?"

"నల్లకుక్కనా?"

"ఆ, నల్లకుక్క. వాడు చాలా చెడ్డవాడు. కాని వాడికంటే చెడ్డవాళ్లున్నారు వెనకాల. మాట వరసకి చెబుతాను. నే నిక్కణ్ణించి పారిపోలేక పోతా



అంధుడు కెప్టెన్ చేతిలో ఏదో పెట్టాడు. కెప్టెన్ వెంటనే గుప్పిలిమూసుకున్నాడు.

దనుకో. వాళ్లు నాకు "నల్లచుక్క" పట్టుకొచ్చి ఇస్తారనుకో. నువ్వు గుర్రంమీద వెంటనే ఆ డాక్టరుగాడి దగ్గిరకి పోయి పోలీసులతోసహా వెంటబెట్టుకు రావాలి. అందరూ దొరుకుతారు. కెప్టెన్ ఫ్లింటుకింద పనిచేసిన ఖలాసులంతా, ఒక్కడుకూడా బీరుపోకుండా దొరుకుతారు. వాళ్లు నన్నెందుకు వెంటాడుతున్నారనుకున్నావ్? ఈమంచంకింద వుందే ఇనప్పెట్టె— దానికోసం. కెప్టెన్ ఫ్లింట్‌కింద తండేలుగా పనిచేసేవాణ్ణి ఆరోజుల్లో. ఫ్లింట్ సవానాపట్నంలో (అమెకాలో ఒక రేవుపట్టణం) చచ్చిపోయేముందు ఆపెట్టె నాకు అప్పగించి మరీ చచ్చిపోయాడు. నా ఒక్కడికే ఆద్వీపం తెలుసు. వాళ్లు ఆ పెట్టెకోసమే నా వెంటబడుతున్నారు. వాళ్లు నల్లచుక్క తీసుకొచ్చి యిస్తేనో, నల్లచుక్కగాని, ఒంటికాలు కుంటివాడుగాని కనిపిస్తేనో, మాత్రమే నువ్వు డాక్టరు దగ్గిరికి పోయి పోలీసుల్ని సహాయం తీసుకురావాలి. తెలిసిందా?"

"సరే కెప్టెన్. కాని నల్లచుక్క ఏమిటి?"

"అది మాగుర్తులే. వాళ్లు పట్టకొచ్చియిస్తే నీకు దాన్నిగూర్చి చెబుతాలే. కాని నువ్వు మాత్రం జాగ్రత్తగా కనిపెట్టిఉండాలి. నాకీ సహాయం చేసిపెడితే నీకు సగానికి సగం యిస్తాను; నామీద ఒట్టేసుకు చెబుతున్నా."

అతని కంఠం క్రమంగా బలహీనమైపోతోంది. నేను మందు తాగించాను. చిన్నపిల్లడు ఆముదం తాగినట్టు అతికష్టంమీద తాగాడు. వెంటనే మగతకమ్మినవాడిలాగ పడి నిద్రపోయాడు. నేనివతలకొచ్చేశాను.

నాకేం చెయ్యాలో తోచలేదు. కెప్టెన్ చెప్పినదంతా డాక్టర్‌గారికి చెప్పిఉండవలసింది. కాని ఆసాయంత్రమే మానాన్న హఠాత్తుగా ప్రాణం విడిచాడు. దాంతో మహావిషయం ఆలోచించడానికే నాకు వ్యవధిలేకపోయింది మమ్మల్ని ఓదార్చడానికి వచ్చేవాళ్లు, పోయేవాళ్లు, మానాన్నకు అంత్యక్రియలు ఏర్పాటుచేయడం, హోటలుపని చూసుకోవడం— వీటితో కెప్టెన్ సంగతే నాకు జ్ఞాపకంరాలేదు.

మర్నాడు ఉదయం కెప్టెన్ కిందికి దిగివచ్చాడు. మామూలుగానే భోజనం చేశాడు. కాని మామూలుకంటే ఎక్కువగా రమ్ము తాగినట్టు నా అనుమానం. ఎందుకంటే అంత బలహీనంగాఉన్నా బలే భయంకరశబ్దాలు చేశాడు. అతన్ని సమీపించడానికే మాకందరికీ భయంవేసింది. ఇల్లంతా దుఃఖంలో మునిగివుండగా కెప్టెన్ హాల్లో కూర్చుని "యో—హో—హో—అంటూ దౌర్జన్యంగా పాడుతూవుండటం మాకు కష్టం కలిగించింది. కాని ఏం చేస్తాం? నిషామీద ఎవర్నేం చేస్తాడో? గినిక్కోడు డాక్టరుగారు కూడా ఊళ్లోలేరు. ఏదో అర్జంటు కేసుమీద పొరుగూరు వెళ్లారు. అంచేత కెప్టెన్ మరీవిచ్చలవిడిగా ప్రవర్తించసాగాడు. కాలుగాలిన పిల్లిలాగ ఊరికే మేడమీదికీ, కిందకీ తిరిగేవాడు; అప్పుడప్పుడు గేటుదాకావెళ్లి రోడ్డును రెండువేపులా పరీక్షగా చూసేవాడు బాగా తాగివున్నప్పుడు కత్తితీసి పదును చూసుకునేవాడు. కాని ఎవ్వరిజోలికీ పోయేవాడు కాదు, తనలోతనే గొణుక్కుంటూ, ఆలోచించుకుంటూ కూర్చునేవాడు.

రెండురోజులిలా గడిచాయి. మానాన్నకు అంత్యక్రియలు వగైరాలన్నీ యథావిధిగా పూర్తయ్యాయి. ఆరోజు మధ్యాహ్నం దాదాపు మూడు గంటలప్పుడు నేను గేటుదగ్గిర నుంచుని, చనిపోయిన మానాన్ననుగూర్చి తలుచుకుని దుఃఖపడుతున్నాను. ఇంతలో దూరాన రోడ్డుమీద ఎవరో మెల్లిగా రావడం కనిపించింది. చేతికర్రతో దారి తడుముకుంటూ నడవటం, కళ్లపై వెలుగుపడకుండా గంతలు కట్టుకోవడం చూసి అతడు గుడ్డివాడని గ్రహించాను. నెత్తిమీదనుండి, బుజాలమీదుగా వెనక్కి పడేట్టు నల్లటిగుడ్డ కప్పుకున్నాడు. సన్నగా, బాగా బలహీనంగా ఉన్నట్టు కనిపించాడు. మరీ చంటిపిల్లలు చూస్తే జడుసుకునేట్టున్నాడు. హోటలును సమీపించగానే ఆగి, గొంతెత్తి అడిగాడు:—

"గుడ్డివాణ్ణి బాబూ! దేశంకోసం యుద్ధాల్లో పోట్లాడి కళ్లు పోగొట్టుకున్న కబోది న్నాయనా! ఇక్కడెవరన్నా ధర్మాత్ములుంటే, నేను నుంచున్నదెక్కడో చెప్పండి. బాబూ!"

"ఎడ్మిరల్ బెన్‌బౌముందు నుంచున్నావు అబ్బి" అన్నాను నేను.

"ఆ—చిట్టిబాబెవరో మాట్లాడుతున్నారు. చిట్టిబాబూ! నీకంఠం వినగానే నీ మంచితనం గ్రహించాను నాయనా! నీ కెంతైనా పుణ్యముంటుంది, నన్ను లోపలికి తీసుకెళ్లవూ?"

నేను చెయ్యి అందించాను. వెంటనే అంత మృదువుగా, దీనంగా మాట్లాడిన ఆ అంధుడు నాచేతిని భల్లూకంలా పట్టేశాడు. ఆపట్టుకు నావేళ్లు పటపటమని విరిగాయి. ఒక్కసారిగా భయపడ్డాను. వదిలించుకోవాలని గింజుకున్నాను. కాని అంధుడు ఒక్క ఊపుతో నన్ను తనదగ్గిరికి లాక్కున్నాడు. అంత బలహీనంగా కనిపించినా అతని చేతుల్లో ఎంత బలముందో నా కప్పుడు తెలిసింది.

"అబ్బాయ్! ఇప్పుడు పదలోపలికి. కెప్టెన్ దగ్గిరికి తీసుకుపోనన్ను," అన్నాడు అంధుడు.

"ఊహూ. అతనిదగ్గిరికి తీసుకుపోను," అన్నాను నేను.

"ఓ. అల్లాగా?" అని నాచెయ్యి మెలిపెట్టాడు. "బాబోయ్" అని అరిచాను. "తీసుకు వెడతావా? చెయ్యి విరిచెయ్యమన్నావా?" అని హుంకరించాడు గుడ్డివాడు.

"కెప్టెన్ దగ్గిరికి వెళ్లడం మంచిదికాదు. ఎప్పుడూ కత్తిపట్టుకుని కూర్చుంటున్నాడు. దగ్గిరికెవ్వళ్లనీ రానివ్వడంలేదు. నీ మంచి కోసమే నేను చెప్పేది—"

"నోరుమూసుకు పద లోపలికి," అని మళ్ళీ ఒక్క ఊపుఊపాడు. అంత క్రూరమైన, దౌర్జన్యపూరితమైన కంఠం నే నెప్పుడూ వినలేదు. అతడు చెయ్యి మెలిపెట్టి నప్పటికంటె ఎక్కువగా భయపడ్డాను ఆకంఠంవిని. వెంటనే లోనికి దారితీశాను. హాల్లో కూర్చున్నాడు కెప్టెన్; పక్కనే బల్లమీద రమ్ముసీసా ఉన్నది; నిషాతో కళ్లు తేలిపోతున్నాయి. అంధుడు ఉక్కులాంటి పిడికిలితో నన్ను పట్టుకొని, రహస్యంగా చెప్పాడు· "నన్ను సరాసరి కెప్టెన్ దగ్గిరికి తీసుకుపో. దగ్గిరి కెళ్లగానే 'నీ స్నేహితుడు వచ్చాడు బిల్', అను. అల్లా అనకపోతే ఏం చేస్తానో తెలుసా," అంటూ మళ్ళీ చెయ్యి మెలిపెట్టాడు. ఆ బాధకు మూర్ఛ వచ్చినంత పనైందినాకు. మారు మాటలేకుండా అంధుడు చెప్పినట్లే అంతా చేశాను. అతడు అనమన్నమాటలు అనేశాను.

పాపం కెప్టెన్ ఆమాటలు వినగానే తలెత్తి చూశాడు. అంధుణ్ణి గుర్తించగానే రమ్ము నిషాఅంతా దిగిపోయింది. అతన్నిచూస్తే భయపడటానికి కూడా ఓపిక లేనట్లు తోచిందినాకు. లేవబోయాడు, కాని శరీరం స్వాధీనంలో లేనట్లు కూర్చునే ఉండిపోయాడు.

"బిల్! ఎల్లా కూర్చున్నావో అల్లాగే కూర్చో కదలకు. నేను చూడలేకపోయినా, వినగలను. పది గజాలదూరంలో సూదికిందపడినా నాకు వినిపిస్తుంది. నీకు తెలుసుగా నాసంగతి. వ్యవహారం దగ్గిర నాకు మొహమాటంలేదు. నీ కుడిచెయ్యి జాపు. అబ్బాయ్, అతని కుడిచెయ్యి పట్టుకుని నా ఎడమచెయ్యి దగ్గిరికి తీసుకురా. ఊ, తొందరగా."

మేమిద్దరం అంధుని ఆజ్ఞను అక్షరాలా శిరసావహించాము. కెప్టెన్ ప్రాణంలేని మట్టిబొమ్మలా నిశ్చేతనుడై పోయాడు. అంధుడు కెప్టెన్ చేతిలో ఏదో పెట్టాడు. కెప్టెన్ వెంటనే గుప్పిలి మూసుకున్నాడు.

"పనైపోయింది. వెళ్లిపోతున్నాను," అంటూ హఠాత్తుగా నన్ను వదిలేశాడు. వెనక్కితిరిగి చకచక ఒక్క అడుగుకూడా తప్పు వెయ్యకుండా హాలుదాటి, వాకిలిదాటి, గేటు తెరుచుకుని రోడ్డుమీదకి వెళ్లిపోయాడు. అతడు ఎవరిసహాయం లేకుండా, ఒక్కసారి లోపలికి వచ్చినంతమాత్రాన దారంతా ఎలా గుర్తించుకుని తిరిగి వెళ్లిపోగలిగాడో నాకు అర్థంకాలేదు. అసలు నాకళ్లను నేనే నమ్మలేక పోయానంటే నమ్మండి.

అంధుడు రోడ్డుమీద దూరాన మలుపుతిరిగే వరకూ మాకు అతని కర్రచప్పుడు వినిపిస్తూనే వుంది. ఆ చప్పుడు దూరమై పోయాకగాని నాకు, కెప్టెన్‌కు తెలివిరాలేదు. వెంటనే కెప్టెన్ చెయ్యి వదిలేశాను. అతడు గుప్పిలి తెరిచి చూశాడు.

"రాత్రి పదిగంటలకి!! ఇంకా ఆరుగంటలుంది టైము. ఈలోగా పారిపోగలను. ఓ. పారిపోగలను. నేనా వీళ్లకి దొరికేది?" అంటూ కుర్చీలోంచి లేచాడు.

లేస్తూనే అటూ ఇటూ తూలాడు; రెండు చేతుల్తో తన మెడ పట్టుకుని ఒక్కక్షణం ఊగులాడుతూ

నుంచున్నాడు. భయోత్పాతాన్ని సూచించే శబ్దం చేస్తూ ధన్‌మని నిలువునా, బోర్లగిలాపడ్డాడు.

“అమ్మా, అమ్మా,” అని కేకేస్తూ, నేను కెప్టెన్ వద్దకు పరుగెత్తాను. కాని వళ్లు పట్టుకు చూచే సరికి ప్రాణం పోనేపోయింది. నేలమీద పడుతూనే ప్రాణం వదిలినట్లున్నాడు. అతనంటే నాకు ఇష్టంగాని, జాలిగాని ఎప్పుడూ లేదు; కాని అతడు చనిపోయినట్లు తెలియగానే అప్రయత్నంగా నాకు ఏడుపు వచ్చింది. మా నాన్న చనిపోయిన దుఃఖం ఇంకా నాలో చల్లారనేలేదు. నాకు బుద్ధి తెలిసిన తర్వాత నాకళ్లారా చూసిన చావుల్లో ఇది రెండోది.

4. కెప్టెన్ పెట్టె

మా అమ్మ నా కేకలువిని పరుగెత్తుకు రాగానే, నేను నాకు తెలిసినదంతా టూకీగా చెప్పాను. అసలదంతా ఇదివరకే ఆమెకు చెప్పి తగిన జాగ్రత్తపడి వుండవలసింది. ఏమైతేనేం—మేము పెద్ద ప్రమాద పరిస్థితిలో చిక్కుకున్నట్టు ఇరువురం గ్రహించాము. కెప్టెన్ మాకు గదిఅద్దె, భోజనపు ఖర్చులు మొదలైన బాకీ చాలా ఇవ్వతేలాడు. ఇంకా కాసేపట్లో కెప్టెన్ ‘స్నేహితులు’ మా హోటలుమీద దాడిచేయనున్నారు. నల్లకుక్కను, ఆ గుడ్డివాణ్ణి పరిచయం చేసుకున్నాను గనుక మిగతా సముద్రపు దొంగలు ఎల్లా ఉంటారో చూడకుండానే నేను గ్రహించాను. వాళ్లు మాకు న్యాయంగా రావలసింది మాకిచ్చి మిగిలిందే పట్టుకుపోతారని ఎలా ఊహించగలను?

పోనీ డాక్టర్ లివ్‌సే ఇంటికి గుర్రంమీద వెళ్ళి పోలీసు సహాయం తీసుకువద్దామా అంటే, ఇంట్లో మా అమ్మ నొక్కతెనూ నిస్సహాయంగా వదిలి వెళ్లినట్లవుతుంది. అసలు మా ఇద్దరిలో ఒక్కరంకూడా ఆఇంట్లో ఇక ఉండటం మంచిది కాదని తోచింది. గడియారపు టిక్‌టిక్ శబ్దంకూడా మమ్మల్ని భయపెడుతోంది. రోడ్డుమీద మనుషుల అలికిడి అవుతున్నట్లు, హాల్లో కెప్టెన్ శవంతాలూకు దెయ్యం ఎగురుతున్నట్లు తోచి మాఅమ్మ, నేను ఒకరి నొకరం అంటిపెట్టుకునే తిరిగాము. వెంటనే ఏదో చెయ్యాలని నిశ్చయించి, బయటికి వచ్చాము. మా హోటలుకు, గ్రామానికి రెండుమూడు ఫర్లాంగులకంటె ఎక్కువ దూరం లేదు. అక్కడికి వెళ్లి కొందరు మనుషులను సహాయం తీసుకు రావాలనుకున్నాము. వెంటనే గ్రామంకేసి బయలుదేరాము.

నాకు ధైర్యం కలిగించిన విషయమేమంటే, గుడ్డివాడు ఆవేళ వచ్చింది గ్రామంఉన్న దిశనుండి కాదు; దానికి ఎదుటివైపునుండి. అందుచేత గ్రామానికి వెళ్లేదారి నిరపాయమైందేకదా. ఆధైర్యంతో చకచకనడిచి, పరిగెత్తి ఎలాగైతేనేం కొన్ని నిమిషాల్లో గ్రామం చేరుకున్నాం. అప్పటికి నలువైపులా సంజ చీకట్లు అలుముకున్నాయి. కాని గ్రామస్థుల్లో ఒక్కరుకూడా మాకు సహాయం రావడానికి అంగీకరించలేదు. మమ్మల్నెదుర్కొన్న అపాయాలను గూర్చి చెప్పినకొద్దీ, ఆబాల గోపాలం హడిలిపోయి జారుకునే వారేగాని ధైర్యం చెప్పేవారు లేరు. కెప్టెన్ ఫ్లింట్ పేరు నాకు కొత్తదైనప్పటికీ గ్రామస్థుల్లో చాల మందికి పరిచితమైనదే. దేశదేశాలను హడలెత్తించిన సముద్రపు దొంగట కెప్టెన్ ఫ్లింట్. అటువంటివాడి శిష్యులు మా “ఎడ్మిరల్ బెన్‌బో” మీదకి ఈరాత్రి దండెత్తనున్నారని తెలిసి ఇక ముందడుగువేసే మొగాడేడీ?

కాని కొందరు ధైర్యవంతులు మరికొంత దూరంలోఉన్న డాక్టర్ లివ్‌సే ఇంటికివెళ్లి సంగతంతా చెప్పడానికంగీకరించారు. ఒక్కడూ మా ఇంటికి రావడానికిష్టపడలేదు.

మాఅమ్మ ఒకచిన్న గంభీరోపన్యాసం ఇచ్చింది: “మీరెవ్వరూ రాకపోతే నేనూ, జిమ్ కలిసి వెడతాం. తండ్రిలేని బిడ్డగదా! వాడికి రావలసిన డబ్బు రాకుండా నేనెల్లా ఊరుకుంటాను? మేము వెనక్కి వెడతాం. మీకందరికీ ఇవిగో వెయ్యి నమస్కారాలు. ఛీ, ఇంత పిరికివాళ్లని అనుకోలేదు. ఆ ఇనప్పెట్టెను బద్దలుగొట్టి అయినాసరే, మాకు రావలసిన డబ్బు మేం తీసుకుంటాం.”

నేను, మా అమ్మ వచ్చినదారే పట్టాం. వద్దు వద్దని అందరూ అడ్డమొచ్చేవారేగాని, వస్తామన్న వారొక్కరూ లేరు. కాని ఒక సహాయం మాత్రం చేశారు. తూటాలు నింపిన పిస్తోలు నొకదాన్ని

నా చేతికిచ్చారు, అపాయంవస్తే పనికి వస్తుందని; సగం దారిలో గుర్రాలను రెడీగా ఉంచుతామని, డాక్టరు గారింటినుండి సహాయం తీసుకువచ్చేందు కొకమనిషిని పంపుతామనీ కూడా వాగ్దానంచేశారు.

చలితోను, భయంతోను గజగజ వణుకుతూ నడిచాము. మా దురదృష్టంకొద్దీ ఆరోజు పూర్ణిమ కూడాను. దూరాన కొండల చాటునుంచి నిండు చంద్రుడు తొంగి చూస్తూన్నాడు. మేము గ్రామానికి తిరిగి వెళ్లేటప్పుడు పుచ్చ పువ్వులాంటి వెన్నెల్లోనే వెళ్లవలసి వస్తుందని మరీ భయపడ్డాం. రోడ్డుపక్కగా, చెట్లనీడల్లోనడిచి చివరికి మాహోటలు చేరుకున్నాం.

సింహద్వారం గట్టిగా బందుచేశాను. కిటికీలు కూడా భద్రంగామూశాను. లోపలంతా కటిక చీకటి. చీకట్లోనే తడుములాడి మా అమ్మ కొవ్వొత్తి దీపం వెలిగించింది. కెప్టెన్ శవంమేము వదిలిపెట్టి వెళ్లినప్పు డెలావుందో అలాగే వుంది. ఒకళ్ల చేతులు ఒకళ్లం పట్టుకుని హాల్లో అడుగుపెట్టాం.

"తాళం చెవులెలా వస్తాయి?" అంది మా అమ్మ శవంకేసి భయంగాచూస్తూ.

నేను శవం పక్కన మోకాళ్లమీద వంగాను. కెప్టెన్ చేతులో గుడ్డివాడు పెట్టిన గుండ్రని కాగితం ముక్క ఇంకా అలాగేవుంది. "నల్లచుక్క" అంటే అదే అయివుంటుందనుకున్నాను. ఒకపక్కన అంతా నల్లగాఉంది. రెండోపక్కన "రాత్రి పదిగంటల వరకూ గడువు" అని చక్కటి దస్తూరీలో దొంగల సందేశం వ్రాయబడివుంది.

"అమ్మా, పదిగంటల దాకా ఫరవాలేదే," అన్నాను. అదేక్షణంలో మాగోడ గడియారం టంగ్ టంగ్న గంటలుకొట్ట నారంభించింది. ఆ హఠాత్ శబ్దానికి మా పైప్రాణాలుపైనే ఎగిరి పోయాయి. గడియారం ఆరుగంటలే కొట్టినందుకు మళ్ళీ ధైర్యంతెచ్చుకున్నాం.

"త్వరగాతియ్ తాళంచెవులు," అంది మా అమ్మ.

ఒకటితరవాత ఒకటిగా జేబులన్నీ వెదికాను. కొన్ని చిన్ననాణాలు, సూది, దారం, పొగాకు, చాకు, చిన్నదిక్సూచి, మొదలైన అనవసర వస్తువులెన్నో బైటపడ్డాయిగాని తాళంచెవులు దొరకలేదు.

"మెడకి కట్టుకున్నాడేమో చూడు," అని సలహా ఇచ్చింది మాఅమ్మ.

భయం, అనుమానాలు అన్నీ దిగమింగి, ధైర్యం తెచ్చుకుని అతని చొక్కాగుండీలు విప్పాను. మెడనుంచి దారంతో వేళ్లాడుతూ తాళంచెవి కన పడింది. దారాన్ని అతని చాకుతోనే కోసివేశాను. అది పుచ్చుకుని ఇద్దరం మేడమీద ఇంతకాలం అతడు నివసించిన గదిలోకి పరిగెత్తాము. కెప్టెన్ పెట్టె మంచం కిందనేవుంది. అది ఇనుముతో చేయబడిన దైనప్పటికీ, ఇనప్పెట్టె అనడంకంటె ఓడకళాసు లుపయోగించే కావడిపెట్టె అనడం మంచిది. మూతమీద "బి" అని అక్షరం చెక్కబడివుంది. పెట్టె బాగా తుప్పుపట్టి, సొట్టలుపోయి వుంది.

తాళంచెవి తీసుకుని మాఅమ్మ కొంత కష్టంమీదపెట్టె మూత తెరిచింది. తెరవగానే పొగాకు ఘాటు, తారువాసన మమ్మల్ని ఉక్కిరి బిక్కిరి చేశాయి. ముందుకొన్ని కొత్తబట్టలు కనిపించాయి వాటినెవ్వరూ ఇంతవరకూ తొడుక్కో లేదని మా అమ్మఅంది. అడుగున పొగాకు, రెండు చక్కని పిస్టళ్లు, ఒకపాత వాచి, రెండు ఇత్తడి దిక్సూచులు, తమాషాగావున్న అయిదారు నత్తగుల్లలు, కొన్ని విదేశీయ నాణాలు కనిపించాయి. సముద్రాలపై ఓడలను దోచుకుంటూ, అమాయకులను హత్యచేస్తూ క్రూరమైన నీచమైన జీవితం గడుపుతూ దేశదేశాలు సంచరించే ఈతడు పిల్లలకు సహజమైన కుతూహలంతో నత్తగుల్లలను దాచుకోవడం నాకు ఆశ్చర్యం కలిగించింది.

తెరచాప తాలూకు గుడ్డను తొలగించి ఇంకా అడుగున పరీక్షించాము. మైనం గుడ్డతో చుట్టిన ఒక పార్సిలు, ఒక చేతిసంచి కనిపించాయి. ఇవ్వే పెట్టెలో మిగిలిన ఆఖరి వస్తువులు. సంచీ ముట్టుకునే టప్పటికి బంగారు నాణాలు గలగల మన్నాయి.

"ఈదొంగ వెధవలకి నేనెంత నమ్మకస్థురాలినో చూపిస్తాను. మనకి రావలసిన దానికంటె ఒక్క ఫార్దింగుకూడా ఎక్కువ తీసుకోను," అని మాఅమ్మ సంచిలోని బంగారు నాణాలు లెక్కించ సాగింది.

ఆనాణాలు ఒక దేశానివికావు, ఒక విలువవి కావు, ఒక ఆకారానివికావు. స్పెయిన్, ఫ్రాన్సు, ఇంగ్లండు, ఇటలీ అన్ని దేశాల నాణాలు రకరకాలవి కలగాపులగంగా ఉన్నాయి. ఇంగ్లీషు నాణాలైన గినీలు (21షిల్లింగులు) చాల అరుదుగా వున్నాయి. వీటితోనే మా అమ్మ బాకీ మొత్తాన్ని వేరుచేయ సాగింది. మిగిలినవేవీ మాకు తెలియ వాయెను.

గినీలు వెదికితీయడం చాలాసేపు పట్టింది. కొంతసేపటికి నేను హఠాత్తుగా ఆమె చెయ్యిపట్టుకుని ఆపాను. రోడ్డుమీద ఎక్కడో దూరాన పరిచితమైన ధ్వని అస్పష్టంగా వినిపించింది అది గుడ్డివాని చేతికర్ర రోడ్డుమీద టక్‌టక్ మంటున్నధ్వని. నాకు గుండె ఆగిపోయి నట్లయింది. క్రమంగా ఆధ్వని మాహోటలు గేటును సమీపించింది. ఎవరో గేటు తెరిచారు; సింహద్వారాన్ని తట్టారు. తరవాత కొంతసేపు నిశ్శబ్దం. మళ్లీ ధ్వని ప్రారంభమైంది; క్రమంగా దూరమై, అస్పష్టమై, చివరికి వినపడకుండా పోయింది. ఇంతసేపూ ఊపిరి బిగపట్టి వింటూ కూర్చున్న మేము "అమ్మయ్య" అని ఒక నిట్టూర్పు విడిచాము.

"అమ్మా, ఆనాణాలన్నీ తీసుకుపోదాం. ఇల్లా ఆలస్యంచేస్తే అపాయం," అన్నాను నేను. ఎందుకంటే గుడ్డివాడు తలుపులన్నీ మూసివేసి ఉండటం గమనించాడు. ఏ నిమిషాననైనా మిగతా దొంగలందర్నీ వెంటబెట్టుకు రాగలడు. అసలు తలుపులన్నీ మూసివెయ్యటం ఎంత తెలివైనపనో అప్పుడు గ్రహించాను.

కాని మా అమ్మ ఎంత భయభ్రాంతురాలై వున్నా, మాకురావలసిన దానికంటె ఒక్కపెన్నీ ఎక్కువగాని, తక్కువగాని తీసుకోవడానికి ఇష్టపడలేదు. ఇంతలో దూరాన కొండల వైపునుండి సన్నని యీల వినిపించింది. అప్పటికి మాఅమ్మ పట్టుదల సడలింది.

"సరేలే. దక్కినంతే దక్కింది," అని మాఅమ్మ లేచింది.

నేను మైనంగుడ్డ పార్సిల్‌ను తీసుకున్నాను మాకింకా రావలసిన డబ్బు కొంతవుంది గనక ఆపార్సిల్‌లో ఏదుంటే అది చెల్లుకింద కట్టుకోవడానికి నిశ్చయించాను.

మరుక్షణంలో మేమిద్దరం కొవ్వొత్తిని పెట్టె పక్కనే వదిలేసి గబగబ మెట్లు దిగేశాము. తలుపులు తెరుచుకుని రోడ్డుమీద పడ్డాం. అప్పటికి పొగమంచు చాలావరకు విచ్చిపోయింది. చంద్రుడు, బాగా పైకొచ్చాడు. కాని మాహోటలు ముందు మాత్రం కొద్దిగా చీకటిగానే వుంది. అందుచేత మేమివతలకు రావడం ఎవరికంటా పడదని ధైర్యపడ్డాము. కొన్ని గజాలు పరిగెత్తామో లేదో కొండలవైపునుండి మనుషులు పరుగెత్తుకు వస్తున్న అలికిడి అయింది. వెనక్కి తిరిగి చూశాం. మినుకుమినుకు మంటున్న లాంతరు వెలుగు కనిపించింది. దాన్నిబట్టి దొంగలాట్టే దూరంలో లేరని గ్రహించాము.

"నాన్నా, ఈడబ్బు నువ్వు పట్టకొని పరిగెత్తు. నాకు స్పృహ తప్పిపోతోంది," అని మా అమ్మ తూలుతూ ఉన్నచోటే ఆగిపోయింది. ఆనిమిషంలో మా గ్రామస్థుల పిరికితనాన్ని ఎంత నిందించానో, మా అమ్మ డబ్బులెక్క బెడుతూ ఆలస్యం చేసినందుకు ఆమె నెంత నిందించానో చెప్పలేను. ఏమైతేనేం— అపాయం రానేవచ్చింది. ఇప్పుడు బెంగపడి లాభం లేదు. తప్పించుకునే మార్గం చూడాలి. అదృష్టవశాత్తుమేము వంతెనకు సమీపంలో ఉన్నాము. తూలిపోతున్న మాఅమ్మను కష్టంమీద పట్టుకుని నడిపించాను. కాలవగట్టు చేరుకునేసరికి ఆమెకు పూర్తిగా స్పృహ తప్పిపోయింది. నాకా సమయంలో అంతబల మెక్కడనుంచి వచ్చిందో తెలియదు మా అమ్మను ఎలాగైతేనేం, గట్టు కిందవరకూ లాక్కువెళ్లి, వంతెన 'ఆర్చి' నీడలో ముడుచుకునికూర్చున్నాను. ఆమె నాబుజంమీద వాలిపోయింది. నేను నీడలో వున్నప్పటికీ మాఅమ్మ మీద వెన్నెలబాగా పడుతోంది. అదీకాక మేము హోటలుకు ఈల వేటుదూరంలోనే ఉన్నాము.

(ఇంకావుంది.)

వెఱ్ఱి దంపతులు

పూర్వం ఒక గ్రామంలో శివయ్య, చుక్కమ్మ అనే దంపతులుండేవారు. వాళ్లిద్దరు ఒకరికొకరు తీసిపోని వెఱ్ఱిబాగుల వాళ్లు. ఇద్దరూ సమానంగా చాదస్తం, వెఱ్ఱి, అమాయకత్వం ఉన్న వాళ్లన్నమాట. ఒకనాడు శివయ్య ఒంటరిగా ఊరిబయట నడుస్తున్నాడు. ఉన్నట్లుండి అతని గుండెల్లో దడ ప్రారంభమైంది. ఆనాడు తనకు గొప్పగండంఉన్నదని జ్యోతిష్కుడు ముందునాడు చెప్పిన మాట జ్ఞాపకమొచ్చింది. ఇంకేముంది? "జాతకరీత్యా ఉన్న ప్రమాదం నిజమే ఐనది. నేనుచచ్చిపోయినాను." అనుకున్నాడు శివయ్య. అనుకోవడమే తరువాయిగా అతడు నేలమీదపడి, కళ్లుమూసుకొని, ఊపిరి బిగపట్టేశాడు. చాలసేపు అల్లానేపడి వున్నాడు.

ఎంత సేపైనా తనను చూచిన వారుగాని, పలుకరించిన వారుగాని లేకపోయేసరికి శివయ్యకు చాల కోపంవచ్చింది. గబగబ ఇంటికి వెళ్లాడు. అమితమైన కోపంతో చుక్కమ్మతో, "నేను ఇందాకటినుండి ఊరిబయట చచ్చిపడి ఉన్నాను. ఎవరికీ నాచావు సంగతి ఉన్నాను. ఎవరికీ నాచావు సంగతి పట్టలేదాయె. ఆఖరికి నీకైనా నాచావును గురించి విచారం లేకపోయింది. పోనీలేగానీ, ఇప్పటికైనా నన్ను దహనం చేసే ఏర్పాట్లు చేయించు.'' అన్నాడు. తనకు వచ్చినకష్టం తలచుకొని, తనుపడ్డ బాధ చెప్పుకొని, శివయ్య ఒకటికి నాలుగు మార్లు ఏడ్చాడు. ఇందాకటి చోటుకి మళ్లీవచ్చి, అల్లాగే పడుకున్నాడు. చుక్కమ్మ ఈ మాటలువిని, లబో దిబోమని మొత్తుకుని ఏడవటం మొదలు

రచన:

"జానకి"

పెట్టింది. చుట్టుప్రక్కల వారంతా వచ్చి శివయ్య పోయినాడన్న వార్త విని చాలా దుఃఖించారు. శివయ్య ఊరిబయట చనిపోయి పడిఉన్నాడన్న విషయంచెప్పి, చుక్కమ్మ గుండెలు తరుక్కుపోయేటట్లు విలపించింది. ఇంతలో ఎవరో, "ఆయన మరణవార్త మీకెవరు చెప్పారమ్మా ఇంతకూ" అని అడిగారు.

చుక్కమ్మ, "అయ్యో. ఎవరో కూడానా నాయనా. ఆయనదగ్గర ఎవరున్నారు కనుక రావడానికి? పాపం! ఆయనే కాళ్లీడ్చుకుంటూ వచ్చి, చెప్పివెళ్లారు." అని మరింత మొత్తుకున్నది. అసలు విషయం గ్రహించి గ్రామస్థులు పొట్టపగిలేటట్లు నవ్వుకున్నారు. ఊరివెలుపల నున్న శివయ్యకు, అతడు చావలేదన్న సత్యం నచ్చచెప్పేసరికి వాళ్ల తలప్రాణం తోకకు వచ్చింది.

తెలివి తక్కువ వాళ్లవలన ప్రమాదాలు మాత్రమే సంభవిస్తాయనుకోరాదు. వాళ్లవలన ఎన్ని హాస్యరస పూరితమైన కథలు, గాథలు పుడుతున్నాయో కూడా గమనించాలి. ★

కోపాగ్రభుక్తి

పూర్వకాలంలో రామశర్మ అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడు బీదవాడవటంచేత వైదికవృత్తి చేసుకునేవాడు. రామశర్మకు వృద్ధులైన తల్లిదండ్రులున్నారు. తండ్రి తనకు శక్తి ఉన్నవరకు తాపత్రయపడి కుటుంబపోషణ హాయిగా జరిపించడమేగాక యింత స్థిరాస్థి అంటే యిల్లు, కొన్ని పశువులు సంపాదించాడు.

కాని తన కుమారుని వివాహవేళకు బాగా వృద్ధుడయిపోయాడు. అందువల్ల యిప్పుడు రామశర్మకు వివాహం చేయాలనే కుతూహలం హెచ్చయింది.

ఆవిధంగానే తమ అగ్రహారానికి కొంచెం దూరంలో మరొక అగ్రహారం అవధాని గారి కుమార్తెను ఓశుభ ముహూర్తాన తెచ్చి వివాహం చేశాడు. బాగా వృద్ధులయారు. చేతికి ఎదిగిన కొడుకుఉన్నాడు. కోడలు యింటికి వస్తే తమ కుమారుడు సుఖపడి వృద్ధాప్యంలో తాము సుఖపడవచ్చునని ఆశించారు.

రామశర్మ భార్య అత్తగారిని మామగారిని ఆదరించటానికి బదులు గయ్యాళిగా తయారయి, నానాబాధలు పెట్టేది తను సేవచేయదు సరికదా తనభర్త వాళ్లకు సేవచేసినా, వాళ్లమీద కనికరం చూపినా ఆ రోజు ఆయింట్లో యుద్ధమే. అయినప్పటికీ 'కాటికి కాళ్లు చాచుకున్న' వాగమని వృద్ధదంపతులు ఓపికతో ఆ కష్టాలన్నీ భరిస్తూ ఉండేవారు.

ఈవిధంగా రామశర్మ భార్య గయ్యాళితనం పది సంవత్సరాలయేసరికి తీవ్రరూపం దాల్చింది. అత్త

రచన: శ్రీమతి సుసర్ల "బేబి"

గారు, మామగారు ఉండడానికి వేరే పాకఉంచి ఆచీకటిలో ఉండమని ఆజ్ఞాపించింది. వారికి కట్టుకునేందుకు బట్టలు యివ్వక ఒక కంబళి యిద్దరకూ కలిపియిచ్చింది. తిండిపెట్టడంకూడ మానేసి యింత గంజి ఒక మూకుడులో పోసేది. అసలే వృద్ధాప్యంతో కృంగిపోతున్న ఆదంపతులు కోడలువల్ల పడుతున్న బాధలకు మరింత కృశించి పోయారు.

రామశర్మకు సుశర్మఅనే కుర్రవాడు కలిగాడు. సుశర్మ తండ్రికన్న సూక్ష్మబుద్ధి కలిగి ప్రతివిషయం యిట్టే గ్రహించ గలిగేవాడు. ఏడవఏట తన తాత, బామ్మ పడుతున్న బాధలు చూడలేక ఎందుకలాగ చేస్తున్నారని తనతల్లిదండ్రులని ప్రశ్నించేవాడు. తండ్రి ఏమీ మాట్లాడక ఊరుకునేవాడు. కాని తల్లిమాత్రం కుమారుని చేరదీసి తాతమీద మరింత కోపం తెప్పించడానికి యిలా చెప్పేది.

"అది వాళ్లుచేసిన పాపం! వాళ్లు చిన్నప్పుడు వాళ్ల తల్లిదండ్రుల్ని యిలానే బాధపెట్టేవారు. అందుకు యిప్పుడు అనుభవిస్తున్నారు."

ఈసమాధానం వినినా సుశర్మకు తల్లి ఏదో చేయరాని అపరాధం చేస్తున్నట్టు తోచింది. సరే తన తల్లి దండ్రులకు బుద్ధి చెప్పడానికి నిశ్చయించుకున్నాడు.

ఒకరోజు రాత్రి రామశర్మ భార్య తన అత్తమామలకు యింత గంజిపోసింది. వృద్ధ దంపతులు త్రాగుదామన్న ఆత్రుతతో ఆగంజి తీయబోయేసరికి సుశర్మ ఒక కమ్చీ పుచ్చుకొని ఆగుడిశెలోకి వచ్చాడు. ఇదంతా ఎదురుగా అరుగుమీద్ధ నిల్చొని రామశర్మ, అతనిభార్య చూస్తున్నారు. సుశర్మ కమ్చీ ఝుళిపించి "యిదిగో! తాతా నువ్వు అలా చేతులు వణికించుతున్నావు. ఆ కుండ మూకుడు క్రిందపడిందా పగిలిపోతుంది. అది పగిలిపోతే ఈ రోజుతో మీకు ఆయుర్దాయం సరి" అని ఘట్టిగా మందలించాడు. తన కుమారుని ప్రజ్ఞ చూచి రామశర్మ భార్య మురిసి

(46-వ పేజీ చూడండి)

[illegible]

కలక్టరుగారిదగ్గరనుంచి ప్రత్యేకంగా వచ్చిన తాఖీదుచూడ్డంతోనే మున్సిబు రాంనాయుడు చాలా ఆశ్చర్యపోయాడు. పడక కుర్చీ లో పడుకుని ఎన్నో పర్యాయాలు పిచ్చెక్కినవాడిలా చదివిందే చదవడం - నిజంగా అతనికి నమ్మకం కుదరలేదు. తనకళ్లు తనని ద్రోహం చేస్తున్నాయేమో ననుకున్నాడు. ఉదయంనుంచి లెక్కకూడా లేదు. ఎన్నో పర్యాయాలు చదువుకున్నాడు. ఆరో క్లాసు చదువుకుంటున్న మనుమడి చేత రెండుమూడు పర్యాయాలు చదివించాడు. ఆఖరుకి గొలుసు కట్టులో వున్న కలక్టరుగారి తెలుగు సంతకంచూసి, ఇందులో ఏమీ అబద్ధం లేదూ అన్న నిర్ధారణకి వచ్చాడు. అదీ స్వయంగా తాశీల్దారుగారు కచ్చేరికి పిలిపించి కుర్చీ వేయించి ఎంతో మర్యాదచేసి అతనికి ఆ తాఖీదు అందించారంటే హాస్యానికైనా అందులో అబద్ధం వుంటుందని ఎవరైనా వూహలో నైనా అనుకుంటారనుకోవడం శుద్ధపొరపాటు.

శ్రీ శే.పైడారావు

మరో పర్యాయం జేబులో పెట్టిన తాఖీదు పైకి తీసి మీదనుంచి క్రిందవరకూ అతిజాగ్రత్తగా చదువుకున్నాడు. సంతోషంతో ఉబ్బి తబ్బిబ్బయ్యాడు. తనలో తాను ఎన్నో ఆలోచనలలో పడ్డాడు.

ఇకమీదట తన గ్రామస్థులు ఎండాకాలంలో మైలున్నరదూరంలో వున్న బుచ్చన్న కోనేరుకు ఎగబ్రాక నవసరం లేదు. ఆ వెధవ చెరువు బాగుచేయడానికి తన తాతముత్తాతలు - తండ్రీ ఎంతో డబ్బుకూడా ఖర్చుపెట్టి ఎన్నో ప్రయత్నాలు చేసి విఫలులయ్యారు. వారసత్వప్రకారం మున్సబీ రాగానే తనూ ప్రయత్నాలుచేశాడు. అసలు తనకు ఏ కోశాన్నా నమ్మకంలేదు కూడాను, రివాజు ప్రకారం ఓ కాగితంముక్క రాసి పడేశాడు. అప్పుడే రెండుపుష్కరాలు దాటేసింది. పూర్తిగా మర్చిపోయాడు. అటువంటిది అనుకోకుండా ఇట్టే అయి కూర్చుంది. ఇదొక్కటే కాదు! ఇంతవరకూ తనలో కాని తన గ్రామస్థుల ఆలోచనలో కూడా రాని కాలవమీద బ్రిడ్జితో సహితం రోడ్డు, ఊరికి ఎలక్ట్రి చెరువుతోపాటు ప్రభుత్వం మంజూరు చేసిందంటే ఇదంతా తన అదృష్టం. ముఖ్యంగా తను బాగుపడేరోజులు వచ్చాయి. రోడ్డు ఎప్పుడైతే పడుతుందో బస్సురూటుకూడా వస్తుంది. దాన్ని ఎలాగైనా తనే కొట్టేస్తాడు. తనకు పోటీ ఎవరొస్తారు? చక్కా చిన్నోడ్ని అందులో ఇరికించి వెయ్యొచ్చు. వెధవ జులాయిగా తిరిగి పాడయి పోతున్నాడు. ఆ వుద్యోగం వాడికి సరిపోతుంది కూడాను. ఇక పెద్దోడికంటేకట్టే కాలవమీద బ్రిడ్జికంట్రాక్టు ఎలక్ట్రి ఎలానూ పడుతుంది కాబట్టి ఊరవతల ఎరుకలవాళ్ల పందులు విహారంచేస్తున్న తనగొడ్డుబంజరులో ముందు తడికలతో సినీమా హాలు ప్రారంభించి దానిమీద వచ్చిందాంతోనే చక్కగా సిమ్మెంటుది కట్టెయ్యచ్చు. అది తను స్వంతంగా చూసుకు పోతాడు. అంతగా డబ్బు అవసరముంటే గున్నయ్యశెట్టి వున్నాడుగా. మెల్లిగా వాటాకి కుదుర్చుకుని తరువాత ఎలా జరిగితే అలా జరుగుతుంది. ఇంతకూ తను గ్రామాధికారి. అసలు జాగా తనది. మొత్తంమీధ తను బాగుపడే రోజులు వచ్చాయి. తన గ్రామం కొద్దిరోజుల్లో బస్తీ అయి కూర్చుంటుంది. గోలపెడ్తున్న ఆడపిల్లలకి తలా అయిదేసి 'ఎకరాలు ఘస్తుకొను యిన పల్లపు భూమి కొని పారెయ్యచ్చు.

రెండుసెల్లక్రితం తను అవసర మొచ్చి గొడ్డుబంజరును ఎకరంయాభైరూపాయలకు అమ్మజూపితే 'ఎకరం ఎంతా' అని ఎవరూ అడగడానికైనా రాలేదు. అదీ మంచికే వచ్చింది. గొడ్డు - బంజరు, బంగారు - బంజరయింది.

పాపం! గున్నయ్య శాశ వ్యాపారాలు లేవని గోలపెడ్తున్నాడు. ఆ రేవుకూపు అతనికే ఇచ్చేస్తే చాలా బాగుంటుంది. ఆ మాత్రం అభిమానం చూపిస్తే ముందుకు తనెలా చెప్పితే అలా వింటాడు. సినీమా హాలుకూడా పక్కా, కాంక్రీటుతో ఈ మధ్య రాజుగారు పట్టణంలో కట్టిన రెండంతస్థుల పరమేశ్వరీ హాలు లా తయారయి కూర్చుంటుంది.

రానున్న అదృష్టాన్ని అభినందించుకుంటూ, ఈసంగతి ఎకాఎకీని గ్రామంలో వున్న నల్గురిపెద్దల చెవినీ వేయాలన్న వుబలాటం పుట్టగానే, హరిమీద పిడుగు పడినా లెక్కచేయకుండా, మధ్యాహ్నం భోజనం అవ్వగానే, పడక వేసి సాయంత్రం అయిదుగంటలవరకూ నిద్ర తీసే మున్సబు రాంనాయుడు వెంటనే గ్రామచావడికి ప్రయాణమయ్యాడు.

భోజనం అవ్వగానే ఎక్కడికో ప్రయాణం కడ్తున్న భర్తను చూడ్డంతోనే, భార్య ఎంతైనా ఆశ్చర్యపోయింది. కుదకు తన మామగారికి వచ్చే ప్రాణం పోయే ప్రాణమని ఇంటందరూ గొల్లుమని ఏడుస్తుంటే, పశువుల శాలలో సుఖంగా నిద్రతీసి ఆయన వచ్చిన అరగంటకు ఏమిటయిందని లేచి వచ్చిన భర్త ఈరోజు, భోజనం

అవ్వగానే చుట్టయినా కాల్చకుండా ఎక్కడికో ప్రయాణ సిద్ధమవుతుంటే, వెళ్ళబోతున్న వాడిని 'ఎక్కడికి' అన్న ప్రశ్న వేసే ధైర్యం చాలక, రెండుకళ్లూ అప్పగించి నిలబడిపోయింది మున్సీబు భార్య.

వీధి అరుగుమీద కునికిపాట్లు పడుతున్న పాలిక కొండడ్ని మున్సీబురాంనాయుడు కేక పెట్టి "ఒరేయి కొండా! చూడూ, ముందు గున్నయ్యశెట్టిని, మా వెంకన్న మామని తతిమ్మా పెద్దకాపుల్ని, నేను అర్జంటుగా విలేజి కచ్చేరికి రమ్మన్నానని చెప్పు" అని వున్న నల్గురి పెద్దలకీ కబుర్లుపంపి బట్టలు వేసుకోడానికి గదిలోకి వెళ్లిపోయాడు.

కబురందగానే పెద్దలందరూ ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ చావడిలో చేరారు. పాపం! గున్నయ్యశెట్టి కాళ్లు కడుక్కుని భోజనానికి సిద్ధమవుతున్న వాడు, మున్సీబుగారి ఆజ్ఞ వినగానే, పుట్టింది మొదలు నేటివరకూ ఎన్నడూ కలలో కూడా మిట్ట మధ్యాహ్నం కబుర్లు పంపని రాంనాయుడు అర్జంటుగా రమ్మన్నాడంటే ఏదో ఉపద్రవం ముంచుకు వచ్చిందని ఎలావున్నవాడలా పైమీద తువాలయినా లేకుండా బోడావుడిగా పరుగులు పెట్టాడు.

ఒకరికి తెలియకుండా ఒకరు ఒక్కొక్కరే హాజరయి అసలుసంగతేమిటో తెలియక క్షణంలో ఏదో పెద్ద ప్రళయం రాబోతుందని పెద్దలందరూ తమలో తాము తికమకపడ్డారు.

రోజూ ఎండవేళప్పుడు ఖాళీగావున్న గ్రామచావడిలో నడుం వాల్చే మంగలి పెద్దయ్య వెస్తగురువయ్య, చాకలిసుబ్బన్న ఇత్యాదివర్గం సుఖమైన నిద్ర పోయిందని తమలో విసుక్కున్నా ఎన్నడూ లేని గ్రామప్రముఖుల అకస్మాత్తు సమ్మేళనకు కారణం ఏమిటా అని ఆశ్చర్యపోయి కొంచెపట్లో అదే తేల్తుందన్న నిర్ధారణతో చావడిప్రక్కనున్న చింతచెట్టుక్రిందకు మెల్లిగా చేరారు.

మున్సీబు రాంనాయుడు మెల్లిగా చావడిలో కాలు పెట్టాడు. ఉత్సాహంతో తొణికసలాడుతున్న అతని ముఖం కనబడగానే ఏదో ప్రమాదం రానుందని ఆత్రుతపడుతున్న పెద్దలు కొంత స్థిమితపడ్డారు. చెమటలు కారుతున్న ముఖాన్ని తువాలుతో తుడుచుకుని ప్రక్కనన్న స్తంభాన్ని ఆనుకుని బరువుగా కూర్చుంటూ ఉబుకుతున్న సంతోషంతో "విన్నారటోయి ఈ సంగతి? మన వూరు భాగుపడేరోజులు వచ్చాయి. మనం ఇన్నాళ్ళూ ఏమిటో అనుకున్నాం. నోటికి వచ్చినట్లూ ప్రభుత్వాన్ని పాలకుల్ని దూషించాం. పాపం! వారు పడే శ్రమ మనకేం తెలుస్తుంది? మన గ్రామాల్లాంటివి ఇంకా ఎన్ని వున్నాయో? ప్రసిడెంటుగారు చెప్పింది అక్షరాలా నిజం. అన్యాయంగా ఆయన్ని కూడా ఏమిటేమిటో అన్నాము. నిజం నిలకడమీదగాని తెలియదు.

ఇదుగో చెప్తున్నా వినండి. మన చెరువు మరామ్మత్తుచేసి తూములు కట్టడానికి, గ్రామానికి రోడ్డు వేసి కాలవమీద బ్రిడ్జి కట్టడానికి, ఎలక్ట్రి వేయడానికి ప్రభుత్వ ప్రణాళిక ప్రకారం, మన గ్రామానికి లక్షా ఏభైవేలు మంజూరయింది. పనులు ప్రారంభించడానికి ఇంజనీరింగువారు రెండుమూడు రోజుల్లో వస్తున్నారని వారికి సహాయంగా వుండమంటూ స్వయంగా కలక్టరుగారు తెలుగులో సంతకంచేసి ప్రత్యేకంగా తాశీల్దారుగారిచేత తాఖీదు పంపించారు" జేబులో వున్న కాగితం మడతని గున్నయ్యశెట్టికి అందించాడు. శెట్టి గట్టిగా చదివి అందరికీ వినిపించాడు.

తమగ్రామానికి కొద్దిరోజుల్లో ఓ గొప్ప-మహాదశ రానుందని అక్కడున్నవారందరూ ఎంతో సంతోషించారు.

ఈసంగతి జ్యోతిష్యంలో జిల్లాకే పేరెక్కిన తన తాతగారు చక్రంవేసి ఏనాడో చెప్పారని గట్టిగా అందరికీ వినబడేటట్టు అవధానిగారు అన్నారు.

"అవును పెద్దలన్నమాటలు వూరికినే పోతాయా?" శెటి తాళంవేశాడు.

ఈవార్త అప్పుడే చావడిప్రక్కనున్న చింతచెట్టుదాటి గ్రామంలో పడింది. గ్రామస్థులంతా ఎగిరి స్వర్గాన్ని అందుకున్నట్టయింది. మీసాలు మెలివేసుకుంటూ ఠీవిగా నడుస్తున్న మున్సీబురాంనాయుడిని చూచి ముందుకంటె ఎంతోగౌరవం కనబర్చేరు. అప్పుడే తననూకున్నట్టు తనకు రాబోయే పేరుప్రఖ్యాతులకు ప్రథమసోపానం అమరిందన్నట్టు మున్సీబురాం నాయుడు సంతృప్తిచెందాడు.

మూడోనాటికి నెత్తిమీద టోపీలతో సిబ్బందితో సహా ఇంజనీరింగువారు హాజరయ్యారు. చెరువు తనిఖీచేసి ముందు కొలతలు ప్రారంభించారు. వారికి ఏమైనా అవసరమంటే సరిపెట్టడంకోసరం మున్సీబు పెద్ద కొడుకు ఎప్పుడూ వారి వెంట వుంటూ మొత్తంమీద అతనూ వారిలో ఒకడుగా తయారయ్యాడు.

గ్రామస్థులంతా అప్పుడే తాము క్రొత్తగా కట్టిన బ్రిడ్జిమీద నిలబడినటూ తూముద్వారా కాలవలోనుంచి వచ్చిపడిన నీటితో సమృద్ధిగా తమ చెరువు నిండి వున్నట్టు, వీధిలో వెలిగిన ఎలక్ట్రిలైట్ల వెల్తురులో తమ పిల్లలు కేకలు పెడ్తూ ఆడుకుంటున్నట్టూ సంతోషించి సంతృప్తిచెందారు.

పదోనాటికి ఎక్జిక్యూటివ్ ఆఫీసరుతో సహా బోర్డుప్రెసిడెంటుగారు దిగారు. గ్రామస్థులందర్ని సమావేశపరచి తాము ఇంకా ముందు ముందుకు చాలా పనులు చేయవలసివుందని, కేవలం తాము ప్రజాసేవకులమని అయినా ప్రజల సహకారం ఎంతైనా కావాలని, ఇంకా ఎన్నో సంగతులు అన్నీ ప్రజల కుపకరించేవే చెప్తూ తామంటే ఇంకా చాలా మంది అపార్థం చేసుకుని చెడ్డ అభిప్రాయాలతో వున్నట్టు కూడా తెలవిచ్చారు. వెంటనే మున్సీబు రాంనాయుడు నిలబడిప్రసిడెంటుగారుఅలా అనడం భావ్యం కాదని నిజంగా ప్రశిడెంటుగారన్నా వారి అధికారమన్నా ఎంతో గౌరవంగా తామంతా నున్నిస్తామని తాను తన గ్రామస్థులతరఫునుంచి హామీ ఇస్తున్నానని ఒక్క పర్యాయం చుట్టూ కూర్చున్నవారందర్ని కలయచూచాడు. అవును నిజమే అన్నట్టు ముందు మున్సీబు కొడుకు 'ప్రెసిడెంటుగారికిజై' అనగానే

అందరూ అతన్ని అనుసరించి సభంతా జై జైనినాదం చేశారు.

ప్రసిడెంటుగారు పట్టలేని సంతోషంతో ఉబ్బి తబ్బిబ్బవుతూ, ఎక్జిక్యూటివ్ ఆఫీసరుగార్ని అందరికీ పరిచయంచేసి వారు నిర్వహించే పనులగురించి బోధపరచి, అన్ని విషయాల్లోనూ ప్రజలంతా వారికి ఎల్లప్పుడూ సహాయంగా వుండాలని హెచ్చరికచేసి, ఆ సాయంకాలమే ఎంతో ఘనంగా విలేజీ చావడిలో ఎక్జిక్యూటివ్ ఆఫీసుకు ప్రారంభోత్సవం చేశారు. పిల్లలందరికీ పప్పూ బెల్లం పంచారు. మొత్తంమీద ఆ రోజు వూరందరూ తమ తమ గృహాల్లో వివాహాల్లా సందడి చెందారు

ఉత్సవం తర్వాత జరిగిన సభలో బోర్డు ఎలిమెంటరీ స్కూలు హెడ్‌మాస్టరుగారు మూడేళ్లు వరుసగా స్కూలు ఫైనలు తప్పి పట్నంలో చాలాకాలం వుండి ఏ వుద్యోగమూ దొరక్క ప్రస్తుతం ఇంట్లో వున్న కర్ణంగారి మూడో కొడుకు ప్రసిడెంటుగారి ఔదార్యాన్ని ఎంతగానో ప్రశంసిస్తూ పక్కా గంట సేపు మాట్లాడి విరమించారు.

అనుకున్న దానికన్న రెట్టింపు జయప్రదంగా కార్యక్రమం జరగడంవల్ల ప్రసిడెంటుగారు పూర్తిగా సంతృప్తి చెంది, సభానంతరం ఎక్జిక్యూటివ్ ఆఫీసర్ గారితో ఏవేవో సంగతులు మాట్లాడి చాలా కార్యక్రమాలుండటంవల్ల తాను ఇంత త్వరగా గ్రామస్థులను విడిచిపెడ్తున్నందుకు ఎంతో విచారాన్ని సూచిస్తూ మాలపల్లిమీదుగా పట్టణం వెళ్లిపోయారు.

ఎక్జిక్యూటివ్ ఆఫీసు వచ్చిన తర్వాత కర్ణంగారి అబ్బాయికి అందులోనే గుమస్తా పనయింది. గున్నయ్య రేషను కొట్టు ఎక్జిక్యూటివ్ ఆఫీసరుగారిచేత ప్రారంభోత్సవం చేయబడింది. పూర్వం ఎన్నో అవస్థలుపడి నాకంటికి కనిపించని బట్టలూ, కిరసనాయిలూ పంచదార మొదలయినవి ప్రసిడెంటుగారి ధర్మమా అని కడుపులో నీళ్లు కదలకుండా అందరికీ చవగ్గా ఎక్జిక్యూటివ్ ఆఫీసరుగారు అమ్మిస్తున్నారు. (అమ్ముచున్నారు.)

కబురయినా లేకుండా ఓరోజు కలక్టరుగారు దిగబడ్డారు. కాలవమీద వంతెనకట్టడానికి ప్రారంభోత్సవం మూడురోజులలో మంత్రిగారు చేస్తారని ఏర్పాటు కోసరమై ముందుగా అయిదు వందల రూపాయలు అన్నీ సరి కొత్త రూపాయ నోట్లు అయిదు కట్టలు మున్సిబుకు అడ్వాన్సుగా ఇచ్చి, ఏమేమి చెయ్యాలో నివేదించి, ఎంత ఘనంగా వుంటే అంత పేరు ప్రఖ్యాతులు మున్సిబువేనని హెచ్చరిక చేసి వెళ్లిపోయారు.

గ్రామమంతా గుప్పుమంది. పదేళ్ల పిల్లాడు మొదలు ఏళ్లునిండిన ముసిలాళ్లవరకూ ఆడ మొగా అనకుండా ఎక్కడ చూచినా కలక్టరుగారు రావడం వెళ్లడంగురించి ఎంతో గొప్పగా చెప్పుకున్నారు ఇక కొద్దిరోజుల్లో తామంతా పట్టణవాస్తవ్యులవుతామని గొప్పగా మురిసిపోయ్యారు.

అందరికీ చేతులనిండా పని తగిలింది. ప్రతి పనినీ ఎంతో వుత్సాహంతో చేశారు. ప్రతి ఇల్లు సున్నం వేయబడి పచ్చటితోరణాలతో వాకిట పందిళ్లతో కలకలలాడుతూ కళ్లకు ఇంపుగా వుండాలన్న మున్సిబు రాంనాయుడి ఆదేశానుసారంగా ఆడవాళ్లంతా తీరుబడి లేకుండా తన గృహాలంకరణల్లో నిమగ్నులయ్యారు. పిల్లలు తల్లులకు సహాయం చేశారు.

పనులు చకచకా జరిగేయి. మున్సిబు మొదలు పారిక కొండడివరకూ తీరుబడి లేకుండా పోయింది.

'ప్రక్కనే వున్న పట్టణం వాళ్లకి కూడా ఎక్కడ వుందో తెలియని తమ గ్రామానికి మహారాజంతటి మంత్రిగారు వస్తున్నారంటే సామాన్యమా? వారికి తగట్టు మనం మర్యాదలు జరుపకపోతే బాగుంటుందా?' మున్సిబు రాంనాయుడు ప్రజలను హెచ్చరిక చేసి సమాన బాధ్యతలతో పనులు చేయించాడు.

ఊరంతా పచ్చటి తోరణాలు చలువ పందిళ్లతో అలంకరింపబడింది. మంత్రిగారు విచ్చేశారు. వారి వెనుక గొప్ప ఉద్యోగస్తులు, ధనవంతులు, అభిమానులయిన జమీందార్లు, ఇంకా ఎంతో మంది రకరకాల కార్లతో ఎడతెరిపి లేకుండా వచ్చి పడ్డారు.

కాలవ అవతల కారు దిగగానే మున్సిబు రాంనాయుడు బేండు వాళ్ళను హెచ్చరిక చేసి అందరికంటె ముందుగా కానుకలతో సహా 'మంత్రిగారికి జై' అని దేవుడిగుడి ఆవరణలో పూసిన నందివర్ధన పువ్వులతో మాలలను మరపించునట్టి ఎంతో సొంపుగా కట్టబడిన పుష్పమాలను మంత్రిగారి మెడలో వేశాడు. మంత్రిగారు చిరునవ్వు నవ్వుతూ చుట్టూ కలయచూచి చేతులుజోడించి నమస్కరించారు.

చుట్టూ చేరిన గ్రామపెద్దలందర్నీ ప్రసిడెంటుగారు ఒక్కొక్కర్నీ మంత్రిగారికి పరిచయం చేశారు మంత్రిగారు ఒక్కొక్క చిరునవ్వు అందరికీ బహూకరించారు. దాంతో అందరూ మేరు పర్వతం ఎక్కారు.

ప్రారంభోత్సవం దిగ్విజయంగా జరిగింది. ప్రసిడెంటుగారు ఇంతకు ముందు వివరించినట్టుగానే తు. చ. తప్పకుండా మంత్రిగారు పదినిముషాలు మాట్లాడారు. తర్వాత ప్రసిడెంటుగారు, కలక్టరు, ఇత్యాదివర్గం, తమ తమ హోదాలవారిగా మంత్రిగార్ని ఎంతో పొగడి, వారు ప్రజలకు చేసిన సేవ, చేయబోతున్న పనులు, తెల్లవాళ్ళ హయాములో వారు చేసి

త్యాగాలు, జైలుజీవితం, మొదలయినవి చెప్తూ ఎంతో ప్రశంసించారు.

మంత్రిగారు స్వయంగా పిల్లలకు తాము తెచ్చిన పిప్పరమెంట్లు పక్షపాతరహితంగా, దూరంగా చెట్లమీద కూర్చున్న మాలపిల్లలకు కూడా సమానంగా పంచిపెట్టారు. ప్రజలంతా వారి న్యాయబుద్ధిని ఒహో! అని ఎంతగానో ప్రశంసించారు.

కాలవకోతలు అయినట్టు ప్రస్తుతము ప్లానులు వేస్తున్నారని, అవి పూర్తవగానే బ్రిడ్జి పని ప్రారంభించి, ఒక్కొక్కటే, చెరువు మరామత్తు, గ్రామానికి ఎలక్ట్రీ త్వరలోనే పూర్తి చేస్తారని, ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా తమకు స్వయంగా నివేదిస్తే, పరిష్కరిస్తామని, మొత్తంమీద వీటన్నింటికీ ప్రజల సహకారం ఎంతైనా కావాలని వెళ్లిపోతో ఇంకో పర్యాయం, ప్రజలని మంత్రిగారు హెచ్చరిక చేశారు.

మంత్రిగారు వెళ్ళిన వారంరోజుల తర్వాత తిరిగి ప్రెసిడెంటుగారు కలక్టరుగారితో సహా వచ్చి అన్నీ తనిఖీచేసి ఎలక్షనులు దగ్గరపడుతున్నాయని హెచ్చరిక చేసి ఇంతవరకూ మనిషికి ఇంతా అని లెక్క ప్రకారం ఇవ్వబడే కిరసను, బట్టా, పంచదారా మొదలయినవి ఏవిధమైన అభ్యంతరమూ లేకుండా ఎవరెవరికి ఎంతెంత కావలసివుంటుందో తీసుకోవచ్చునని అటువంటి నిబంధనలన్నీ ఎత్తివేశారని సరుకు విరివిగా వచ్చేటందుకు కలక్టరుగారు ఆర్డరు కూడా వేశారని, గున్నయ్యసెట్టిని ఆమర్నాడే పట్నం బయలుదేరి తాశీల్దారుగారిని కలుసుకుని కావలసిన సరుకు తీసుకోవచ్చునని డబ్బు సర్దుబాటు అవ్వకపోయినా తకరారు లేదని ప్రజల అందరి ఎదుటా నివేదించి వెళ్లిపోయారు.

ఎలక్షనులు వచ్చాయి. అందరూ తమకు అన్నివిధాలా మేలుచేయబోతున్న ప్రెసిడెంటుగార్కి మంత్రిగార్కి ఓట్లువేశారు. మొత్తంమీద ప్రజలందరూ సహకరించడంవల్ల ఈపర్యాయంకూడా పాత ప్రజాపాలకులే ఎన్నుకోబడ్డారు.

ఎలక్షనయిన మరునాడే ఇంజనీరింగువారు రావడం మానేశారు. ప్రజలు వాకబుచేస్తే ప్లానులయిపోయాయని, వస్తుసముదాయంతో పని ప్రారంభించడానికి కొద్ది రోజుల్లో [illegible]స్తారని ఎక్జిక్యూటివ్ ఆఫీసరుగారు సెలవిచ్చారు. నాల్గోనాడు అకస్మాత్తుగా ఎక్జిక్యూటివ్ ఆఫీసరుగారికి ఇంకోవూరు బదిలీఅయింది. ప్రజలంతా తమ సంతాపాన్ని ఎంతో ఇదిగా తెలియపర్చి తేనీటివిందుతో సాగనంపారు.

వారంరోజుల తర్వాత కొన్ని అనివార్య కారణాలవల్ల ఎక్జిక్యూటివ ఆఫీసు ఎత్తివేయవలసి వచ్చిందని, కాలవమీద బ్రిడ్జి, చెరువు మరామత్తు, ఎలక్ట్రీ, డబ్బుపరిస్థితులుఅనుకూలంగా లేకపోవడంవల్ల ప్రస్తుతం ఆపుచేయబడ్డాయని చల్లటి కబురు చేరింది.

గ్రామస్థులలో అలజడి ప్రారంభమయింది. మున్సిబు రాంనాయుడితో సహితం అందరూ అసలు సంగతి అర్థంకాక గ్రామచావడిలో సమావేశమయ్యారు. ఇంతలో అప్పుడే పట్టణంనుంచి వచ్చిన గున్నయ్య అల్లుడు తెల్లబడ్డ ముఖంతో కారణంలేకుండా తమ కోటాలన్నీ ఆపుచేయబడ్డట్టూ ఇక ముందుకూడా తమ గ్రామానికి ఎటువంటి కోటా లేనట్టూ తెలియచేశాడు.

అందరూ గొల్లుమన్నారు ముఖ్యంగా మున్సిబు రాంనాయుడుకు తెలివి తప్పిపోతున్నట్టవుతూ, ఊరావతల గొడ్డుబంజరు, పెద్దకొడుకు కాలవకాంట్రాక్టు, రెండో కొడుకు బస్సురూటు, మంత్రిగారి ప్రారంభోత్సవసందర్భంలో తను అదనంగా ఖర్చుపెట్టిన వెయ్యరూపాయలు లీలగా కన్పించి మాయమయ్యాయి. అలానే స్తంభానికి జారబడిపోయాడు ప్రక్కనేవున్న కర్ణంగారి కొడుకు మిగిలిన కలం కాగితాలు కట్టగా కట్టి చంకను పెట్టుకుని 'ఈ త్రిశంకుస్వర్గం ఓటుగురించి' తనలో తాను గొణుక్కుంటూ చుట్టూవున్న పెద్దలని తప్పించుకుని వెళ్లిపోయాడు. ★

మేష్టరు: "మనకు ఏది ఎక్కువదూరంలో ఉంది-ఇంగ్లండా? చంద్రగోళమా?"

కుర్రాడు: "ఇంగ్లండేనండి."

మేష్టరు: "ఎందుచేత?"

కుర్రాడు: "చంద్రుణ్ణి ఇక్కణ్ణించే చూడగలమండి. ఇంగ్లండును అల్లా చూట్టానికి వీల్లేదండి."

చదువుకున్న రైతు

శ్రీ విప్పర్ల వీర్రాజు

వెంకట్రావు బి. ఎ. పూర్తిచేసి "లా" చదవడానికి మద్రాసు వెళ్లాడు. కాని వెళ్లిన మూడు నెలలకే తండ్రి చనిపోవడంచేత చదువుకు స్వస్తి చెప్పవలసి వచ్చింది. తను ఒక్కడే కొడుకు కావడం మూలాన్ని సంసారభారం తనమీదపడింది. తనకు ఉద్యోగం చేయాలనే ఉద్దేశమూ లేదు, చేయవలసిన అగత్యమూ లేదు. కాలవక్రిందభూమి అరవై ఎకరాలూ, ఏటిక్రింద భూమి పది ఎకరాలు ఉన్నంత సేపూ ఉద్యోగం చేయడ మెందుకు ?

ఈ కాంగ్రెసు గవర్నమెంటున్నన్నాళ్లూ పొలం కౌలుకీయడం మంచిది కాదనుకున్నాడు. అంచేత సూరయ్య అనే ఉద్దారుని సహాయంతో వ్యవసాయం చేయ సమకట్టాడు. చదువుకున్న తను అందరికి మల్లే పూర్వంలా కాకుండా క్రొత్తపద్ధతుల్లో వ్యవసాయంచేసి ప్రభుత్వం దగ్గర్నుండి బహుమతులుపొంది మిగిలిన రైతులకు మార్గదర్శి కావాలి అని నిర్ణయించుకున్నాడు. మిగిలిన పొలాలమీద తన పొలంలో మూడురెట్లు, నాలుగు రెట్లు ధాన్యంపండినట్లు, మున్షీగారు బహుమతి యిచ్చినట్లు కలలు కన్నాడుకూడా.

అసలు ఎప్పుడేమి చేయాలో కూడ తెలియదు. సూరయ్య చెప్పినట్లు దుక్కులు దున్నించి, ఆకుమళ్లుపోయించాడు. ఈ సంవత్సరం యిలా సూరయ్య దగ్గర నేర్చుకుని వచ్చే సంవత్సరం తను స్వంతంగా బాగా చేయవచ్చు అని సర్దుకున్నాడు. "చదువుకున్న వాడివి నీవు వ్యవసాయమేం చేయగలవు, అమరకాని కిచ్చేయలేకపోయావూ." అన్నారు కొందరు. "వ్యవసాయంచేయడంలో నా నేర్పరితనం తరవాత చూద్దురు గాని" అని తనలో తనే అనుకున్నాడు.

ఆవూరిలో సుబ్బన్న కూడ పెద్దరైతే. ఏటి క్రింద వెంకట్రావుచేను ప్రక్కనుండే పాతికెకరాలవరకూ సుబ్బన్నది ఉంది. ఇద్దరిచేలకు ఒకే కాలవలోంచి నీరుపెట్టుకోవాలి. ముందు వెంకట్రావు చేనుండడం వల్ల ఆచేను తడిసినతర్వాత సుబ్బన్న చేనుకు నీరుపోయేది. నీరు తక్కువ వచ్చినప్పుడు సుబ్బన్న చేలో పంట తక్కువ పండేది. ఈ చదువుకున్న రైతు వ్యవసాయం కట్టడంతోనే సుబ్బన్న సంతోషించాడు.

ఆకు మళ్లన్నీ ఎదిగాయి. సూరయ్య సహాయంతో కాలవక్రింద చేను ఊడ్పించేశాడు. ఏటికి నీరు ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నాడు వెంకట్రావు. ఇంతలోనే ఏటికి నీరూ వచ్చింది, తనచేనుకు వంతూ వచ్చింది. ఆ కాలువకు మూడు రోజులే వస్తుంది నీరు. ఒకరోజు వెంకట్రావు చేనుకు నీరు పెట్టుకున్న తర్వాత సుబ్బన్న చేనుకు నీరు కట్టుకోవాలి. నీరుకట్టి దమ్ము చేయడానికి కావలసిన సరంజామాతో బయలుదేరాడు వెంకట్రావు. అప్పటికప్పుడే సుబ్బన్న తన చేనుకు నీరు మళ్ళించాడు. వెంకట్రావు సుబ్బన్న దగ్గరకు వెళ్లాడు. "అదేమిటి సుబ్బన్న మామా! ముందు మాచేను తడాలటకదూ?" అన్నాడు.

"ఎవరా అన్నది" అని అడిగాడు సుబ్బన్న.

"సూరయ్య అన్నాడు. ప్రతిసంవత్సరం ఎలాపోతుండేదో ఇప్పుడూ అలాగే పోనియ్యి మామా".

"అదికాదోయ్. ఏటాముందు మా చేనే తడుస్తుంది. కావలిస్తే కరణాన్ని అడుగు తెలిసినోడు."

"అదేంటండి! అలాగంటారూ. నాలుగేళ్ళబట్టి నేనెరుగుదును పెద్ద కాపు గారు ముందు నీరు కట్టేవోరు" అన్నాడు సూరయ్య.

"ఏడిశావుపోరా. ఏమిట్రా నీవు చూచింది? మా తెలిసినోడులా చెప్పొచ్చావు. 'ఇదిగో వెంకట్రావు వీడు చెప్పినట్లు చేశావంటే వ్యవసాయం చేసినట్టే. శరీరం పెంచానని మదమెక్కి ప్రతిదానికి దెబ్బలాటకు దింపుతాడు. మొన్న మా గేదె చేలోకి వచ్చిందని పాలేరు కుర్రాణ్ణిపట్టుకొట్టన్నాడు. నిన్ను చూచి ఊరుకున్నాను గాని లేకపోతే అప్పుడే పొత్తేద్దును."

"నేను చూచింది, చేసింది చెబితే నామీద పడతారెందుకండీ" అన్నాడు సూరయ్య ఆరిపోయిన చుట్టను పారవేస్తూ.

"గొడవెందుకు మామా, మా దివాళ తడిసిపోతుంది. రేపు, ఎల్లుండి నీవు కట్టుకోవచ్చు" అన్నాడు వెంకట్రావు.

"అలాకాదు వెంకట్రావ్. ఎప్పుడూ జరిగేదేగా. ముందు రెండు రోజులూ నే కట్టుకున్న తర్వాత మీనాన్న కట్టేవాడు"

వెంకట్రావుకు ఏం చేయాలో తెలిసింది కాదు. సుబ్బన్న నీరు ఓపట్టాన కట్టుకోనిచ్చేటట్లు లేదు. కరణాన్ని కనుక్కొని నలుగురిచేత చెప్పించాలి అని కరణం దగ్గరకు బయలుదేరాడు. కరణం వయస్సులోకూడా పెద్దవాడు కావడం మూలాన్ని ఏగొడవైనా ఆయనదగ్గర పెడుతుంటారు. కోర్టులో ఎంత న్యాయం దొరుకుతుందో ఆయన దగ్గర అంత న్యాయమే దొరుకుతుంది. ఆయన అప్పుడే భోజనం చేసి చుట్ట చుట్టుకుంటూ అరుగుమీద మరం వేసుకుని కూర్చున్నాడు. వెంకట్రావు వచ్చిరావడంతోనే "ఏటిక్రింద చేను ముందు మాది తడాలా లేకపోతే సుబ్బన్నదా?" అని అడిగాడు.

"ఏం? ఏమైనా గొడవ వచ్చిందా? నువ్వు చిన్నవాడవు. అందులోనూ చదువుకున్నవాడివి. నీకు ఏమీ తెలియదు. అసలు సంగతేమిటి?" అన్నాడు.

"ఏటా మాదిముందు తడిసేదట కాదండీ! సుబ్బన్న కట్టుతూనన్ను కట్టనీయడం లేదు."

"ఎవరిది ముందు తడిస్తే మాత్రం ఒకరోజేగా తేడా. మీలో మీరే సర్దుకోవాలి. అనవసరంగా గొడవలు పెంచుకోకూడదు. సరే గాని చూడు, నా మామూలిచ్చావు గాదు. మీనాన్న ఎప్పుడూ ఇలా

చేయలేదు. నీ వైనా ఇవ్వవని కాదు. పొలంగొడవల్లో పడి మర్చిపోయావని జ్ఞాపకం చేస్తున్నాను!!

"తనువచ్చిన పని ఒకటైతే వీడొకటి ఏడుస్తాడేమిటి" అనుకుని మొన్న మీకు రెండువందల యాభైరూపాయలు పన్ను పంపితే నూట ఎనభై ఐదు కే రసీదిచ్చారేం ?" అన్నాడు.

"ఓసి పిచ్చోడా! నిన్ను అన్యాయం చేస్తాననుకున్నావేమిటి. గవర్నమెంటు పన్నుకు రసీదిచ్చాను. ఎస్టేటు పన్నుకు రసీదక్కర్లేదు. నిన్ను మళ్ళీ అడుగుతానా? మరి ఏటా మీ నాన్న ఇచ్చే ధాన్యం బస్తాయే కాకుండా ఏమైనా మినుములు కూడా సర్దాలి. కొందామంటే దొరక్కుండా ఉన్నయ్"

"గవర్నమెంటు పన్ను ఎస్టేటు పన్ను ఇంకా రెండు పన్నులున్నాయా. ఎస్టేటులు గంగలో కలసినా ఎస్టేటుపన్నులు అలా ఉండిపోయా" ఏమిటి అని అడుగుదామనుకుని, "ఛీ ఆ మాత్రం తెలియదు" అని కరణం అనుకుంటాడేమోనని వెళ్ళిపోయాడు. రాత్రి సూరయ్యతో ఆలోచన ప్రారంభించాడు. "రెండే రెండు తోవలండి. జబర్దస్తీగా సుబ్బన్నను తోసేసి కట్టాలి లేకపోతే ఆయన నీరిచ్చేదాకా ఉండాలి" అన్నాడు సూరయ్య. జబరదస్తీ అనడంతోనే వెంకట్రావుగుండె గుభేలుమంది. దెబ్బలాటంటే తనకు చాలభయం. అయినా పదిహేను పదెకరాలకూ నీర్ను ఇవాళ కాకపోతే రేపొస్తుంది. ఈ మాత్రం దానికి రైతులు ఖుర్రలెందుకు బ్రద్దలు కొట్టుకుంటారో అర్థం కాలేదు. పశువుల్లా దెబ్బలాడుకోవడం తనకిష్టంలేదు. అంచేత సుబ్బన్న నీరిచ్చేవరకు ఉండ నిశ్చయించుకున్నాడు.

"కరణం గోరికి ఒడ్లు బత్తా, మినువులు ఇత్తారన్నారంట కాదండీ" అంటూ వచ్చాడు కరణంతాలూకు మనిషి." కందులు కూడా ఏమైనా ఇయ్యమన్నారా"అన్నాడు. "ఇప్పుడేమిటిపో" అన్నాడు వెంకట్రావు. వాడు పోయాడు "ఈ మామూలేమిటి ఎప్పుడూ ఉందా సూరయ్యా?" అన్నాడు.

"ఇత్తే ఏడాది పొడిక్కీ అడుగుతాడు." అన్నాడు సూరయ్య.

ఏమయినా ఈ పొలం గొడవ స్థిరపడేదాకా కరణంతో మంచిగా ఉండాలని ఇవ్వడానికే నిశ్చయించుకున్నాడు. సూరయ్య వెళ్ళిపోయాడు.

సుబ్బన్న రెండు రోజులు అయింతర్వాత కూడా వెంకట్రావుకు నీరివ్వలేదు. పోనీలే అని మళ్ళీ వంతుకోసం కూర్చున్నాడు. పది రోజుల తర్వాత వచ్చిన మళ్ళీ వంతు నీరు కూడా సూరయ్యను దబాయించి తన చేనుకే మళ్ళించాడు.

"అదేమిటి మామా, నేనూ డ్చుకోవక్కర్లేదూ?" అన్నాడు వెంకట్రావు.

"కనపడ్డంలేదూ ఊడ్చిన చేను ఎండిపోతుంటే?" అన్నాడు సుబ్బన్న.

"అయితే నా చేను బీడుక్రింద ఉండిపోవలసిందే?"

"నాచేనే నామట్టిలో కలసి పోవల్సింది. ఇప్పుడు నీరు పెట్టకపోతే ఇది ఎందుకన్నా పనికొస్తుందా?"

"నీ చేనునిండా నీరుంటే ఎండి పోయిందంటావు ఎక్కడెండిపోయింది?"

"అది ఎండిపోవడం కాదూ ? అంతా తెలిసినోడు లాగ మాట్లాడుతావేం"

"మరి మాకు నీరు?"

"దానికి నేనా జబాబుదారీ ?"

వెంకట్రావు తన చేలోచెట్టుక్రిందకు పోయి కూర్చున్నాడు. చేనంతా కలయ చూచాడు. ఎండి బీటలు వారి ఉంది. "ఇప్పుడేం చేద్దాం సూరయ్యా ?" అన్నాడు.

"వందరూపాయలు మీవి కావనుకోండి"

"అంటే ?"

"అంటానికేముంది. ఓ పదిమందిని తీసుకొచ్చి సుబ్బన్నను తోసేసికట్టాలి."

దెబ్బలాటంటే వెంకట్రావు కిష్టంలేదు. తనో పదిమందిని తీసుకొస్తే సుబ్బన్నా పదిమందిని తీసుకొస్తాడు. వాళ్ళూ వీళ్ళూ కొట్టుకుచస్తారు. తనూ సుబ్బన్నా బాగానే ఉంటారు. పశువులకు గడ్డికి ఎలాగూ బీడు కొనాలి కాబట్టి ఈ సంవత్సరం దీనిలో మేస్తయ్ అని ఊరుకున్నాడు.

కాలం గడిచేకొద్దీ సుబ్బన్న చేను కలకల్లాడుతోంది. ఆదారిని పోయేవారందరూ "ఈ చేను చదువుకున్న రైతుది" అని నవ్వుకుంటున్నారు తన చేనుగురించి వెంకట్రావు ఊరుకున్నా ఊళ్ళోవాళ్లూరుకోలేదు. "తెలియనివాణ్ణి చేసి సుబ్బన్న బుకాయించా" డని కొందరూ, "సుబ్బన్నది వెధవబుద్ధి కాకపోతే ఏటా రెండు చేలూ తడవవం లేదూ" అని కొందరు, "చదువుకున్న వాడికి వ్యవసాయ మేమిట"ని కొందరూ, అందరూ అనేక విధాలగా చెప్పుకుంటున్నారు. వెంకట్రావు నలుగురులోనికి రాడానికి సిగ్గుపడుతున్నాడు. ఎక్కడ, ఎవరు ఎందుకు నవ్వినా తన అసమర్థతను చూసినవ్వుతున్నారనుకొనేవాడు. కొంతమంది ఎదురుగానే అన్నారు "లేకపోతే నీకు వ్యవసాయమేమిటి? వచ్చే ఏటికైనా కౌలుకిచ్చేయి. నీకు తెలియదు వ్యవసాయం చేయడం" అని. అందరకు మార్గదర్శి అయ్యేలా వ్యవసాయం చేద్దామనుకున్న తను అందరిముందు ఫూల్ అయ్యానేంటి చెప్మా అని ఆలోచించాడు. ఎక్కడ చూసినా తనకు తెలియదన్నమాటే. ఈ అవమానాన్ని సహించలేకపోయాడు. సుబ్బన్న జయించినాడిలా మీసాలు మెలేసుకుంటూ తిరుగుతున్నాడు. ఏమైనాసరే వచ్చే సంవత్సరమైనా తన తడాఖా చూపించాలనుకున్నాడు.

సంవత్సరం గిర్రున తిరిగిపోయింది. ఆకుమళ్లు పెరిగాయి, ఏటికి నీరువచ్చింది. రేపు వెంకట్రావు చేనుకు వంతు. ఆరాత్రి నలుగురు మాలవాళ్లతో మాట్లాడాడు. అందులో కండలు పెలితిరిగిన నాగడుతో మరీ జాగ్రత్తగా రహస్యంగా మాట్లాడాడు. వెంటనే సుబ్బన్నకు కబురంపాడు రేపు తను నీరు పెట్టుకుంటానని. వెంకట్రావు హడావుడి తెలుసుకున్న సుబ్బన్న తనూ పదిమందిని ఏర్పాటుచేశాడు. నాగడు సుబ్బన్నయింటి ముందునుండి తిట్టుకుంటూ పోతున్నాడు "వీడు వళ్లు తెగబలిసి లంజ...వీడి పని చెయ్యకపోతానా. నాచేతిలో పడకుండా పోతాడా" అని.

"ఎవఁరా నాగా" సుబ్బన్న అడిగాడు.

"అగిపెట్టి ఓసారిలా పడేయండి. సూరయ్యండీ ఎద్దు చేలోపడిందని మావోడిని చితకతన్నేసేడు" అని అగ్గిపెట్టె వెలిగించి చుట్ట కాల్చుకుంటున్నాడు "ఈకోపం మీద రేపు వీడు మనకు ఉపయోగపడతాడు" అనుకున్నాడు సుబ్బన్న.

"రేపు మనచేలోకి కూలికిరా. అవసరమైతే సూరయ్యను నాలుగు తాపులు తన్నాలి. ఇంకా వస్తారులే. ఈ అయిదు రూపాయలు ఉండనియ్యి"

"ఓ తప్పకుండా వత్తానండి. చూద్దురుగాని రేపు నామజా" అంటూ పోయాడు నాగడు.

(47-వ పేజీ చూడండి)

★ ఫ్రెంచి సినిమా పరిశ్రమ ★

ఫ్రెంచి సినిమా పరిశ్రమ కొన్ని విషయాలలో తెలుగు సినిమా పరిశ్రమలాగే ఉన్నట్టు కనిపిస్తుంది. ఇవాళ ఫ్రాన్సులో 250 మంది చిత్రనిర్మాతలకు పైగా ఉన్నారు. వీరిలో అత్యధిక సంఖ్యాకులు చిల్లర నిర్మాతలు. పదేళ్ళ క్రిందట ఫ్రాన్సులో ఏడాదికి సుమారు 50 చిత్రాలు తయారయేవి. ఫ్రాన్సులో హెచ్చుగా హాలీవుడ్ చిత్రాలు—ఫ్రెంచిభాషలోకి "డబ్" చేసినవి—ప్రదర్శించబడుతూ ఉండేవి. 1948 లో హాలీవుడ్ చిత్రాలపై ఆంక్షలు పెట్టిన మీదట ఫ్రెంచి చిత్రాల ఉత్పత్తి హెచ్చింది కిందటేడు ఫ్రాన్సులో 112 చిత్రాలు తయారయాయి.

అయితే మన తెలుగు చిత్రాలలాగే ఫ్రెంచి చిత్రాలలో చాలాభాగం తమ ఖర్చులు కూడా తాము రాబట్టలేవు. అందుచేత చిత్ర నిర్మాణానికి డబ్బు ఒకంతట పుట్టదు. బాంకులు అప్పివ్వవు. అందుచేత చిత్ర నిర్మాతలు వడ్డీ వ్యాపారస్తులకు హెచ్చు వడ్డీలు ఆశచూపి, దొంగవ్యాపారస్తులను ఆశ్రయించి చిత్రానికవసరమైన ధనం సేకరిస్తూ ఉంటారు. లోగడ చిత్రాలు తీసి ఉన్న నిర్మాతకు ఆ చిత్రాలపై రాబడినిబట్టి ఫిలిం నిధినుండి కొంత మొత్తం వస్తుంది. ఈ డబ్బుతో చిత్రనిర్మాత స్టూడియో ఖర్చులూ, నటుల వేతనాలూ గడుపుకుని చిత్రం విడుదల కాగానే తనకు రావలసిన డబ్బు తాను రాబట్టుకుని బయట పడతాడు. పెట్టుబడి చేసినవాళ్ళు తమ డబ్బుకోసం ఏళ్ల తరబడినోళ్లు తెరుచుకు కూచుంటారు.

ఇటువంటి పరిస్థితులలో చిత్రనిర్మాణ ఖర్చు సాధ్యమైనంత తక్కువగా ఉండేటట్టు చూడటం సహజంగా జరుగుతుంది. చిత్రాల నాణ్యత దెబ్బతింటుంది. అందుకనే ఖరీదైన చిత్రాలు తీసే ప్రసిద్ధ డైరెక్టర్లకిప్పుడు ఫ్రాన్సులో గిరాకీ లేదు.

వచ్చిన చిక్కేమంటే ఫ్రెంచి చిత్రాలపై వచ్చేడబ్బు ఫ్రాన్సులోనే రావాలి. ఫ్రెంచి చిత్రాల ఎగుమతి అతి స్వల్పం. దీనికి తోడు ఫ్రాన్సులో ఫ్రెంచి చిత్రాలపై ఆదరణ కూడా తగ్గుతున్నది. ఇంకొక చిక్కేమంటే ఫ్రెంచి సినిమా థియేటర్లలో ఏడాదికి 250 నుంచి 300 చిత్రాలవరకూ చూపే అవకాశం ఉన్నది. ఇందులో ఏడాదికి 121 అమెరికను చిత్రాలు ఫ్రాన్సులో విడుదల చేయటానికి ఒప్పందం ఉన్నది. ఇతర దేశాలనుంచి మరి 66 చిత్రాలు ఫ్రాన్సుకు ఏటా దిగుమతి అవుతాయి. అందుచేత ఏటా విడుదలకాగల ఫ్రెంచిచిత్రాల సంఖ్యబహు స్వల్పం. కిందటేడు తయారైన 112 ఫ్రెంచి చిత్రాలలో మూడోవంతు ఇంకా టిన్ను



భారత లక్ష్మీవారి 'ప్రియురాలు'లో సావిత్రి

అలోనే ఉండిపోయాయి.

యుద్ధానంతరం ఫ్రెంచి ప్రజలు హాలీవుడ్ చిత్రాలను తెగచూశారు గాని వారికిప్పుడా చిత్రాలమీద మోజుతగ్గింది. అసలే ఆర్థిక నాటకంగా ఉండటంవల్ల వారు ఏ చిత్రం పడితే ఆ చిత్రంచూసే ధోరణిలో లేరు. వారికి అమెరికన్ చిత్రాలలోని ఆర్భాటంకన్న వాస్తవికతపై అభిమానం హెచ్చు. అయితే సినిమా థియేటర్లవారు ప్రజల అభిరుచిని లక్ష్యపెట్టక స్వలాభం కొరకు వీలయినన్ని అమెరికన్ చిత్రాలు ప్రదర్శిస్తూ ఉంటారు. ఎందుచేతనంటే ఫ్రెంచిచిత్రాలు ప్రదర్శిస్తేవారికి రాబడిలో నూటికి 10 వంతులు మించిరాదు. అమెరికన్ చిత్రాలు ప్రదర్శిస్తే నూటికి 13 న్నరవంతులు లాభం ఉంటుంది. అదీ కాక అమెరికన్ చిత్ర నిర్మాతలు ఈ థియేటర్లకు ఉచితంగా పబ్లిసిటీ ఇస్తారు.

ప్రభుత్వ నిర్బంధాలు

ఫ్రెంచి సినిమా చిత్రాలకు వివిధదశలలో నిర్బంధాలున్నాయి. చిత్రం విడుదలకు గాను లైసెన్సు లివ్వటానికి ప్రభుత్వం ఏర్పాటుచేసిన కమిషన్- సెన్సార్ బోర్డ్ లాంటిది-ఉన్నది. చిత్రాల డిస్ట్రిబ్యూషను తాత్కాలికంగా గాని శాశ్వతంగా గాని నిలిపివేయవచ్చు. 1848లో జరిగిన ఫ్రెంచి విప్లవం శతవార్షికోత్సవ సందర్భాన ప్రభుత్వ ప్రేరణతోనే తయారు చేసిన డాక్యుమెంటరీచిత్రం సరిగా డిస్ట్రిబ్యూట్ కాకుండా అవాంతరాలు సృష్టి అయాయి. అమెరికాలోని నీగ్రో చిత్రవధలకు చెందిన చిత్రం "ఇంట్రూడర్ ఇన్ ది డస్ట్" పూర్తిగా నడవకముందే చిత్రంగా నిలిపివేయబడింది. "*Bataille pour la Vie,*" "*Vive les Dockers*", "*La Revolt des Vignerons*" మొదలైన చిత్రాలు ఎన్నో నిషేధించబడ్డాయి. బొగ్గు గనివారికి సంబంధించిన "*Le Point de Four*" అన్న చిత్రం తొలి విడుదలకు ప్రభుత్వం అనుమతించింది. కాని తరువాత అది నడవనేలేదు. ఫ్రెంచి చిత్రాల సెన్సార్ రాజకీయంగా ఉంటుంది గాని నైతికంగా ఉండదు.

ఈ నిర్బంధాలు కాక చిత్రం తాలూకు షూటింగ్ ప్రారంభించటానికి పూర్వమే స్క్రిప్ట్ సెన్సార్ జరుగుతుంది. స్క్రిప్ట్ ఆమోదించబడని పక్షంలో డబ్బుపెట్టుబడి చేసేవాడూ, చిత్రనిర్మాతా, స్టూడియో వాళ్ళూకూడా జారుకుంటారు. ఈవిధంగా భ్రూణహత్య పాలైన చిత్రాలను గురించి



'జీవితనౌక' చిత్రంలో బి. ఎస్. సరోజ

పైకి పొక్కదు. ఇటీవలనే ఈ విధంగా చంపబడ్డ చిత్రం "*L'Affaire Seznec*" అన్నది. సెజ్నెక్ అన్నవాడు 27 ఏళ్ళశిక్ష అనుభవించి ఇటీవల విడుదల అయినాడు. ఇతను అకారణంగా ఖైదు చేయబడ్డాడని ఫ్రాన్సు అంతటా పొక్కి అతని విడుదలకు చాలా ఆందోళన జరిగింది. కమిటీలుకూడా ఏర్పాటయాయి. అతన్ని నిర్దోషినిగా చిత్రిస్తూ చిత్రం తయారు చేద్దామన్న యత్నం భ్రూణ హత్యకు గురి అయింది. ఆచిత్రం తీయటం ప్రజాక్షేమానికి మంచిది కాదని న్యాయశాఖవారు అనేసరికి పెట్టుబడిదార్లు జారుకున్నారు. యుద్ధంలో చేర నిరాకరించే వారిని గురించి తీయతలపెట్టిన మరొక చిత్రానికి కూడా ఇదేగతి పట్టింది.


దీనిఫలితంగా ఫ్రెంచి సినిమా ప్రపంచంలో అందరికీ "హెచ్చరిక" జాస్తిగా ఉంటున్నది. "సాంఘిక" చిత్రం అనగానే భయపడితారు. గత యుద్ధంలోని ఫ్రెంచి ప్రతిఘటన గురించిగాని, ప్రస్తుత గృహ పరిస్థితినిగురించిగాని వాస్తవికమైన డాక్యుమెంటరీ తీయడానికి ఎవరూ సాహసించ లేరు. ఫ్రెంచి యువకుల మనస్థితిని గురించి చిత్రించటానికి ఎవరూ ప్రయత్నించటం లేదు.

ఫ్రెంచి చిత్రాల పతనానికి ఈపిరికితనమే ప్రధానకారణం. ఇది మరికొంతకాలం సాగినట్లయితే తిరిగి హాలీవుడ్ చిత్రాల దండయాత్ర సాగితీరుతుంది.

హాలీవుడ్ చిత్రాల దండయాత్ర

1946లో ఈ దండయాత్ర ప్రారంభ

(48-వ పేజీ చూడండి)



చీఫ్ ఎగ్జిక్యూటివ్: జె. ఎమ్. శర్మ

సీడెడ్ అండ్ చిత్తూరు: మహాత్మా పిక్చర్సు - కర్నూలు. * ఆంధ్రా: గోకులకృష్ణ పిక్చర్సు - విజయవాడ.
మైసూరు: నారాయణన్ & కంపెనీ - మద్రాసు. * నైజాం & బొంబాయి: చమేరియాటాకీ డిస్ట్రిబ్యూటర్సు.
సీట: అవర్ ఇండియా ఫిలిమ్స్, 19-ఇ, ఏకాంబరేశ్వర అగ్రహారం, మద్రాసు.

ఇతర ప్రాంతాలకు:

ప్రకాష్ శంకర్ పిక్చర్సు, 3-ఏ, లక్ష్మణచెట్టియార్ వీధి, మద్రాసు-17.



శ్రీనివాస ఫాంటసీజ్ వారి "కన్నీరు" చిత్రంలో నటిస్తున్న రాజ్యం

హిందూకోడ్ బిల్లు

(4-వ పేజీ తరువాయి)

లలో, వివిధ కులాలలో అనుసరించబడుతున్న ఆచారాలు ప్రస్తుత శాసనవిధానానికి విరుద్ధంగా ఉన్నట్లయితే, ఆ ఆచారాలకంటె శాసనాన్నే ప్రధానంగా పరిగణించి అనుసరించాలని విధించబడుతున్నది.

వివాహాలు రెండు తరగతులుగా విభజింపబడినాయి. 1. ఆచారసిద్ధ వివాహాలు. 2 సివిల్ మేరేజెస్ లేక రిజిస్టర్డ్ మేరేజెస్. వీలునుబట్టి, అవసరాన్నిబట్టి ఆయా రాష్ట్రప్రభుత్వాలు ఆచారసిద్ధ వివాహాలను కూడా రిజిస్టర్ చేసే ఏర్పాట్లు చేయాలని విధించబడుతుంది. నిర్బంధంగా రిజిస్టర్ చెయ్యాలో, లేక ఆచారసిద్ధ వివాహాలను రిజిస్టర్ చెయ్య నవసరం ఉండదో రాష్ట్రప్రభుత్వాలే నిర్ణయిస్తాయి. నిర్బంధంగా రిజిస్టరు చెయ్యాలని రాష్ట్రప్రభుత్వాలు విధించినచోట, అలా రిజిస్టర్ చేసుకోనివారికి నూరురూపాయలు జరిమానా విధించాలని ప్రస్తుత శాసనం నిర్ణయించింది.

వివాహసంబంధాలలో సివిల్ మేరేజెస్ నిమిత్తం అన్నచెల్లెళ్ల మధ్యనూ, అన్నదమ్ముల బిడ్డలమధ్యనూ, అక్కచెల్లెళ్ల బిడ్డల మధ్యనూ పినతల్లి అక్కకొడుకుల మధ్యనూ, పినతండ్రి అన్నకూతుళ్ల మధ్యనూ పెళ్లిళ్లు నిషేధించబడినాయి. ఆచారసిద్ధ వివాహాల నిమిత్తం పై సంబంధాలు కాక తండ్రివల్ల పైన అయిదుతరాలు, తల్లివల్ల పైన మూడు తరాలలో సపిండబాంధవ్యాలు కూడా నిషేధించబడినాయి. ఇతరత్రా సగోత్రవివాహాలు సక్రమమైనవని పరిగణించబడతాయి.

ఈ శాసనం స్పష్టంగా బహుభార్యలను వివాహం చేసుకునే ఆచారాన్ని నిషేధిస్తుంది. ఒక భార్య ఉండగా మరొక భార్యను వివాహం చేసుకునేవారికి ఇండియన్ పీనల్ కోడ్ 494 వ సెక్షన్ ప్రకారం ఏడేళ్లు కారాగారవాసశిక్ష విధించబడుతోంది. అయితే ఈ శాసనం అమలు జరగక ముందు జరిగిన వివాహాలను రద్దుచెయ్యరు. అమలు జరిగిన తరవాత చేసుకున్నట్లయితే రెండో వివాహం దానంతటదే రద్దవుతోంది. పైన చెప్పబడిన వరుసలను తప్పి చేసిన వివాహాలు కూడా వాటంతటవే రద్దయినట్లు పరిగణించబడతాయి.

ఆచారసిద్ధ వివాహంలో వరునికి పద్దెనిమిదేళ్లు వధువుకు పధ్నాలుగేళ్లు నిండక ముందు వివాహం జరిగినట్లయితే, వయస్సు నిండిన తరవాత వారిద్దరిలో ఎవరికి వివాహంపట్ల అభ్యంతరం ఉన్నా వారు కోర్టులో దావా తెచ్చి వివాహాన్ని రద్దు చేసుకోవచ్చును.

వివాహ విచ్ఛేదం విషయంలో కులాచారాలను పాటించకుండా కోర్టు డిక్రీలు పొందవలసిన అవసరం ఈ శాసనంవల్ల కలుగుతుంది. ఏయే పరిస్థితులలో వివాహ విచ్ఛేదాలకు కోర్టులు అనుమతించవచ్చునో వివరించబడింది.

ఈ నియమంవల్ల అనేక కులాల వారికి చిక్కులు కలగవచ్చును. ఇంతవరకూ సులువుగా విడాకు లిచ్చుకుని, మారుమనువులు చేసుకుంటున్న కులాలవారు ఈ శాసనం ప్రకారం కోర్టు డిక్రీలను పొందవలసిన అగత్యం కలుగుతుంది. కోర్టు నిర్ణయాలు నిర్బంధమైతే ధనం కలవారు మాత్రమే విడాకులు తెచ్చుకోగల పరిస్థితి రావచ్చును. వివాహ విచ్ఛేదపు డిక్రీలను కింది కోర్టు లిచ్చినా హైకోర్టు ఆమోదించవలసి ఉంటుంది.

భార్యాభర్తలలో ఎవరికి మతిస్థిరంతప్పినా, రెండోవారు వివాహవిచ్ఛేదం పొందవచ్చును. కుష్టు వంటి అంటువ్యాధులు, వ్యభిచారం, మతపరివర్తన వివాహవిచ్ఛేదానికి సక్రమమైన హేతువులుగా న్యాయస్థానాలు పరిగణిస్తాయి. భార్యాభర్తలలో ఏ ఒకరు మరొకరిని రెండేళ్లు విడిచిపెట్టినా, ఒకరిపట్ల మరొకరు క్రూరంగా ప్రవర్తించినా వివాహం విచ్ఛేదంచేసుకునే అవకాశం ఇవ్వబడుతుంది. వేరే జీవనాధారం లేని స్త్రీ వివాహం విచ్ఛేదమైనప్పుడు, తిరిగి ఆమె పునర్వివాహం చేసుకునేవరకూ ఆమెకు భర్త తన ఆర్జనలో అయిదోవంతుకు మించకుండా జీవనభృతి

ఇవ్వవలసి ఉంటుంది. విడాకులిచ్చినచోట బిడ్డలు ఎవరి అధీనంలో ఉండాలో, బిడ్డల అభీష్టాన్ని బట్టి కోర్టు నిర్ణయిస్తుంది. వివాహ విచ్ఛేదన అనంతరం ఆరు మాసాల తరవాతనే స్త్రీ పురుషులు పునర్వివాహం చేసుకోవాలి.

ఒక భార్య ఉండగా పురుషుడు మరొక స్త్రీని వివాహం చేసుకోరాదనే నియమం పట్లనూ, ఆచార సిద్ధ నియమాలకంటె ప్రస్తుత శాసన నియమాలే ప్రధానంగా పరిగణించాలనే నిర్ణయంపట్లనూ పార్లమెంటులో తీవ్ర విమర్శలు వచ్చాయి. అయితే ఏకపత్నీవ్రత నియమం అనుసరణీయం కాదని ఎవరూ అనలేదు. ఈ శాసనం మహమ్మదీయులకు కూడా అనువర్తింపచేస్తేనే హిందువులకు అనువర్తింప చెయ్యనీయాలని డా॥ ముఖర్జీ, గోవిందమాలవ్యా మొదలైనవారు వాదించారు. ఈ శాసనం మతవిచక్షణకు ఆధారమౌతున్నదనీ, కులాచారాల అనుసరణ స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్నదనీ వీరు వాదించారు. ఈ రెండూ రాజ్యాంగ నిబంధనలలో కులమత విచక్షణలను నిషేధించే నిబంధనకు వ్యతిరిక్తంగా ఉన్నదన్నారు. కాని సర్వజనులూ పొందదగిన సౌకర్యాలను ఏ కులంవారికీ ఏ మతంవారికీ నిరాకరించరాదని మాత్రమే రాజ్యాంగం విధిస్తున్నది కాని, ప్రత్యేక మతాలవారికి లేక ప్రత్యేక కులాలవారికి ప్రత్యేక సౌకర్యాలను ఏర్పాటుచెయ్యడాన్ని రాజ్యాంగం నిషేధించదు. హిందూ వని తలకు సమాజ జీవనంలో ఏర్పడిన ఒక ప్రతిబంధకాన్ని తొలగించడం రాజ్యాంగ నియమాలకు విరుద్ధం కాదు. ★

గ్రంధ సమీక్ష

"ది జూగైడ్" (ఇంగ్లీషు)

మద్రాసు కార్పొరేషన్ వారి ప్రచురణ. వెల : 1-0-0

మద్రాసులో కార్పొరేషనువారు నడుపుతున్న జంతుప్రదర్శనశాలను గూర్చి ఈ పుస్తకంలో సమగ్రమైన వివరాలివ్వబడ్డాయి. శాలలో గల వివిధ విచిత్ర జంతువులు, పక్షులు, వాటి తెలుగు, తమిళ, హిందీ పేర్లు, అవి పరుగెత్తే వేగం, జీవించే కాలం, గర్భధారణ కాలం మొదలైన వివరాలు ఇవ్వబడ్డాయి. ఆయా జంతువుల ఫొటోలు, ప్రదర్శనశాలలోని వివిధ దృశ్యాలను చూపే ఫొటోలు చక్కని గ్లేజ్ పేపరు మీద ముద్రింపబడినాయి. ప్రదర్శనశాలను చూడవచ్చే వారికే కాకుండా, వింత జంతువులనుగూర్చిన సమాచారం తెలుసుకోగోరే వారికి కూడా ఈ పుస్తకం ఉపయోగకరమైనది. త్వరలో తెలుగులో కూడా ఈ పుస్తకం వెలువడుతుందని తెలుస్తున్నది.

అల్లాద్దీన్ (బొమ్మల కథ)

చిత్రకారుడు, రచయిత: బుజ్జాయి; వెల: 0-6-0; ప్రతులకు: బుజ్జాయి పబ్లికేషన్సు, 38, హబీబుల్లా రోడ్డు, మద్రాసు - 17.

'అరేబియన్ నైట్స్'లోని అల్లాద్దీన్ మాజిక్ లాంతరు కథను బుజ్జాయిగారు చక్కని బొమ్మలలో చిత్రించారు. ప్రతి బొమ్మకు అడుగున కథకూడా వుంటుంది. బాల బాలికలందరూ కొని, చూసి, చదివి ఆనందించవలసిన పుస్తకం.

గ్రంథస్వీకారము.

సింహగడము (నాటకము) :— రచయిత: సురభి నరసింహము, బి. ఏ., బి. ఇడి.; వెల: 2-8-0; ప్రతులకు: అరుణాశ్రమమ్, నాదకూడూరు, కాకినాడ తాలూకా, తూ. గో. జిల్లా. ★

పత్రికా శాసనం

పార్లమెంటులో శ్రీ రాజగోపాలాచారిగారు ప్రవేశపెట్టిన పత్రికాశాసనం గురించి "నేషనల్ హెరాల్డ్" (లక్నో) సంపాదకీయంలో ఇలా వ్రాసింది.

"ఈ శాసనంలో నీతిసూత్రాల ననువర్తింపచేసే సద్గుణం ఉన్నదని వారు (రాజగోపాలాచారిగారు) అన్నారు. కాని సమాజస్థితి దృష్ట్యా గమనిస్తే, దీనిలో విధించబడిన ప్రతిబంధకాలు ప్రమాదభరితమైనవి. ప్రస్తుత భారతదేశ పరిస్థితులలో ఈ శాసనం స్వాతంత్ర్యాన్ని నిరోధించడంతో పోదు. దేశానికి అవసరమైన సామాజిక, ఆర్థిక పరివర్తనలను తేనీయకుండా నిరోధించగలదు కూడా. శాసనబద్ధ ప్రతికూల రాజకీయోద్యమాలను హింసాత్మక చర్యలనుగా ఇదిపరిగణిస్తోంది. ఈ శాసనంవల్ల లభించే, న్యాయస్థాన నిర్ణయావకాశాలు, ప్రభుత్వ జోక్యంవల్లనూ, ప్రభుత్వాధికారంవల్లనూ నిరుపయోగమౌతాయి. వ్యక్తులపై జరగగల నేరాలను ప్రభుత్వంపై జరిపే నేరాలుగా పరిగణిస్తుంది.

"పత్రికా ప్రపంచానికి ఎంత బలమున్నదని ఊహిస్తున్నారో అదే నిజంగా ఉన్నట్లయితే, ప్రస్తుత శాసనాన్ని ఇప్పుడనుకున్నట్లే అమలు జరిపినట్లయితే, ఈ శాసనం కమ్యూనిజాన్ని నిరోధించవచ్చునేమో కాని ఫాసిజాన్ని నిరోధించలేదు. అరాచకాన్ని నిరోధించవచ్చును కాని నియంతృత్వాన్ని నిరోధించలేదు. వ్రాతలలో దూష్యాలు రాకపోవచ్చును కాని ప్రజలలోనూ, నాయకులలోనూ దూష్య ప్రవర్తనను నిరోధించలేదు. వర్గసంఘర్షణను నిరోధించవచ్చును కాని ఒక వర్గం మరొకవర్గాన్ని పీడించడాన్ని నిరోధించలేదు. ఆహారం కోసం దొమ్మీలనూ దోపిళ్లనూ నిరోధించవచ్చునుగాని, బ్లాక్ మార్కెటింగ్‌ని నిరోధించలేదు."

కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో

(7-వ పేజీ తరువాయి)

"హెర్మినా డాంగ్లర్‌కి స్పృహతప్పింది" అన్నాడు విల్ ఫర్ట్. "ఈమె నింక ఇంటికి తీసుకుపోవడం మంచిది."

"అయ్యొ నా ఔషధం మరిచిపోయానే!" అన్నాడు మాంట్ క్రిస్టో.

"నాదగ్గ రొకటుంది" అంది హీలాయ్‌విల్ ఫర్ట్. ఎర్రని ద్రావకంగల చిన్న సీసా ఒకటి తీసి మాంట్ క్రిస్టోకి అందించింది. "మీసలహా ప్రకారం దీన్ని వాడిచూశాను. చక్కగా పని చేస్తుంది" అంది.

ఒక్కచుక్క పెదవిపై పడ్డంతో హెర్మినాకు స్పృహ వచ్చింది "అబ్బ! ఎంత దుస్స్వప్నం!" అంది.

హెర్మినా దుస్థితికి మాంట్ క్రిస్టో విచారం ప్రకటించాడు. మెల్లిగా ఆమె చెయ్యిపట్టుకుని మేడదింపి తోటలోకి తీసుకు వెళ్లాడు. మిగిలినవా రందరూ అతని ననుసరించి తోటలో చేరారు.

"మిమ్మల్ని నిజంగా భయపెట్టానా?" అన్నాడు మాంట్ క్రిస్టో.

"లేదండి. కాని మీకు ఊహలైనవి మాకు కావు. మా మన స్థితి వేరు."

"కాని నిజంగా ఈ యింటిలో ఘోర నేరం జరిగిందని నా నమ్మకం."

"జాగ్రత్త" అంది హీలాయ్. "న్యాయాధికారి ఇక్కడే ఉన్నారు."

"అందుకోసమే ఈ సంగతి స్పష్టంగా చెప్పాలి" అన్నాడు మాంట్ క్రిస్టో.

"నేరం జరిగిఉంటే, దాన్ని పరిశోధన చేద్దాం" అన్నాడు చాతో-రీనా.

"నేరం తప్పకుండా జరిగింది" అన్నాడు మాంట్ క్రిస్టో. "ఇటు రండి. మీరుకూడా రండి విల్ ఫర్ట్."

ఒకచేత్తో విల్ ఫర్ట్ చేతినీ రెండోచేత్తో హెర్మినాచేతినీ పట్టుకుని మాంట్ క్రిస్టో నడిపించుకుని ఒక అరటిచెట్టునీడకు తీసుకువెళ్లాడు. అతిథు లందరూ వారి ననుసరించారు.

"ఇక్కడే" అన్నాడు మాంట్ క్రిస్టో. "ఇక్కడే ఒక నౌకరు నేల తవ్వుతుండగా చిన్న ఇనుపరేకులపెట్టె ఒకటి తగిలింది. అది తెరిచి చూసేసరికి అందులో పసిబిడ్డ అస్థిపంజరం ఒకటి కన పడింది."

హెర్మినా చెయ్యి బిగుసుకుపోయింది. విల్ ఫర్ట్ చెయ్యి వొణికింది.

"పసిబిడ్డ అస్థిపంజరమా! ఘోరం" అన్నాడు డిబ్రే.

"మీ దేశంలో శిసుహత్యకి శిక్షేమిటి?" అన్నాడు మేజర్ కావల్కాంటీ.

"ఏముంది? తలే తీసేస్తారు" అన్నాడు డాంగ్లర్.

"అంతే ననుకుంటాను. ఏమంటారు విల్ ఫర్ట్?" అన్నాడు మాంట్ క్రిస్టో:

"అంతేనండి" అన్నాడు విల్ ఫర్ట్. కాని అతని స్వరం గుర్తుపట్టడానికి కూడా వీలులేనంతగా మారిపోయింది.

ఈ దృశ్యాన్ని ఎవరికోసం తానేర్పాటుచేశాడో, వారింక భరించలేరని మాంట్ క్రిస్టో కనిపెట్టాడు. ఇంక తెగేవరకూ తాను లాగకూడదనుకున్నాడు. "ఇంక కాఫీతీసుకుందాం రండి. ఈ ఘోరవృత్తాంతాన్ని మరిచిపొండి" అన్నాడు.

"నిజంగా మీ కథలవల్ల నామనస్సు కలతపడిపోయింది కౌంట్" అంది హెర్మినా మాంట్ క్రిస్టోతో "నేనింక నిలబడ లేను. కూర్చుంటాను." మాంట్ క్రిస్టో ఆమె నక్కడ విడిచిపెట్టి హీలాయ్ విల్ ఫర్ట్‌ను సమీపించాడు.

"మళ్లీ మీమందు హెర్మినా డాంగ్లర్‌కు అవసరం కలిగే టట్లుంది. ఇవ్వండి" అన్నాడు. ఈలోగా విల్ ఫర్ట్ హెర్మినాను సమీపించి రహస్యంగా "నేను నీతో మాట్లాడాలి" అన్నాడు.

"ఎప్పుడు?"

"రేపు."

"ఎక్కడ?"

"నా ఇంటిలో కాని, న్యాయస్థానంలో నాగదిలోకాని"

"వస్తాను."

ఇద్దరూ గుసగుసలాడ్డం మాంట్ క్రిస్టో గమనించాడు. కాని గమనించనట్లే తిరిగి హెర్మినావద్దకు వచ్చాడు.

"ఇంక మందక్కరలేదండి" అంది హెర్మినా. "పూర్తిగా తేరుకున్నాను." ★

ఇద్దరు మిత్రులు సినిమాచూస్తున్నారు. ఒకడన్నాడు:

"ఈమధ్య సినిమాలు బాగా అభివృద్ధి పొందాయోయ్."

"ఎందుచేత?"

"అహ, పూర్వం సైలెంటు సినిమాలుండేవి. ఆ తరవాత మాట్లాడే సినిమాలువచ్చాయి. ఇప్పుడు ఈసినిమా వాసనకూడా కొడుతోంది."

కుశాగ్రబుద్ధి

(32-వ పేజీ తరువాయి)

పోయింది. తనఉపదేశాలు ఫలించి నందుకు సంతోషించింది.

సుశర్మ ఎంత కోప్పడినా వృద్ధులగుటవల్ల చేతిలో మూకుడు బాగా వణుకుతున్నది. ఇది అదనుగా తీసుకొని సుశర్మ యిలా అనడం ప్రారంభించాడు.

"మీరు చేతులు వణికిస్తూ ఆ మూకుడు పగలగొడితే మళ్లా మళ్లా ఎవరు కొంటారు? యిదిమీతో సరా?" అని తన తల్లిదండ్రులను వెనుకకు తిరిగిచూచి "ఈమూకుడులోనే మళ్లా నా తల్లి దండ్రులకు గంజిపోయాలి. యిది పగిలిందా మీకు గంజి రాదుసరికదా, మీ తరువాత మీకొడుకు, కోడళ్లకు కూడ గంజిలేకుండా చేసినవారవుతారు. జాగ్రత్త:"

అని అనేసి చరచరా యింట్లోకి వెళ్లిపోయాడు. తమ కుమారుడు అన్నమాటలువిని తాము వృద్ధ దంపతులను ఏ విధంగా బాధిస్తున్నది. వారే విధంగా బాధపడుతున్నది గ్రహించుకుని రామశర్మ, అతని భార్య పశ్చాత్తాపపడ్డారు. మర్నాటినుంచి, వారిని లోపలకుతీసుకువచ్చి భక్తిశ్రద్ధలతో వారికేలోపం జరగకుండా చూస్తుండేవారు. సుశర్మ ఆనందానికి మేరలేదు. సుశర్మయుక్తివల్ల తమకష్టాలు గట్టెక్కినాయని వృద్ధ దంపతులకు కూడా సుశర్మ అంటే ప్రేమాభిమానాలు కలిగి కుటుంబమంతా సుఖంగా ఉన్నారు. ★

పజిల్ నెం. 1 గ్యారంటీ బహుమతులు -

ముగింపు తేది 13-10-51 కీ సొల్యూషను 24-10-51 ఆంధ్ర వారపత్రికలో

గెల్వండి రు 1,000

మొదటి బహుమతి రూ 500 (ఆల్ కరెక్టు)
రెండవ బహుమతి రూ 300 (ఒక తప్పుకు)
మూడవ బహుమతి రూ 200 (రెండు తప్పులకు)

రూపాయికి 8 ఎంట్రీలు చొప్పున ఎన్ని ఎంట్రీలైనను పంపవచ్చును.

— నిలువు —

1 అడవి పావురము
2 శివ క్షేత్రము
4. పెద్దలు వచ్చినప్పుడు దీనిని ఏర్పాటు చేసెదరు.
7. సంపెంగచెట్టు
8. బలరాముడు
9. పెద్దవారు స్వర్గస్థులైనప్పుడు వారికి శాంతి కలుగుగాకఅని ఆశీర్వదించెదరు.
10. నిద్ర
12 మైలవన్నెఆవు
13 మూడు రూపాయల ఎత్తుగల తూనికరాయి
15. విధి (యథాతథము)
16 ఆకాశము
17. సత్పురుషుడు మాట్లాడునది
18. అపకీర్తి
19. నీటిపై ప్రయాణమునకు ఉపయోగించునది

— అడ్డము —

1. కుబేరుడు
3. ఆహారము
5. బిక్షమెత్తుకొని జీవించు విషభక్షుడు
6. ఇది దేవునికి ఇచ్చెదరు
7. ఇంద్రజాలము తెలిసినవారి దగ్గర ఇది తప్పక ఉండును
8. నీరు తోడు తొట్టిదోనె
11. బుద్ధి
12. ఒట్టు
14. బలము (యథాతథము)
15. గాలిలో ఎగురునది
17. పుణ్య కార్యముల గురించి ఇది వసూలు చేసెదరు
20. పిల్లలకు చాల ఇష్టము
21. నీరు
22 వక్రము (కలగలుపు)

1 గు	వ్యా	2 కే	శ్వ	రు	డు	■	3	4	ము
	■	5 దా		రి	■	■	■	భ	■
■	6		తి	■	7 క		టి	■	■
8		ము	■	9 శ		■	■	■	10 శ
11 మ		■	■			■	■	■	
	■	12 శ	13		ము	■	■	■	
	■	14		ము		15 వి		16	ము
డు	■		ము	■	17		■	గ	■
■	18 ఖ	■	■	■		■	■		19
20 అ		■	21		ము	■	22	ము	

నిబంధనలు : ఎన్ని ఎంట్రీలైనా తెల్లకాగితముమీద వ్రాసి పంపవచ్చును ముగింపు తేదీనాటికి మా ఆఫీసుకు ఎంట్రీలు చేరవలయును. ఆ తరువాత వచ్చు ఎంట్రీలు అంగీకరించబడవు. కూపనులతో బాటు, మనియార్డరు రశీదుగాని క్రాసుచేయని ఇండియన్ పోష్టల్ ఆర్డరుగాని జతచేసి పంపవలెను. ఈ పజిల్ తాలూకు గెలిచినవారి లిస్టు కావలసినయెడల ఎంట్రీలతోపాటు 0-4-0 స్టాంపులు పంపిన 16-10-51 కి పంపబడును ఎడిటరుదే అన్ని విషయములలోను తీర్పు ఖాయము. పోటీ విషయములో వుత్తర ప్రత్యుత్తరములు జరుపబడవు.

LAXMI CROSS WORDS (Regd)
VIJAYAWADA-2

చదువుకున్న రైతు

(38 వ పేజీ తరువాయి)

వెంకట్రావు మర్నాడు ఉదయమే బయలుదేరాడు పొలానికి సూరయ్యను, నలుగురు కూలివాళ్లను తీసుకుని. రైతులు నీరుకట్టేచోట ఎందుకు బుర్రలు బద్దలు కొట్టుకుంటారో కొంచెం కొంచెం అర్థమవుతోంది అతనికి. అతడు ఇప్పుడనుకున్న పని పూర్తికాకపోతే అంతవరకూ వెళ్ళక తప్పదనుకున్నాడు. వెంకట్రావు వెళ్లేటప్పటికప్పుడే సుబ్బన్న తన చేనుకు నీరు కడుతున్నాడు. సూరయ్యను తన చేను దగ్గర గట్టు వేయమన్నాడు. సూరయ్య గట్టు వేయడం మొదలు పెట్టాడు. "మళ్ళీ ఇదేంపని" అంటూ సుబ్బన్న వచ్చాడు. అతని వెనకాల పదిమంది కూలాళ్లూ వచ్చారు. పదిమందిలో నాగడూ ఉన్నాడు. "నిరుడు నీవు కట్టుకున్నావు కదూ" అన్నాడు వెంకట్రావు.

"ముందు మాది తడవాలి. గట్టు తీసేయ్ సూరయ్యా"

"గట్టు మాత్రం తీయకు" అన్నాడు వెంకట్రావు.

"రెండు పడేసి గట్టు తీయండ్రా" అన్నాడు సుబ్బన్న.

"అడుగు ముందుకేశారా జాగ్రత్త. ఇదిగో" అంటూ పిస్తలుతీసి గాలిలోకి ఓసారి ప్రేలించాడు.

"వెళ్ళండ్రా ఏ మాత్రం పేలిస్తాడో చూద్దాం" అన్నాడు సుబ్బన్న. ఎవరికీ ధైర్యం చాల్లేదు. నాగడు మాత్రం కర్రెత్తి ముందుకు వచ్చాడు సూరయ్యను కొట్టడానికి. నాగడికి గురి చూచి పేలించాడు వెంకట్రావు. "బాబోయ్ చంపాడు" అంటూ పొట్టమీద చేయి వేసుకుని ముందుకు పడిపోయాడు. మిగతా వాళ్ళు బికబికలై పారిపోయారు. సుబ్బన్న యింటికి వచ్చిందాకా పరుగు విడువలేదు. కరణానికి ఐదు వందల రూపాయలిచ్చి పోలీసులకోసం కబురంపమన్నాడు. నాగడి శవాన్నెత్తుకుని వెంకట్రావు మనుష్యులు మాయమయ్యారు. ఈ సంగతి అప్పుడే ఊరంతా తెలిసిపోయింది. పోలీసులు వచ్చి వంకట్రావును తీసుకెళ్లి ఉరి తీస్తారని గోలపుట్టింది.

వెంకట్రావు ఇంటికి వచ్చాడు. అతన్ని చూచి కొంతమంది పారిపోయారు. నాగడి శవాన్ని వెంకట్రావు తన యింటికి పట్టించుకుని వెళ్లినట్లు ఎలాకనిపెట్టాడో సుబ్బన్న కనిపెట్టాడు. ఆసంగతి కరణానికి చెప్పాడు. "అయితే మరీమంచిది" అన్నాడు కరణం.

నాగడి పెళ్ళాం వెంకట్రావు ఇంటిముందు నిలబడి నోరూ నెత్తి బాదుకుంటూ ఏడుస్తోంది. పొలాల్లో ఉన్నవాళ్ళు కూడా ఇళ్ళకు పరుగెత్తుకు వచ్చారు ఏం జరుగుతుందో చూద్దామని. సుబ్బన్న గుండెలు ఇంకా కొట్టుకొంటూనే ఉన్నాయి.

ఒక గంటకు ఇరవైమంది పోలీసులతో సబిన్స్పెక్టరూ, సర్కిలూ వచ్చారు. కరణంగారు అన్నీ చెప్పారు. చంపబడ్డమనిషి పేరు, చంపిన మనిషిపేరూ, చంపినమనిషి ఇల్లూ, అన్నీ సాధ్యమైనంత విపులంగా చెప్పారు. కరణానికి మాట్లాడ్డానికి జడుపు పుట్టింది. సమయానికి మునసబు ఊళ్ళో లేనందుకు తిట్టుకున్నాడు. అప్పుడే పోలీసులు వెంకట్రావు ఇంటిచుట్టూ గస్తీ తిరుగుతున్నారు. సబిన్స్పెక్టరూ, సర్కిలూ, నలుగురు పోలీసులూ చేతిలో రివాల్వర్లు పెట్టుకుని లోపల ప్రవేశించారు.

వెంకట్రావును సంకెళ్లువేసి తీసుకెళ్లేటప్పుడు ఎలాగుంటాడో నవ్వుతుంటాడో, ఏడుస్తుంటాడో చూడ్డానికి ఊరంతా ఆ వీధిలో అరుగులమీదకు జేరింది. ఎవరిమట్టుకు వారికే కంగారుగా ఉంది. కొంతిమంది కుర్రాళ్ళు పోలీసులను చూచి భయపడి సంగతేమిటో అని చాటునుండి తొంగిచూస్తున్నారు. రైతులు పాలేర్లను పొలం పొమ్మంటున్నారు. "ఇదేం గొడవరా బాబూ" అనుకుంటూ వాళ్లు చాటునుండి తొంగిచూస్తున్నారు. "ఒరే! మీరేం చూస్తార్రా ఇక్కడ పొండి" అని కరణంగారు కుర్రగూకను అదమాయించారు. కుర్రాళ్ళు ప్రతీవాడూ కారుమీద ఓసారి చేయి వేసి చూస్తున్నారు ఎలాగుంటుందోనని.

సుబ్బన్న నవ్వుతూ మీసం మెలివేస్తూ మరం. వేసుకు కూర్చున్నాడు అరుగుమీద. "అయితే కరణంగారూ వెంకట్రావును ఉరి తీసేస్తారా?" అని అడిగాడు ఓ రైతు. "ఇంకా అనుమానమేమిటి? మనిషిని చంపితే ఉరితీయరూ" అన్నాడు కరణం గంభీరంగా. "అయ్యో పాపం తండ్రిపోయి సంవత్సరమయిందంతే. అప్పుడే ఇలా రావాలా ఇది" అని సానుభూతి చూపించాడో రైతు.

పావుగంటయినా లోపల ఏం జరిగేదీ తెలియాక పోయేసరికి అందరకు ఆత్రుత ఎక్కువయింది. సుబ్బన్న మరీ ఇదవుతున్నాడు. కొంపతీసి ఎక్కడికన్నా పారిపోయేడేమో నని అనుమానం కలిగింది సుబ్బన్నకు. కరణంకూడా కాయశేస్తులా ఆలోచిస్తూనే ఉన్నాడు లోపలిగొడవ ఎందుకు తెలియలేదా అని. "లంచం పెట్టి వదిలించుకోడం లేదుగదా" అన్నాడు సుబ్బన్న. "ముందు మనం ఐదువందలిచ్చి ఇంకా ఇస్తామని చెబితే మళ్ళీ అక్కడెందుకు పుచ్చుకుంటాడు" అన్నాడు కరణం.

లోపలనుండి పోలీసు వచ్చి నాగడి పెళ్లాన్ని లోపలికి తీసుకెడుతూ గస్తీ తిరిగే పోలీసుల చెవులో ఏదో ఊదాడు. వాళ్లు తుపాకులు క్రింద పెట్టి అరుగులమీద చతికిలబడ్డారు.

"ఆఁ! దొరికాడన్నమాట. అందుకే పోలీసులు గస్తీ తిరగడం మాని కూర్చున్నారు." అన్నాడు కరణం. "ఒకే దొరికాడట, దొరికాడట" అనే కేకలు ఎక్కువయ్యాయి జనంలో. మధ్య మధ్య ఒకొక్కళ్ళు "ఎక్కడ దొరికాడు" అంటున్నారు.

"అయితే నాగడి పెళ్ళాన్ని లోపలికితీసుకెళ్ళారెందుకు?" అని అడిగాడు సుబ్బన్న.

"నాగడి శవాన్ని కొయ్యడానికి పట్నం తీసుకుపోతారు. అంచేత కడసారిగా చూడ్డానికయి ఉంటుంది" ఈ సమాధానం బాగానే తోచింది సుబ్బన్నకు.

"నాగడి శవాన్నీ వెంకట్రావునూ ఓసారి ఇవతలకు తీసుకొస్తే బాగుండును చూచి పోదుము" అనుకుంటున్నారు కొందరు. తుపాకీ దెబ్బతో చచ్చిపోయిన వాడిని చూడాలని కొందరు కని పెట్టుకున్నారు. ఓ గంట గడిచేసరికి ప్రతి వారిలోనూ విసుగు పుట్టింది. ఆ జరిగే విచారణ బయట జరిగితే బాగుండుననుకున్నారు. కొంతమంది కరణాన్ని పోయి చూచి రమ్మన్నారు. కాని ఆయనకు వెళ్ళడానికి భయమేసింది.

"కరణంగారూ ఉరి అంటే ఎలా తీస్తారూ" అని అడిగాడు సుబ్బన్న.

"మెడకు త్రాడుకట్టి గోతిలో వ్రేలాడ తీస్తారు చాల బాధ పడతాడు"

"పడవలసిందే వెధవ. నన్ను కూడా చంప బోయాడు. ఈళ్ళొళ్ళపడిందాకా నే బతుకు తాననుకోలేదు. పిస్తోలు తెచ్చి పేలుస్తాడా లేకపోతే వెధవ" అని తిడుతున్నాడు సుబ్బన్న.

"అప్పుడు నీ దగ్గరుండే పదిమంది ఎవరో అందర్నీ ఇక్కడే ఉండమను సాక్ష్యమివ్వాలి. లేకపోతే కబురంపు" అన్నాడు కరణం.

సుబ్బన్న వాళ్ళందర్నీ రావించాడు. వాళ్ళు పోలీసులతో మాట్లాడతారని, నాగడి శవం దగ్గరకంట నడతారని మిగతా వాళ్ళకు వాళ్ళమీద అసూయ పుట్టింది.

కొంత సేపటికి ఇద్దరు పోలీసులు ఇవతల కొచ్చారు. "అదిగో వస్తున్నారంటే వస్తున్నారు." అని అందరు నిక్క బొడుచుకు చూస్తున్నారు. నిశ్శబ్దం ఆవహించింది. కొంతమంది మెల్ల కుర్రాళ్ళను దూరంగా పొమ్మని కసురుతున్నారు.

సర్కిలూ, వెంకట్రావు యిక యికల్తోను పకపకల్తోనూ ఇవతలకొచ్చారు అందరకూ ఆశ్చర్యం వేసింది నాగడి శవం లేదు, వెంకట్రావుకు సంకెళ్ళూ లేవు. చడీచప్పుడు లేకుండా పోలీసు వాళ్ళు వచ్చిన దారినే పోయారు. శవాన్ని ఇంట్లోనే కప్పెట్టేశారని పుకారు బయలు దేరింది. "మళ్ళీ పై యజమానులకు తెలుపుదాం" అన్నాడు కరణం. సాక్ష్యానికని కూర్చున్న కూలాళ్ళు తాము అనుకున్న గౌరవం పొంద లేదని విచారించారు.

మర్నాడు కరణానికి నోటీసు వచ్చింది. "ఇటువంటి అనవసర రిపోర్టులు ఇస్తే ఉద్యోగం ఊడిపోగలదు జాగ్రత్త" అని. కరణానికి గంగ వెర్రులెత్తినయ్. అసలు సంగతి అర్థం కాలేదు.

"ఓ ఐదు వందల రూపాయలు వదలించి బాగా బుద్ధి చెప్పావు" అంటూ ఆటోమాటిక్ పిస్టలును ముద్దు పెట్టుకున్నాడు వెంకట్రావు. నాగడు భార్యతో సహా రెండు నెలల వరకు పట్నంలో గడపడానికి వప్పుకున్నాడు. తరువాత ఆలోచించుకో వచ్చులే, అని వంద రూపాయ లిచ్చాడు. పోలీసువాళ్ళ కిచ్చిన దానితో మూడు వందలు వదలినా తనంటే సుబ్బన్నకు భయం కలిగినందుకు సంతోషించాడు.

వెంకట్రావు కబురుపంపే వరకు సుబ్బన్న చేనుకు నీరు కట్టుకోడానికి వెళ్ళలేదు

పన్ను అడిగితే కాల్చేస్తాడేమోనని కరణం భయపడుతున్నాడని తెలిసి సూరయ్య చేత పంపించాడు డబ్బు. సరిగ్గా నూట ఎనభై అయిదు రూపాయలే పుచ్చుకున్నాడు కరణం. ★

ఫ్రెంచి సినిమా పరిశ్రమ

(40-వ పేజీ తరువాయి)

మయింది. ఆ సంవత్సరం లియాన్ బ్లూమ్ అమెరికాతో ఒక ఏర్పాటు చేశాడు—ఫ్రెంచి అత్తర్లు వగైరా అమెరికాకు ఎగుమతి చేసి హాలీవుడ్ చిత్రాల దండును రానిచ్చాడు. వాటి రాకతో ఫ్రెంచి చిత్ర నిర్మాణం పీక నొక్కినట్టయి పోయింది. ఈ కబంధహస్తం సడలించడానికి 1948 లో పారిస్ ఫిలిం ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ద్వారా ఫ్రాన్సుకు దిగుమతి అయే హాలీవుడ్ చిత్రాల సంఖ్య ఏడాదికి 121 గా నిర్ణయించ బడింది. ప్రతి పదమూడు వారాలలోనూ—మూడు, నెలలలోనూ—అయిదు వారాలు థియేటర్లలో ఫ్రెంచి చిత్రాలే. ఆడాలని నిర్బంధించ బడింది. ఇది కాక ఫ్రాన్సులో నడిచే చిత్రాలన్నిటిపైనా 5 మొదలు 10 ఫ్రాంక్ లవరకూ ప్రేక్షకపన్ను విధించబడి, ఈ పన్ను ద్వారా వచ్చిన మొత్తం ఫ్రెంచి చిత్రాల సహకారానికి నిధిగా ఏర్పాటు చేయబడింది. రెండవచిత్రం ప్రారంభించే నిర్మాతలకు మొదటిచిత్రంమీద కట్టిన పన్ను ముదరా ఇవ్వబడుతుంది.

ఈ ఒప్పందాన్ని రద్దు చెయ్యటానికి అమెరికనులు శాయశక్తులా కృషి చేసి 1950 జూన్‌లో ప్రభుత్వం వరకూ దీన్ని తీసుకు పోయినారు. కాని ఈ విషయం సంప్రతింపులు జరగరాదని పత్రికలూ, సినిమా యూనియనులూ హోరా హోరి పోరాడాయి. తాత్కాలికంగా అమెరికనులు తిరోగమించారు. ఈ నెల మరొక అమెరికను "దాడి" ప్రారంభం అవుతున్నది. ఈ "దాడి"ని ఎదుర్కొనటానికి సినిమా రక్షణ సంఘం ఒకటి తయారవుతున్నది. ఈ సంఘంలో చిత్రనిర్మాతలూ, టెక్నీషియనులూ, సినిమా ప్రేక్షకులూ మొదలైన వారున్నారు. వీరంతా కలిసి, ఫ్రాన్సులోకి ఏటా 120 విదేశీ చిత్రాలకు మించి దిగుమతి కాకుండా చూడాలనీ—అంటే 65 ఇతర దేశ చిత్రాలు పోగా, 55 హాలీవుడ్ చిత్రాలు మాత్రమే దిగుమతి కావలసి ఉంటుంది—, దేశీయ చిత్రాలు మూడు నెలలలో 6 వారాలు ఆడాలనీ ఆందోళన చేస్తున్నారు ఇదివరకు సాధించిన విజయమే వీరికి ప్రోత్సాహం ఇస్తున్నది. వీరికి విజయం కలుగుతుందని ఆశించుదాం.

(సెప్టెంబరు 8 "న్యూస్టేట్స్మన్ అండ్ నేషన్" లోని హర్బర్ట్ లయిన్ హాన్ వ్యాసం ఆధారంతో.)

★

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., Madras

ఆజాద్ కళాకేంద్ర బాలికల నృత్యప్రదర్శన



కోటేశ్వరి, వసంతకుమారి

త్వరలో వెలువడనున్నది.

ప్రసిద్ధ ఫ్రెంచి నవలాకారుడు

అలెగ్జాండర్ డ్యూమా

రచించిన

కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో

(మొదటిభాగం)

అనువాదం:

సూరంపూడి సీతారామ్

ఆంధ్రపత్రిక సచిత్రవారపత్రికనుండి పునర్ముద్రితము.

వెల: మూడున్నర రూపాయలు

ప్రకాశకులు:

ఆంధ్రగ్రంథమాల,

మద్రాసు 1.